ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 19.09.2026 | సంపుటి : 13 సంచిక : 60 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల

## షెడ్యూల్ విడుదల

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఆర్టీసీలో కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబరు 9న ఎన్నికలు నిర్వహించి, 17న ఫలితాలు వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు. 2016 జులై 19న ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించగా.. మళ్లీ ఇప్పుడు జరుగుతున్నాయి. ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన సంఘాలనే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు సంఘాలు రీజియన్,

మిగతా 2లో..

## శాసనసభ నిరవధిక వాయిదా



2లో..



# దానంపై హైకోర్టు అనర్హత వేటు

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే విషయంలో తుదితీర్పు
- స్పీకర్ నిర్ణయం సరికాదని వ్యాఖ్య
- అసెంబ్లీ నియోజకవర్గ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఈసీకి సమాచారమిచ్చిన ధర్మాసనం



హైదరాబాద్(జనంసాక్షి):ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. దానం విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అతనిపై అనర్హత వేటు వేస్తూ సీజే ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన దానం.. కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్‌ఎస్.. స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో విచారణ చేపట్టిన స్పీకర్.. చట్టపరంగా దానం పార్టీ మారలేదంటూ మార్చి 11న తీర్పు నిచ్చారు.స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దానం నాగేందర్ బీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారని, 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు పలు ఆధారాలు సమర్పించామని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా.. సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ మార్చి 11న తీర్పు ఇచ్చిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన సీజే ధర్మాసనం ఇవాళ తుది తీర్పు వెలువరించింది. ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఈసీకి సమాచారం ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన నాటి నుంచే దానంపై అనర్హత వేటు వర్తిస్తుందని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది

### మిగిలిన 8 మందిపైనా అనర్హతవేటు పడేవరకు పోరాటం: కేటీఆర్

2లో..

### దానం సుప్రీంకు వెళ్లకుండా రాజీనామా చేయాలి

- దీనిపై సర్వోన్నత న్యాయస్థానంలో కేవియట్ పిటిషన్ వేస్తాం
- భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

2లో..

### ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటాం

- సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచనలేదు
- ఎన్నికల్లోనే కొట్లాడుతాం: దానం

తెలంగాణకు మరో 9.56 లక్షల ఇళ్లు

# కేటాయించండి

కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిశారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి, తుమ్మల, సీఎస్ సంజయ్ జాజు ఉన్నారు. తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు సీఎం కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రానికి మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను

మిగతా 2లో..

‘ఎర్రవల్లి’ భూముల వ్యవహారంపై వాస్తవాలను

# ప్రజల ముందుంచుతాం

- సిద్దిపేటకు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీల బృందం
- వెలికట్టలో అసైన్డ్ భూములు, భూ రికార్డుల పరిశీలన



సిద్దిపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర భూముల వ్యవహారం రాజకీయంగా వేడెక్కింది. భూములపై ప్రభుత్వం చేపట్టిన విచారణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీల బృందం శుక్రవారం సిద్దిపేట జిల్లాలో పర్యటించింది. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ తదితరులు బృందంలో పాల్గొన్నారు.ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర భూములు, వెంకటాపూర్ ఎర్రవల్లి మధ్య భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు కలెక్టరేట్‌లో అధికారులను

మిగతా 2లో..

### ఎర్రవెల్లిలో రెండో రోజూ కొనసాగిన భూసర్వే

2లో..

# ఎల్‌నినోను ఎదుర్కొంటాం

### తాగునీటికే ప్రాధాన్యత ఇస్తున్నాం

### తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్రను ఒప్పించేలా కేంద్రం చొరవ తీసుకోవాలి

- రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి
- సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దుబారా చేసింది
- మిగతా ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే, ఇప్పటికే తెలంగాణ సస్యశ్యామలంగా ఉండేది
- రాజకీయాలకు పోకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ మరమ్మతులు చేస్తున్నాం
- వచ్చే వర్షాకాలం నాటికి వాటిని అందుబాటులోకి తెస్తాం
- అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): ఉత్తర తెలంగాణ రైతాంగ భవిష్యత్తుతో ముడిపడిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకునేలా రాష్ట్ర బీజేపీ నాయకులు ఒత్తిడి తేవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మహారాష్ట్రతో అవసరమైన అంతర్రాష్ట్ర అంగీకారం సాధించే బాధ్యతను కేంద్రం స్వీకరించేలా తెలంగాణ బీజేపీ నాయకులు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించాలని సూచించారు. రాష్ట్రంలో విమర్శలు చేయడానికే పరిమితం కాకుండా, తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం ఢిల్లీని ఒప్పించడం ద్వారా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని స్పష్టం చేశారు.ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో సాగునీటి పరిస్థితులపై శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి నుంచి కాళేశ్వరం వరకు, శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ వరకు, పాలమూరు-రంగారెడ్డి నుంచి రాజీవ్ భీమా, జవహర్ నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ వరకు రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి పథకాల స్థితిగతులను సభ ముందుంచారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన తప్పిదాలను ప్రస్తావించిన సమయంలో ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తెలంగాణ రైతుల ఆశలకు ఆధారంగా నిలవాల్సిన నీటిపారుదల రంగాన్ని అప్పులు, అసంపూర్తి పనులు, సాంకేతిక వైఫల్యాల ఊబిలోకి నెట్టారని గద్గద స్వరంతో విమర్శించారు. తుమ్మిడిహెట్టి కేంద్రంగా రూపొందించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల పథకాన్ని వదిలిపెట్టడం దేశ సాగునీటి చరిత్రలోనే అతిపెద్ద వ్యూహాత్మక తప్పిదాల్లో ఒకటని ఉత్తమ్ పేర్కొన్నారు. అప్పటికే సుమారు రూ.2 వేల కోట్ల

మిగతా 2లో..

# 22ఏపై ఉన్నతస్థాయి కమిటీ

- సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ ఛైర్మన్‌గా ఏర్పాటు
- భూసంబంధిత సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్(జనంసాక్షి):22ఏ నిషేధిత భూములతోపాటు ఇతర భూసంబంధిత సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక అడుగేసింది. ఈ మేరకు ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను ఛైర్మన్‌గా నియమించింది. న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతులను సభ్యులుగా

మిగతా 2లో..

# రూ.వెయ్యికోట్లు ఇవ్వు చాలు

### మా ఆస్తులు రాసిచ్చేస్తాం

సీఎం ఎక్కడంటే అక్కడ సంతకం పెడతా: కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి):ఫార్ములా-ఈ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో విచారణకు హాజరయ్యారు. కేటీఆర్‌తో పాటు మరో ముగ్గురు నిందితులు కూడా నేటి విచారణకు వచ్చారు.కేసీఆర్‌ను ఎలా ఇబ్బంది పెట్టాలా అని ప్రభుత్వం చూస్తుందని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి తనపై ఎన్ని కేసులు పెట్టినా ఏం చేయలేరని అన్నారు. బీఆర్‌ఎస్‌లోని నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టాలనేదే కాంగ్రెస్ లక్ష్యంగా కనబడుతోందని మండిపడ్డారు. మేనిఫెస్టోను అమలు చేయడంపై కాకుండా ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్ నేతలను టార్గెట్ చేశారని ఆక్షేపించారు. ఫార్ములా ఈ రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ కోర్టు విచారణ అనంతరం కేటీఆర్ మాట్లాడారు.కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్

మిగతా 2లో..

### కబ్జాచేసినట్టు నిరూపిస్తే మూకుమ్మడిగా రాజీనామా చేస్తాం

ప్రజలకు అవాస్తవాలు చెప్పకండి.. మీలాగా నేను కబ్జాలు చేయలేదు:హరీశ్‌రావు

సిద్దిపేట(జనంసాక్షి): తన జీవితం తెరిచిన పుస్తకమని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతల సిద్దిపేట పర్యటన నేపథ్యంలో స్పందించారు. “సిద్దిపేటకు కాంగ్రెస్ నేతలు వస్తున్నారట.. నా భూములు చూసిపోతారట. దాని కోసం అంతమంది పోలీసులు

మిగతా 2లో..

56 ఏళ్ల ఛైర్మన్ పదవికి

# వారెన్ బఫెట్ గుడ్‌బై..



న్యూయార్క్(జనంసాక్షి): ఆధునిక కార్పొరేట్ నాయకత్వ చరిత్రలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచ దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ బెర్క్‌షైర్ హాత్‌వే ఛైర్మన్ పదవి నుంచి దిగిపోయారు. గత ఐదు దశాబ్దాలకు పైగా ఈ బాధ్యతల్లో కొనసాగిన ఆయన.. నేడు వైదొలిగారు. ఈ విషయాన్ని కంపెనీ శుక్రవారం వెల్లడించింది. తక్షణమే ఈ మార్పు అమల్లోకి వచ్చినట్లు తెలిపింది.96 ఏళ్ల వారెన్ బఫెట్ ఇకపై కంపెనీలో గౌరవ ఛైర్మన్‌గా ఉంటారని ప్రకటించింది. బోర్డులో డైరెక్టర్‌గానూ కొనసాగుతారని పేర్కొంది. బెర్క్‌షైర్ హాత్‌వే కొత్త ఛైర్మన్‌గా బఫెట్ తనయుడు హోవర్డ్ బాధ్యతలు అందుకోనున్నారు. 1993 నుంచి హోవర్డ్.. బెర్క్‌షైర్ హాత్‌వే

మిగతా 2లో..



# ఏప్రిల్ నాటికి పనులు పూర్తి కావాల్సిందే

- గత గోదావరి పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కావొద్దు
- ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమష్టిగా ఏర్పాట్లు చేయండి
- కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి):కుంభమేళా తరహాలోనే రాబోయే గోదావరి పుష్కరాలను నిర్వహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని, అందుకు అనుగుణంగా వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమష్టిగా ముందుకెళ్లాలని అధికారులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన “గోదావరి పుష్కరాలు - 2027”

మిగతా 2లో..

# బెంగాల్‌లో దీదీకి షాక్

నామినేషన్ ఉపసంహరించుకున్న నందిగ్రామ్ అభ్యర్థి

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల వేళ మాజీ సీఎం మమతా బెనర్జీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెండు స్థానాల్లో ఉప ఎన్నికకు ఇంకా నెల రోజుల సమయం ఉండగా.. మమత వర్గానికి చెందిన టీఎంసీ అభ్యర్థి సంచితా ప్రధాన్ నందిగ్రామ్ ఉప ఎన్నిక బరి నుంచి తప్పుకొన్నారు. ఈ మేరకు ఆమె తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. బెంగాల్ సీఎం సువేందు అధికారితో సమావేశమైన అనంతరం

మిగతా 2లో..



# ఇరాన్‌లో అమెరికాకు నిరసన సెగ



ట్రంప్‌కు వ్యతిరేకంగా టెహ్రాన్‌లో భారీ ర్యాలీ..

లక్షలాది మంది రోడ్లపైకి వచ్చి ఆందోళన

టెహ్రాన్(జనంసాక్షి): అగ్ర రాజ్యం అమెరికా తీరుపై ఇరాన్‌లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. యుద్ధం మొదలై నెలలు గడుస్తున్నా.. దుందుడుకు చర్యలు ఆగడం లేదంటూ శుక్రవారం లక్షలాది మంది ఇరాన్ పౌరులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. దేశం కోసం తాము కూడా ఆయుధాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రతిజ్ఞ చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ నాశనమవ్వాలంటూ నినాదాలు చేశారు. యుద్ధం మొదలైన తర్వాత ఇరాన్‌లో చేపట్టిన అతిపెద్ద ర్యాలీ ఇదే.దేశ ఐక్యతను ప్రతిబింబించేలా ప్రభుత్వ సూచన మేరకు శుక్రవారం భారీ సంఖ్యలో ఇరాన్ పౌరులు రోడ్ల మీదకు వచ్చారు. జాతీయ పతాకాన్ని చేతబట్టి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇరాన్ పోర్టులను దిగ్బంధనం సహా పలు ఆంక్షలు విధించడంపై మండిపడ్డారు. పరిమిత సైనిక శిక్షణ తీసుకొని, దేశ రక్షణ కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చిన యువత.. సైనిక దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. వీళ్లంతా పారామిలిటరీ రివెల్యూషనరీ గార్డ్స్‌కు అదనపు లేయర్‌గా వ్యవహరించనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించనున్నారు. అమెరికా చర్యల నేపథ్యంలో తన బలాన్ని చాటుకునేందుకు ఇరాన్ ప్రభుత్వం ఈ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో లక్షలాది మంది పాల్గొన్నారు.

# ఎర్రవెల్లిలో రెండో రోజూ కొనసాగిన భూసర్వే

మర్కుక్ (జనంసాక్షి) :సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో 325 సర్వే నంబర్ భూములకు సంబంధించి చేపట్టిన సర్వే ప్రక్రియ రెండో రోజూ కొనసాగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం ఏడీ సుదర్శన్ ఆధ్వర్యంలో సర్వే అధికారులు ఐదు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో భూముల కొలతలు చేపట్టారు. భూముల హద్దులు, విస్తీర్ణం తదితర అంశాలను పరిశీలించడంతోపాటు సంబంధిత రెవెన్యూ రికార్డులను కూడా అధికారులు పరిశీలించారు.ఐదు బృందాలతో కొలతలుజిల్లా నుంచి వచ్చిన సర్వే అధికారులు ఐదు బృందాలుగా విడిపోయి 325 సర్వే నంబర్ పరిధిలోని నిర్దేశిత ప్రాంతాల్లో కొలతలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులతో సరిపోల్చే ప్రక్రియ చేపట్టారు. భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డుల్లో నమోదైన వివరాలు తదితర అంశాలను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది.

రికార్డుల నమోదు.. మ్యాపుల పరిశీలన

క్షేత్రస్థాయిలో పూర్తయిన సర్వేకు సంబంధించిన వివరాలను అధికారులు ల్యాప్‌టాప్‌లలో నమోదు చేశారు. సర్వేలో గుర్తించిన హద్దులు, కొలతలు తదితర వివరాలతో మ్యాపులను రూపొందిస్తూ వాటిని రికార్డులతో సరిపోల్చే పనిని కొనసాగించారు. సర్వేకు సంబంధించిన సాంకేతిక, రెవెన్యూ అంశాలపై అధికారులు దృష్టి సారించారు. సమీక్ష సర్వే అనంతరం ఏడీ సుదర్శన్, డీఐ సౌమ్యనాయక్, మర్కుక్ తహసీల్దార్ సరితతో పాటు రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వే వివరాలు, ఇప్పటివరకు నమోదైన సమాచారం, రికార్డుల పరిశీలన తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. సర్వే ప్రక్రియకు సంబంధించిన వివరాలను అధికారులు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిసింది.పోలీసు బందోబస్తు సర్వే నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మర్కుక్ ఎస్సై యునస్ అహ్మద్ అలీ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్వే ప్రాంతంలో పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ అధికారుల విధులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా భద్రతా చర్యలు చేపట్టారు. 325 సర్వే నంబర్ భూముల సర్వే ప్రక్రియ మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# రెండు విభాగాలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్!

## క్షేత్రస్థాయి తనిఖీలకు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ కమాండోలు

హైదరాబాద్(జనంసాక్షి):విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఒక్కో విభాగానికి ఒక్కో డైరెక్టర్?ను నియమించాలని, అలాగే 96 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రతిపాదించినట్లు సమాచారం. తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ప్రత్యేక విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలుగా విభజించి, ఒక్కోదానికి ఒక డైరెక్టర్‌ను నియమించాలని ప్రభుత్వం కసరత్తులు చేపడుతోంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ పథకం కింద వందల కోట్ల రూపాయల విలువైన వడ్లను తీసుకున్న మిల్లర్లు ప్రాసెస్ చేసిన ధాన్యాన్ని సర్కారుకు అప్పగించకుండా రూ.1,700 కోట్ల ఎగవేతలకు పాల్పడినట్లు ఇటీవల విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు జరిపిన దాడుల్లో తేలింది. ఈ మొత్తంలో రూ.1,000 కోట్లకు పైగా ఇప్పటికే మిల్లర్ల నుంచి అధికారులు వసూలు చేశారు. దీంతో రాష్ట్ర చరిత్రలో ఇదో మైలురాయిగానూ నిలిచింది. ఈ నేపథ్యంలో ఈ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రస్తుతం విభజన ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.

**ఆ అధికారులకు విడివిడిగా బాధ్యతలు**

ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి డైరెక్టర్ జనరల్ నేతృత్వం వహిస్తుండగా ఆ స్థానంలో అదనపు డీజీపీ డీఎస్ చౌహాన్ ఉన్నారు. ఐజీపీగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఏఆర్ శ్రీనివాస్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. తాజా కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రెండు డైరెక్టర్ పోస్టులను ఖరారు చేస్తే ఏఆర్ శ్రీనివాస్‌తో పాటు ప్రస్తుతం ఇక్కడ ఐజీగా పనిచేస్తున్న అభిషేక్ మహంతికి కూడా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. విజిలెన్స్ పర్యవేక్షణ బాధ్యతలను ఏఆర్ శ్రీనివాస్‌కు, అలాగే అభిషేక్ మహంతికి ఎన్‌ఫోర్స్‌మెంట్ పర్యవేక్షణను అప్పగించాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రధాన కార్యాలయంతో పాటు మరో ఎనిమిది ప్రాంతీయ ఆర్వీఈఓ అధికారుల కార్యాలయాలు కూడా పనిచేస్తున్నాయి. ప్రతి ఆర్వీఈఓ కార్యాలయానికి అడిషనల్ ఎస్పీ హోదా అధికారి నేతృత్వం వహిస్తున్నారు. ఇలా ప్రతి కార్యాలయంలో ఒక డీఎస్పీ, 3 నుంచి 5 మంది ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు నియమించేలా ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం కార్యాలయ పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీల నిర్వహణకు వెళ్తున్న క్రమంలో తరచుగా సమీపంలోని ఆర్వీఈఓ నుంచి సహాయం కోరవలసి వస్తోంది.

# తెలంగాణకు మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించండి

కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కేంద్రమంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల, సీఎస్ సంజయ్ జాజు ఉన్నారు. తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా రాష్ట్రానికి తొలి విడతలో 2 లక్షల ఇళ్లను కేటాయించిన సంగతి తెలిసిందే.తెలంగాణలోని 11.56 లక్షల పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని సీఎం గతంలో కేంద్రానికి విజ్ఞప్తి చేయగా, 2 లక్షలు మంజూరు అయ్యాయి. మిగిలిన 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని శివరాజ్‌సింగ్‌ను సీఎం కోరారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై కేంద్రమంత్రికి వివరించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని, ఎల్‌నినో నేపథ్యంలో తాగు నీరు, విద్యుత్ కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం సహకారం ఇవ్వాలని కోరారు.

**తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం**

దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు తెలంగాణలో సన్నబియ్యాన్ని విజయవంతంగా పంపిణీ చేస్తున్నట్లు సీఎం తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్?ను రైతులకు అందించి ప్రోత్సహిస్తున్నట్లు కేంద్రమంత్రికి వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 250 ఎకరాల్లో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పంట మార్పిడిపై రైతులను ప్రోత్సహించేందుకు సహకారం అందించాలని సీఎం కోరారు.



**హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం**

హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం జరుగుతండటంతో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హైదరాబాద్‌కు వచ్చారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అచ్చెన్నాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# శాసనసభ నిరవధిక వాయిదా

హైదరాబాద్(జనంసాక్షి):శాసనసభ నిరవధిక వాయిదా పడింది. మొత్తం 8 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు కొనసాగాయి. శాసనసభలో 51 గంటల 52 నిమిషాల పాటు చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా 4 బిల్లులను ఆమోదించారు.అసెంబ్లీ నియమ నిబంధనల ప్రకారమే బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ చర్యలు తీసుకున్నారని మంత్రి శ్రీధర్?బాబు తెలిపారు. సభ నియమ నిబంధనలను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే రూపొందించిందని గుర్తుచేశారు. ఆనాడు హరీశ్‌రావు నేతృత్వంలోనే నియమనిబంధనలు రూపొందించారన్నారు. స్పీకర్ పట్ల బీఆర్ఎస్ సభ్యులు వాడకూడని పదాలు వాడారని శ్రీధర్?బాబు ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్‌ను దూషించటం అందరినీ బాధించిందని ఆయన తెలిపారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో 4 బిల్లులు ఆమోదం పొందాయని వివరించారు. 22ఏ అంశం సహా 4 కీలక అంశాలపై స్వల్పకాలిక చర్చ జరిగిందన్నారు. 22ఏ అంశంపై రెవెన్యూ మంత్రి, సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన సమాధానం ఇచ్చారన్నారు.

# '22ఏ'పై ఉన్నతస్థాయి కమిటీ

ఉండనున్నారు. దీంతోపాటు 118 జీవో బాధితులకు ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎల్బీనగర్‌లో 9,700 ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.

వారికి రేపటి నుంచి పట్టాల పంపిణీ

భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 12 అంశాల కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా ముందుకెళ్తోంది. దీంతో ఇతర భూసంబంధిత సమస్యలనూ వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని ప్రకారం ఎల్బీనగర్‌లో జీవో నంబర్ 118 కింద అందిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం వల్ల ఆయా కాలనీల్లో నివసిస్తున్న 9,700కు పైగా కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియ శనివారం నుంచే ప్రారంభమవుతుందని తెలిపింది. ఈ రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# దానం సుప్రీంకోర్టుకు వెళ్లకుండా రాజీనామా చేయాలి

హైదరాబాద్(జనంసాక్షి): హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టుకు వెళ్లకుండా రాజీనామా చేయాలని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై సుప్రీం కోర్టులో రేపు కేవియట్ పిటిషన్ వేస్తామని తెలిపారు. "దానం నాగేందర్‌పై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భాజపా పోరాడుతుంది. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే వారికి కోర్టు తీర్పు చెంపపెట్టు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ బుద్ధి తెచ్చుకోవాలి. మిగిలిన వాళ్లతో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలి" అని డిమాండ్ చేశారు.హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం.. ఇది ప్రజాస్వామ్య విజయమని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. "కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్‌కు హైకోర్టు తీర్పు చెంపపెట్టు. ప్రజాస్వామ్యంలో విలువలతో కూడిన భారతదేశ రాజ్యాంగాన్ని పరిరక్షించే తీర్పుగా భావిస్తున్నాం. ప్రజాస్వామ్యం గెలిచింది. ఆరు నెలల్లో తీర్పు రావడం ఇదే మొదటిసారి. ఈ తీర్పు అందరి విజయంగా భావిస్తున్నాం" అని పేర్కొన్నారు.

# ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటాం

హైదరాబాద్(జనంసాక్షి): అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. న్యాయస్థానం తీర్పు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా.. సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని తెలిపారు. "ప్రజా క్షేత్రంలో, ఎన్నికల్లోనే కొట్లాడుతాం. ఎన్నికల్లో పోరాడటం నాకు కొత్త కాదు. పోరాటాలు చేసే ఈ స్థాయికి వచ్చా. ఎన్నికలు వస్తే.. ప్రజా క్షేత్రంలో పోరాడుతా.. విజయం సాధిస్తా" అని దానం తెలిపారు.

# మిగిలిన 8 మందిపైనా అనర్హతవేటు పడేవరకు పోరాటం: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. సత్యమేవ జయతే అంటూ ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. పార్టీ ఫిరాయించిన మిగితా వారికీ ఇదే పరిస్థితి పడుతుందన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ పార్టీకి విజయం లభించిందన్నారు. అమ్ముడుపోతే అనర్హత తప్పదని తాము గతంలోనే చెప్పామన్న కౌశిక్ రెడ్డి, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ అని పేర్కొన్నారు. మిగిలిన 8 మందిపైనా అనర్హత వేటు పడేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఉపఎన్నికలో బీఆర్ఎస్? పార్టీ జెండా ఎగరవేస్తుందని కౌశిక్?రెడ్డి తెలిపారు. అధికారం ఉందని విర్రవీగితే ఎదురుదెబ్బలు తప్పవని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో.. చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

# ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

రాష్ట్రస్థాయిలో ఉంటాయి. రెండింటికీ వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏలు, సర్వీస్ నిబంధనలు తదితర సమస్యలపై సంస్థ యాజమాన్యం ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టబద్ధమైన హక్కు ఈ సంఘానికే ఉంటుంది. కార్మికుల తరపున ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలకంగా వ్యవహరిస్తోంది. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి మినహా మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది. 2018లో ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం నిర్వహించలేదు.

# కబ్జాచేసినట్టు నిరూపిస్తే మూకుమ్మడిగా రాజీనామా చేస్తాం

ఎందుకు? మూడు జిల్లాల నుంచి 3 వేల మంది పోలీసులను రప్పించారు. మీరు వస్తారని నాకు చెబితే నేనే ఏర్పాట్లు చేసేవాడిని కదా? కాంగ్రెస్ నేతలకు అన్నం పెట్టి.. నా తోట చూపించేవాడిని కదా! మీరు అంత భయపడాల్సిన అసవరం లేదు. సిద్దిపేట అంటేనే ప్రేమ, ఆప్యాయత, ఆతిథ్యానికి చిరునామా. అంతమంది పోలీసులను పెట్టుకుని రావాల్సిన అవసరం లేదు. నా భూమి చూడండి.. ఉన్నది ఉన్నట్లు ప్రజలకు చెప్పండి. అవాస్తవాలు చెప్పకండి. మీలాగా నేను కబ్జాలు చేయలేదు.. ప్రజల సొమ్ము దోచుకోలేదు. నా ఆస్తులన్నీ అఫిడవిట్‌లో రాశాను. నా ఆస్తులు, నా పనితీరును చూసే ఏడుసార్లు గెలిపించారు" అని హరీశ్‌రావు అన్నారు.

# 56 ఏళ్ల ఛైర్మన్ పదవికి వారెన్ బఫెట్ గుడ్‌బై

బోర్డు సభ్యుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా వారెన్ బఫెట్ వాటాదారులకు లేఖ రాశారు. "కాలమే ఎప్పుడూ గెలుస్తుంది. అయినప్పటికీ ఆ కాలం నా పట్ల కాస్త ఉదారత చూపించింది" అని పేర్కొన్నారు.1970లో బెర్క్‌షైర్ హాత్‌వే ఛైర్మన్‌గా వారెన్ బఫెట్ బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాతే వస్త్ర పరిశ్రమగా ఉన్న కంపెనీని బీమా రంగం వైపు తీసుకెళ్లారు. టెక్స్‌టైల్, బీమా, రైల్‌రోడ్స్, కన్జ్యూమర్ బ్రాండ్, ఈక్విటీల్లోకి మూలధనాన్ని మళ్లించారు. క్రమశిక్షణ, దీర్ఘకాలిక వ్యూహాలతో ఆయన అనుసరించిన మదుపు వ్యూహాలు వాటాదారులకు భారీ లాభాలను తెచ్చిపెట్టాయి. స్టాక్‌మార్కెట్ ప్రపంచంలో గొప్ప ఇన్వెస్టర్‌గా ఖ్యాతి గడించారు. పెట్టుబడులతో అపర కుబేరుడిగా మారిన ఆయన పాటించిన, చెప్పిన మదుపు సూత్రాలు పెట్టుబడిదారులకు ఆచరణీయంగా మారాయి. ఇక, గతేడాది చివర్లో సీఈవో పదవి నుంచి వారెన్ బఫెట్ వైదొలగగా.. ఆయన స్థానంలో గ్రెగ్ అబెల్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు.

# రూ.వెయ్యికోట్లు ఇవ్వు చాలు

చెబుతున్నారని, ముఖ్యమంత్రి తమ ఆస్తులు తీసుకొని ఒక రూ.వెయ్యి కోట్లు ఇస్తే చాలని అన్నారు. ఆయనకు ఇదే తమ ఆఫర్ అని పేర్కొన్నారు. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెడతామని, రూ.వెయ్యి కోట్లు ఇస్తే చాలని అన్నారు. రూ.లక్ష కోట్లలో మిగిలిన రూ.99 వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేయాలని పేర్కొన్నారు. ఆ డబ్బులతో రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతు భరోసా, పంటలకు బోనస్ హామీలు అమలు చేయొచ్చన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆడబిడ్డలకు తులం బంగారం కూడా ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నిస్తే తమపై కేసులు పెట్టారన్న ఆయన, తమను ఎంత ఇబ్బంది పెట్టినా తట్టుకుంటామన్నారు.

హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో కేసీఆర్ ఎప్పుడో భూమి కొన్నారని కేటీఆర్ తెలిపారు. అప్పట్లో ఎకరా రూ.5 లక్షలు ఉన్నప్పుడే కేసీఆర్ భూమి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. కేసీఆర్ వెయ్యి ఎకరాలు దోచుకున్నారని అసత్య ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. వెయ్యి ఎకరాలు అని చెప్పి ఇటీవల అసెంబ్లీలో కేసీఆర్‌కు 67 ఎకరాలే ఉన్నాయని రేవంత్‌రెడ్డే చెప్పారని గుర్తు చేశారు. 'రేవంత్‌రెడ్డి ఎన్ని కేసులు పెడతావో పెట్టుకో - ఏం చేయలేవ'ని హెచ్చరించారు.

**అక్టోబర్ 30కి తదుపరి విచారణ వాయిదా**

ఫార్ములా-ఈ రేస్ కేసులో కేటీఆర్ నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో విచారణకు హాజరయ్యారు. నాంపల్లి కోర్టులో విచారణకు ఏ1 కేటీఆర్‌తో పాటు ఏ2 అరవింద్ కుమార్ (ఐఏఎస్), ఏ3 బి.ఎల్.ఎన్.రెడ్డి కూడా హాజరయ్యారు. విచారించిన న్యాయమూర్తి తదుపరి విచారణ అక్టోబర్ 30కి వాయిదా వేశారు. ఫార్ములా-ఈ రేస్ నిర్వహణకు సంబంధించి హెచ్ఎండీఏ నుంచి సుమారు రూ.55 కోట్లను విదేశీ సంస్థలకు బదిలీ చేయడంపై ఏసీబీ అభియోగపత్రం దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ-రేస్ నిర్వాహణలో అవసరమైన అనుమతులు, ఆర్థిక విధివిధానాలు పాటించలేదని ఏసీబీ పేర్కొంది. ఏసీబీ ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకొని నిందితులకు కోర్టు సమన్లు జారీ చేసింది. ఫార్ములా-ఈ రేసు కేసులో ఏ-1గా కేటీఆర్, ఏ-2గా ఐఏఎస్ అర్వింద్ కుమార్, ఏ-3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బి.ఎల్.ఎన్.రెడ్డి, ఏ-4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు ఉన్నారు. వ్యక్తిగత కారణాలతో గత విచారణకు కేటీఆర్ గైర్హాజరయ్యారు.

# ఎల్‌నినోను ఎదుర్కొంటాం

విలువైన పనులు చేపట్టిన పథకాన్ని సమగ్ర పరిశీలన లేకుండా పక్కనపెట్టి, ప్రాజెక్టు కేంద్రాన్ని మేడిగడ్డకు మార్చారని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద అందుబాటులో ఉన్న ప్రాణహిత జలాలను గ్రావిటీ ఆధారంగా శ్రీపాద ఎల్లంపల్లికి తరలించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉంటే, ఉత్తర తెలంగాణలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందేదని చెప్పారు.సుమారు రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే అవకాశమున్న ప్రణాళికను అహంకారపూరితమైన రీ?ఇంజినీరింగ్‌తో లక్ష కోట్లకు మించిన ఆర్థిక భారంగా మార్చారని మంత్రి ఆరోపించారు. వ్యయాన్ని పెంచడం తప్ప ఆయకట్టుకు నమ్మకమైన నీరందించే వ్యవస్థను నిర్మించలేకపోయారని విమర్శించారు. భారీగా ప్రజాధనం వెచ్చించినప్పటికీ కాళేశ్వరం వ్యవస్థకు ఆరంభ ద్వారమైన మేడిగడ్డే కుంగిపోవడం గత పాలకుల అవగాహన లోపానికి, ప్రణాళికా వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమన్నారు."రాష్ట్ర ప్రజలను, మన పిల్లలను, రాబోయే తరాలను తాకట్టు పెట్టి 11 నుంచి 12 శాతం వడ్డీలకు అప్పులు తెచ్చారు. ఇప్పుడు కాళేశ్వరం రుణాల చెల్లింపుల కోసమే మా ప్రభుత్వం ఏటా నీటిపారుదల బడ్జెట్ నుంచి రూ.15 వేల కోట్ల నుంచి రూ.16 వేల కోట్ల వరకు భరించాల్సి వస్తోంది. ఇంతటి ఆర్థిక భారాన్ని మోపిన తరువాత కూడా రైతుకు నమ్మకమైన నీటి భద్రతను ఇవ్వలేకపోయారు" అని ఉత్తమ్ ధ్వజమెత్తారు.వేల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం గుండెకాయ కళ్లముందే కుప్పకూలిపోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయిన తరువాత కూడా గత పాలకులు తమ తప్పును అంగీకరించకుండా ప్రస్తుత ప్రభుత్వంపై ఎదురుదాడి చేయడం హాస్యాస్పదమన్నారు. డీపీఆర్‌లో పొందుపరిచిన సాంకేతిక ప్రమాణాలు, నిర్మాణ సమయంలో అనుసరించిన పునాది విధానం, నాణ్యత నియంత్రణ, నిర్వహణ నిర్ణయాలపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది సాధారణ మరమ్మతుతో పరిష్కారమయ్యే లోపం కాదని, డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ?అన్ని దశల్లోనూ తలెత్తిన తీవ్ర సమస్య అని వివరించారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఒకదానిపై మరొకటి ఆధారపడిన కాస్కేడ్ వ్యవస్థగా పనిచేస్తాయని ఉత్తమ్ సభకు వివరించారు. మేడిగడ్డ వద్ద నీటిని నిల్వచేసి అవసరమైన హైడ్రాలిక్ హెడ్‌ను సృష్టించిన తరువాతే లక్ష్మీ పంప్‌హౌస్ ద్వారా అన్నారానికి ఎత్తిపోసే వీలుంటుందని చెప్పారు. అక్కడి నుంచి సుందిళ్లకు, సుందిళ్ల నుంచి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించాల్సి ఉంటుందన్నారు. భద్రతా కారణాలతో బ్యారేజీల గేట్లు మూసి నీటిని నిల్వ చేయలేని పరిస్థితిలో పంపులను ఆన్ చేయాలన్న డిమాండ్ సాంకేతిక వాస్తవాలను విస్మరించడమేనని స్పష్టం చేశారు.మూడు బ్యారేజీల భద్రతపై రాజకీయ నిర్ణయాలు తీసుకునే ప్రసక్తే లేదని మంత్రి తేల్చిచెప్పారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ డ్యాం భద్రతా సంస్థ, కేంద్ర జల సంఘం సూచించిన ప్రతి పరీక్షను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో అవసరమైన క్షేత్రస్థాయి పరీక్షలు చేపట్టగా, పునరుద్ధరణ డిజైన్ల బాధ్యతను ఏఎఫ్ఆర్‌వై ఇండియా?ఐఐటీ బాంబే నిపుణులకు అప్పగించినట్లు తెలిపారు. పునాదుల స్థితి, సీపేజ్, అప్‌లిఫ్ట్ ప్రెజర్, కాంక్రీట్ నాణ్యత, స్టిల్లింగ్ బేసిన్, ఎనర్జీ డిసిపేషన్ వ్యవస్థలను శాస్త్రీయంగా పరిశీలించిన తరువాతే తుది పునరుద్ధరణ పనులు చేపడతామని చెప్పారు."మాకు రాజకీయ కక్ష లేదు. కాళేశ్వరం ప్రజల సొత్తు; అందులో ఖర్చయింది తెలంగాణ ప్రజల ధనం. అవసరమైన వ్యయం ఎంతైనా సరే, నిపుణుల సిఫారసులకు అనుగుణంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నదే మా సంకల్పం. ప్రజల ప్రాణాలు, ప్రాజెక్టు భద్రత విషయంలో మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోము" అని ఉత్తమ్ ప్రకటించారు.పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 90 శాతం పూర్తయిందన్న గత పాలకుల వాదనను మంత్రి తోసిపుచ్చారు. కొన్ని పంప్‌హౌస్‌లు లేదా రిజర్వాయర్ల నిర్మాణాన్నే మొత్తం ప్రాజెక్టు పురోగతిగా చూపడం సాంకేతికంగా సరికాదన్నారు. ఇంటేక్ వెల్, పంప్‌హౌస్‌లు, విద్యుత్?యాంత్రిక వ్యవస్థలు, ప్రెజర్ మెయిన్లు, రిజర్వాయర్లు, కాలువల నెట్‌వర్క్, భూసేకరణ, పునరావాసం, పర్యావరణ అనుమతులు పూర్తయినప్పుడే ఒక ఎత్తిపోతల పథకం రైతుకు ప్రయోజనం అందిస్తుందని వివరించారు. పెండింగ్ అంశాలను పరిష్కరించి ప్రజాధనం వృథా కాకుండా ఈ పథకాన్ని పూర్తి చేసే బాధ్యతను ప్రజా ప్రభుత్వం స్వీకరించిందన్నారు.శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వినియోగించిన నీటి వివరాలను మంత్రి సభ ముందుంచారు.

# 'ఎర్రవల్లి' భూముల వ్యవహారంపై వాస్తవాలను ప్రజల ముందుంచుతాం

వివరాలు అడిగి తెలుసుకునేందుకు కాంగ్రెస్ బృందం వెళ్లింది. ఇదే సమయంలో కొండపాక మండలం వెలికట్టలో హరీశ్‌రావు బంధువు హనుమంతరావుకు చెందినట్లు పేర్కొంటున్న 6 ఎకరాల 2 గుంటల అసైన్డ్ భూములను కూడా బృందం పరిశీలించింది.మల్లు రవి మాట్లాడుతూ.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ వాస్తవంగా ఎంత భూమి ఉంది? దాని వివరాలేమిటన్నది తేల్చేందుకే ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ భూముల విషయంలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఎర్రవల్లి భూముల వ్యవహారంపై కూడా వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని అన్నారు.చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిధిలోని భూములపై కలెక్టరేట్‌లో జరిగే విచారణలో కాంగ్రెస్ ఎంపీలంతా పాల్గొంటారని తెలిపారు. వెంకటాపూర్ ఎర్రవల్లి మధ్య ఉన్న భూముల రికార్డులను పరిశీలిస్తామని చెప్పారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూములు ఎలా చేతులు మారాయనే విషయాన్ని ప్రభుత్వం తేల్చాలని డిమాండ్ చేశారు. అలాగే జన్వాడలో ఈడీ అటాచ్ చేసిన భూములు, 111 జీవోకు సంబంధించిన భూముల యాజమాన్యంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని కోరారు. గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు తాము చెబుతున్న అక్రమాలు, అవకతవకలను ప్రజల ముందుకు తీసుకురావడమే తమ పర్యటన ఉద్దేశమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గత పాలన సాగలేదని ఆరోపించారు. సిద్దిపేట పర్యటనలో గత పాలనకు సంబంధించిన మరిన్ని అంశాలను ప్రజల దృష్టికి తీసుకువస్తామని తెలిపారు. బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూముల వ్యవహారంలో ఇప్పటివరకు బయటకు వచ్చిన వివరాలు పూర్తిస్థాయి కాదని, ఇంకా అనేక అంశాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. ఎర్రవల్లి భూములపై ప్రభుత్వం చేపట్టిన విచారణలో వాస్తవాలు బయటపడతాయని పేర్కొన్నారు.భూములు లాక్కెళ్లడానికి రాలేదు : అద్దంకి దయాకర్ భూ వ్యవహారాలపై వాస్తవాలను తెలుసుకోవడానికే సిద్దిపేటకు వచ్చామని, ఎవరి భూములూ లాక్కోవడానికి రాలేదని అద్దంకి అన్నారు. హరీశ్‌రావు ఫామ్‌హౌస్ చుట్టూ సుడా పార్క్ పేరుతో రక్షణ కంచె ఏర్పాటు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. పార్క్ కోసం భూమిలిచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన పరిహారం, వారికి చెల్లించిన మొత్తాలపై కూడా వివరాలు బయటకు రావాలని అన్నారు.వెలికట్టలో అసైన్డ్ భూముల పరిశీలనకాంగ్రెస్ నేతల బృందం కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో సర్వే నంబర్ 271లోని 6 ఎకరాల 2 గుంటల అసైన్డ్ భూములను పరిశీలించింది. ఈ భూములకు సంబంధించిన రికార్డులు, పహాణీలు, పట్టాదారు వివరాలతో పాటు కొనుగోలు, బదలాయింపు జరిగిందా? నిబంధనలు పాటించారా? అనే అంశాలపై తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకుంది.

## బెంగాల్‌లో దీదీకి షాక్

పోటీ నుంచి వైదొలుగు తున్నట్లు సంచిత ప్రకటించడం గమనార్హం. తన వర్గానికి చెందిన టీఎంసీ అభ్యర్థి సంచితా ప్రధాన్ నందిగ్రామ్ నుంచి నామినేషన్ ఉపసంహరించు కోవడంపై మమతా బెనర్జీ స్పందించారు. ఇది ప్రతి పక్షాలను అంతం చేయాలనే ఆలోచనతో భాజపా చేస్తున్న కుట్ర అని విమర్శించారు. భాజపా గతంలో మహారాష్ట్రలోని ఉద్ధవ్ ఠాక్రే పార్టీని చీల్చిందని, ఇప్పుడు తన పార్టీనీ లేకుండా చేయాలనే ఇలాంటి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ఇది చీకటి రోజని, తన వర్గం నుంచి ఎవరూ పోటీ చేయకుండా భాజపా అడ్డుకుంటోందని విమర్శించారు. ఉప ఎన్నికల కోసం ఇక నందిగ్రామ్ నుంచి మరెవరినీ బరిలోకి దించబోమని.. తమ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తుందని దీదీ ప్రకటించారు. భాజపాను దేశం నుంచి వెళ్లగొట్టడమే తన లక్ష్యమని.. అందుకోసం ఇండియా కూటమితో కలిసి పని చేస్తానని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్ తోపాటు రెజినగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే.

# ఏప్రిల్ నాటికి పనులు పూర్తి కావాల్సిందే...

కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా... గోదావరి పుష్కరాల సన్నద్ధత, ప్రముఖ దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు, ఘాట్ల నిర్మాణం, రవాణా, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్ల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... పుష్కర ఏర్పాట్లలో సమన్వయ లోపం తలెత్తకుండా జిల్లాలవారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చేపట్టాల్సిన అదనపు ఏర్పాట్లపై ఘాట్ల వారీగా ప్రత్యేకంగా కలెక్టర్లతో క్షేత్రస్థాయి అధ్యయనం చేయించామన్నారు. పుష్కరాలు మొదలయ్యే నాటికి పూర్తయ్యే అవకాశమున్న పనులకే తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. చివరి వరకూ వేచి చూడకుండా గ్రౌండ్ రియాల్టీకి అనుగుణంగా ప్రతి పనికి ఒక నిర్దేశిత గడువును విధించుకోవాలని ఆదేశించారు. ఆయా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఇంటిగ్రేటెడ్ డ్యాష్‌బోర్డ్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. ఇంజినీర్ల కొరత తలెత్తకుండా ఆర్అండ్‌బీ, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలన్నారు. పుష్కరాల సమయంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని చెప్పారు. భద్రాచలం వద్ద ఎస్టీపీ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ఎన్ని నిధులనైనా కేటాయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, పుష్కర ఏర్పాట్లు, పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని తేల్చి చెప్పారు.

# వర్షపాతం లోటు పరిస్థితిపై ముసాయిదా తీర్మానం

- ప్రవేశపెట్టిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో 2026 నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తీవ్రమైన వర్షపాతం లోటు తలెత్తిందని, సెప్టెంబర్‌లో రుతుపవనాలు మరింత బలహీనపడుతాయని భారత వాతావరణ శాఖ అంచనాలున్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. దీనిపై ముసాయిదా తీర్మానాన్ని అసెంబ్లీలో ఆయన ప్రవేశపెట్టారు. ముసాయిదాలోని అంశాలు ఈ విధంగా ఉన్నాయి. 2026 జూన్ 1 నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో సాధారణంగా కురవాల్సిన 664.5 మి.మీ. వర్షపాతానికి గాను 536.5 మి.మీ. మాత్రమే నమోదైంది. 20 శాతం లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 19 జిల్లాలు వర్షాభావ కేటగిరీలో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. వర్షపాతం లోటు, వర్షాల మధ్య వ్యవధి ఎక్కువగా ఉండటంతో పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. రాష్ట్రంలో వానాకాలం సాధారణ పంటల సాగు విస్తీర్ణం 139.29 లక్షల ఎకరాలుంటే, కేవలం 88 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. వరి సాగు విస్తీర్ణం దాదాపు 18 శాతం తగ్గింది. పంట మొలకెత్తకపోవటంతో పలుమార్లు విత్తనాలు వేయాల్సి రావటంతో రైతులు, కౌలు రైతులపై పెట్టుబడి భారం ఎక్కువైంది. 2026 సెప్టెంబర్ 15 నాటికి రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో 585 టీఎంసీల సామర్థ్యానికి గాను 241 టీఎంసీల లైవ్ స్టోరేజ్ మాత్రమే ఉంది. గత ఏడాది ఇదే రోజున 497 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గటంతో, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు రిజర్వు చేసుకోవాల్సి ఉంది. ఇప్పుడున్న నీటి నిల్వలు యాసంగి పంటలకు సాగునీటిని అందించేందుకు సరిపోవు. భూగర్భ జలాలు తగ్గటం, చెరువులు, కుంటల్లో ఆశించిన నీటి లభ్యత లేనందున తాగునీటి కొరత తలెత్తే అవకాశముంది. వర్షాభావ పరిస్థితులు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ఉపాధి, పశు సంపద, పశుగ్రాసం లభ్యతపై ప్రభావం చూపుతున్నాయి. సాగునీరు, తాగునీటి సరఫరాకు భూగర్భ జలాలు, విద్యుత్తుపై ఆధారపడే పరిస్థితి పెరుగుతోంది. ఇప్పుడున్న పరిస్థితిని అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించింది. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగుకు అవసరమైన విద్యుత్తు సరఫరాకు అవసరమైన ఉపశమన చర్యలు చేపడుతోంది. పరిస్థితుల తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం తగిన సహాయ సహకారాలను అందించాల్సిన అవసరముంది. రాష్ట్రంలో నెలకొన్న వర్షభావ పరిస్థితుల నుంచి ఉపశమన చర్యలు, అధిగమించే చర్యలకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగినంత సహాయం అందించాలి. ఎల్ నినో పరిస్థితులను క్షేత్రస్థాయిలో అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వీలైనంత త్వరగా రాష్ట్రానికి పంపించాలి. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి నుంచి తగిన సాయం మంజూరు చేయాలి. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిలో కేంద్ర వాటాను సత్వరమే విడుదల చేయాలి. పంట నష్టం/ఇన్‌పుట్ సబ్సిడీ, తాగునీరు, పశుగ్రాసం, పశు సంపద పరిరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువులు, ఇతర జలవనరుల పునరుద్ధరణతో పాటు ఉపశమన చర్యలకు తగిన సహాయం అందించాలి. అవసరమైతే అందుకు వీలుగా నిబంధనలను సడలించాలి. వీబీజీరాంజీ పథకంలో 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలి. వీబీజీరాంజీపై ఖర్చు పెట్టే వ్యయాన్ని మొత్తం కేంద్ర ప్రభుత్వమే భరించాలి. రాష్ట్రంలో అమల్లో ఉన్న 60 రోజుల సీజనల్ సస్పెన్షన్ కాలాన్ని సడలించాలి. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించేందుకు లేబర్ బడ్జెట్‌ను తగినంతగా పెంచాలి. రాష్ట్రానికి అవసరమైన ఎరువులను తగినంతగా, సకాలంలో కేటాయించాలి. ప్రభావిత జిల్లాలకు ముందుగానే రేక్‌ల ద్వారా సరఫరా చేయాలి. పర్ డ్రాప్ మోర్ క్రాప్ కింద కేటాయింపులను పెంచి డ్రిప్ ఇరిగేషన్‌ను వేగంగా విస్తరించాలి. మిషన్ ఫర్ ఇంటిగ్రేటేడ్ డెవెలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్ కింద కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు ఆర్థిక సహాయం అందించాలి. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయాలి. తెలంగాణకు అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్తు కేటాయించాలి. కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో కేటాయించకుండా ఉన్న కోటా నుంచి దీన్ని అందించాలి. విండో–10 కింద 5 మిలియన్ టన్నుల బొగ్గు లింకేజీ నిర్ధారించి రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు రేక్‌ల లభ్యతను పెంచాలి. విద్యుత్తు ట్రాన్స్ మిషన్ ఛార్జీలను సడలించి, అవసరమైన సాయం అందించాలి. తాగు, సాగు నీటి అవసరాలు, కరువు నివారణ చర్యలకు కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీ మంజూరు చేయాలి. చెరువులు, నీటి వనరుల పునరుజ్జీవనం, పురోగతిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి వివిధ కేంద్ర పథకాల కింద తగిన సహాయం అందించాలి. 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్‌ఆర్‌బీఎం రుణ పరిమితిని జీఎస్‌డీపీలో 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలి. తద్వారా ఉపశమన, నివారణ చర్యలకు అవసరమైన అదనపు వ్యయాన్ని రాష్ట్రం భరించేందుకు అవకాశం కల్పించాలి. రైతులు, బలహీన వర్గాల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద అదనపు ఆర్థిక సాయం అందించాలి. అందుకు అవసరమైన తీరుగా నిబంధనలను సడలించాలి. ఈ అంశాలపై ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

# చిన్నారి స్టెల్లాకు అండగా సీఎం ప్రజావాణి

- ప్రతి నెల రూ.10 వేల విలువైన మందులు అందేలా గద్వాల్ విజయలక్ష్మి ఏర్పాట్లు



హైదరాబాద్ (జనంసాక్షి) : తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తొమ్మిదేళ్ల చిన్నారి స్టెల్లాకు సీఎం ప్రజావాణి అండగా నిలిచింది. చిన్నారి పరిస్థితిని తెలుసుకున్న సీఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి, స్టెల్లాకు అవసరమైన మందులు నిరంతరం అందేలా చర్యలు తీసుకున్నారు. స్టెల్లా చికిత్సకు ప్రతి నెల సుమారు రూ.10 వేల విలువైన మందులు అవసరమవుతున్న నేపథ్యంలో, అవి నెలనెలా అందేలా ఏర్పాట్లు చేసి, శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో స్టెల్లా తల్లి కవితకు మెడిసిన్ కిట్‌ను అందజేశారు. జూబ్లీహిల్స్ ప్రాంతంలో నివసిస్తున్న కవిత ఒంటరిగా తన కుమార్తెను చూసుకుంటున్నారు. వైద్య ఖర్చులు భారంగా మారడంతో ఇటీవల సీఎం ప్రజావాణిని ఆశ్రయించి తన పరిస్థితిని గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు. వినతిపై వెంటనే స్పందించిన గద్వాల్ విజయలక్ష్మి, చిన్నారికి అవసరమైన మందులు మధ్యలో ఆగకుండా అందేలా చర్యలు చేపట్టారు. "ప్రజావాణికి వచ్చే ప్రతి వినతి వెనుక ఒక కుటుంబం, ఒక బాధ, ఒక ఆశ ఉంటుంది. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో వెంటనే స్పందించడం మన బాధ్యత" అని గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. సహాయం అందడంతో స్టెల్లా తల్లి కవిత ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, గద్వాల్ విజయలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయవ్యవస్థ సజీవంగానే ఉంటుంది

- బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా నాయకులు నాగరాజు గుర్రాల

జోహన్నెస్‌బర్గ్ (జనంసాక్షి) : అధికారంలో ఉన్నవారు ఎన్ని కుట్రలు, కక్షసాధింపు చర్యలు చేపట్టినా దేశంలో న్యాయవ్యవస్థ సజీవంగా ఉందనే విషయాన్ని ఈరోజు వెలువడిన రెండు న్యాయస్థానాల నిర్ణయాలు నిరూపించాయని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా నాయకులు నాగరాజు గుర్రాల పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన స్వాగతించారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికై, ఆ పదవికి రాజీనామా చేయకుండానే మరో పార్టీలో చేరడం ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించడమేనని అన్నారు. 'ఈ తీర్పుతో న్యాయం గెలిచింది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యమే అంతిమ విజేతలని మరోసారి రుజువైంది. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేల విషయంలోనూ రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం నిష్పక్షపాతంగా నిర్ణయం తీసుకోవాలి. ప్రజల ఓటుతో గెలిచిన నాయకులు వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీ మారడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం" అని నాగరాజు గుర్రాల పేర్కొన్నారు. అదేవిధంగా, బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. క్రిశాంక్‌కు రిమాండ్ విధించాలన్న అభ్యర్థనను నాంపల్లి కోర్టు తిరస్కరించడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు గట్టి సమాధానమని వ్యాఖ్యానించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేసి, వారి గొంతును అణచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణలో రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు నిరాశలో ఉన్నారని, అనేక రంగాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. "ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ద్వారా ప్రజల ప్రశ్నలను ఆపలేరు. అధికారంలో ఉన్నవారు ఎన్ని ప్రయత్నాలు చేసినా చట్టానికి ఎవరూ అతీతులు కారు. హైకోర్టు తీర్పు, మన్నె క్రిశాంక్ రిమాండ్‌ను నాంపల్లి కోర్టు తిరస్కరించడం–ఈ రెండు నిర్ణయాలు న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలపరిచాయి" అని అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును నిశితంగా గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం చెబుతారని నాగరాజు గుర్రాల పేర్కొన్నారు.

# జీరమ్ లోయ కేసులో 10 మంది దోషులకు మరణశిక్షకు సీడీఆర్వో ఖండన

హైదరాబాద్ (జనంసాక్షి) : 2013 నాటి జీరమ్ లోయ మావోయిస్ట్ దాడి కేసులో, 29 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు మరణించిన ఘటనలో దోషులుగా పేర్కొన్న వారికి ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు మరణశిక్ష విధించిందని సీడీఆర్వో తెలిపింది. 2013 జీరమ్ లోయలో జరిగిన సంఘటనతో సహా, మరణానికి దారితీసే ఏ విధమైన రాజకీయ హింస లేదా మరణమైనా విచారకరమైనదని, మరణశిక్ష అనేది ఒక రకమైన చట్టబద్ధమైన హత్య అని, ఇది జీరమ్ లోయ ఘటనకు గానీ లేదా మరే ఇతర నేరానికి గానీ పరిష్కారం కాదని పేర్కొంది. సామాజిక అసమానత మరియు సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలపై మరణశిక్ష ప్రభావం ఉంటుందని, ఈ కేసులో మరణశిక్ష విధించడం ద్వారా న్యాయాన్ని అందుకోవడంలో ఉన్న అసమానత, వ్యక్తిగత బాధ్యత, మరియు సమాజంలోని అత్యంత పేద మరియు వెనుకబడిన వర్గాలపై పడే తీవ్ర ప్రభావంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్ట్ 39ఎ యొక్క 'డెత్ పెనాల్టీ ఇండియా రిపోర్ట్' ప్రకారం, మరణశిక్ష పడిన ఖైదీలలో 74.1% మంది ఆర్థికంగా బలహీనవర్గాలకు చెందినవారేనని, జీరమ్ లోయ దాడి కేసులో మరణశిక్ష పడిన పదిమంది కూడా సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన పేద ఆదివాసీ గ్రామస్తులు. వీరంతా తాము నిర్దోషులమని మొదటినుంచీ చెబుతున్నారని, తమను అన్యాయంగా ఇరికించారని వారి కుటుంబ సభ్యులు గట్టిగా వాదిస్తున్నారని, ఈ దాడికి సీనియర్ మావోయిస్ట్ నాయకులు కుట్ర పన్నారని చెప్పారు తప్ప, ఈ పదిమంది ఆ దాడిని నిర్దేశించినట్లు ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందని, ఎన్ఐఏ కోర్టు ఆదివాసీలకు విధించిన ఈ మరణశిక్ష కేవలం రాజ్యం యొక్క కక్షసాధింపు చర్య మాత్రమేనని తెలిపింది. ఈ రోజు వచ్చిన తీర్పు, ప్రభుత్వం చేసిన ఆ ప్రకటనలకు పూర్తి విరుద్ధంగా ఉందని, శిక్ష ఖరారయ్యే ముందు 13 ఏళ్ల పాటు విచారణ ఖైదీలుగా ఉంచడం అనేది తీవ్రమైన స్వేచ్ఛాపహరణం. దీనివల్ల ఖైదీలే కాకుండా వారి కుటుంబాలు మరియు సమాజం కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. జీరమ్ లోయ కేసులో విచారణ పెండింగ్‌లో ఉన్న సమయంలోనే, ఒక విచారణ ఖైదీ ఏళ్ల తరబడి జైలులో ఉండి మరణించాడు. వారిని మరణశిక్షకు గురిచేసే నేటి తీర్పు తీవ్రమైన న్యాయ విపత్తును మరింత తీవ్రతరం చేస్తోందని, మరణశిక్షను రద్దు చేసి, దాడికి దారితీసిన పరిస్థితులు, ఈ పదిమంది వహించిన పాత్రను పరిగణనలోకి తీసుకుని జ్యుడీషియల్ రివ్యూ (న్యాయ సమీక్ష) నిర్వహించాలని, అన్ని కేసులలోనూ మరణశిక్ష నిబంధనను పూర్తిగా రద్దు చేయాలని, మావోయిస్టుల నియంత్రణ లేదా గనుల తవ్వకాలు మరియు అభివృద్ధి పనుల పేరుతో ఆదివాసీలను వేధించడం ఆపి, చర్చల మార్గం ద్వారా వారి జీవితాలను మెరుగుపరచాలని సమన్వయ కర్తలు ఆశిష్ గుప్తా, క్రాంతి చైతన్య, ధీమన్ ఛటర్జీ, అరిజిత్ గంగూలీ పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన సుధారాణి



వరంగల్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) : ఇటీవల కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కూడా) చైర్పర్సన్ గా నియమించినందుకు గుండు సుధారాణి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని శుక్రవారం శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేసినారు. కూడా చైర్పర్సన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా రేవంత్ రెడ్డిని హైదరాబాదులోని అసెంబ్లీ లో సుధారాణి కలిసి ధన్యవాదాలు తెలియజేసి అనంతరం వరంగల్ తూర్పు నియోజకవర్గం అభివృద్ధి మరియు వరంగల్ నగర అభివృద్ధి గురించి చర్చించినారు.

# ప్రత్యేక హబ్‌గా నల్లగొండ

- రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : రానున్న కొద్ది రోజుల్లోనే నల్లగొండ ప్రత్యేక హబ్ గా మారనుందనీ,అందుకు అనుగుణంగా హైదరాబాద్ తర్వాత ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నల్లగొండ అభివృద్ధికి కృత నిశ్చయంతో పనిచేస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఇప్పటికే నల్లగొండను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, మౌళిక సదుపాయాల కల్పన చేస్తున్నామని స్పష్టం చేశారు. అందులో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక సదుపాయాలు ఉండేలా నల్లగొండ జిల్లా ఆర్టీసీ బస్ స్టాప్ ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బస్ స్టాప్ ఆధునీకరణపై అసెంబ్లీలోని తన ఛాంబర్లో శుక్రవారం ఆర్టీసీ అధికారులు,కన్సల్టెన్సీ ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్ స్టాప్ ఆధునీకరణకు సంబంధించిన నమూనాను కన్సల్టెన్సీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా నమూనాలో పలు మార్పులు చేయాలని కన్సల్టెన్సీ ప్రతినిధులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ బస్ స్టాప్ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది.అందుకు అనుగుణంగా బస్సుల రాకపోకలు సులభతరం అయ్యేలా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్స్, ప్లాట్ఫారాలు, వెయిటింగ్ హాల్స్, సరిపడా పార్కింగ్,మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఆర్టీసీకి లాభం కలిగించేలా గ్రౌండ్,మొదటి అంతస్తులో షాపింగ్ మాల్ ఏర్పాటు చేయాలని, ప్రజలకు వినోదాన్ని అందించేందుకు రెండవ అంతస్తులో మల్టీప్లెక్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్టీసీ పై విద్యుత్ భారం పడకుండ బస్ స్టాప్ పై భాగంలో సోలార్ ఏర్పాటు చేయాలన్నారు. దసరాకు 2రోజుల ముందు శంకుస్థాపన చేసుకునేలా అందుకు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆర్టీసీ ఎండీ, అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. నిర్మాణ సమయంలో ప్రయాణికులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బస్ స్టాప్ ఆధునీకరణ తరువాత షాపుల రెంట్ల ద్వారా ఆర్టీసీకి 85 లక్షల వరకు ఆదాయం చేకూరే అవకాశం ఉందని కన్సల్టెన్సీ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి,ఆర్టీసీ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# అంతిమంగా న్యాయమే గెలిచింది

- బీసీ కమిషన్ మాజీ సభ్యులు, హైకోర్టు న్యాయవాది ఉపేంద్ర

హైదరాబాద్ (జనంసాక్షి) : దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపు కేసుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీసీ కమిషన్ మాజీ సభ్యులు, హైకోర్టు న్యాయవాది ఉపేంద్ర అన్నారు. స్పీకర్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచి తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్ అభ్యర్థిత్వాన్ని చాలెంజ్ చేసిన టిఆర్ఎస్ నాయకులు కానీ అధికార దుర్వినియోగానికి పాల్పడిన స్పీకర్ సరియైన న్యాయం చేయకపోవడంతో హైకోర్టులో అఫీలు వేసిన టిఆర్ఎస్ నాయకులు తదుపరి విచారణ చేపట్టిన హైకోర్టు దానం నాగేందర్ ఎన్నికను రద్దు చేసిందని, రాజ్యాంగ విలువలు ప్రజాస్వామ్యాన్ని హైకోర్టు కాపాడిందని, ఈ తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని, ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్, స్టేషన్ ప్రకటించాలి

- సూర్యాపేట జిల్లా కేంద్రం బంద్




సూర్యాపేట (జనంసాక్షి) : అఖిల పక్షం ఆధ్వర్యంలో జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్, స్టేషన్ సాధన కోసం సూర్యాపేట జిల్లా కేంద్రం బంద్ పిలుపు నేపథ్యంలో తెలంగాణ యువజన సంఘము మరియు అఖిల పక్షం నాయకులు శుక్రవారం బంద్ నిర్వహించారు. జిల్లా కేంద్రం లో ప్రభుత్వ రంగా బ్యాంక్ లు, షాపింగ్ మాల్స్, కార్పొరేట్ ఆఫీస్ లు, దుకాణలను బంద్ నిర్వహించారు. జిల్లా కేంద్రం లో మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ శాసనసభ్యులు జగదీష్ రెడ్డితో కలిసి అఖిల పక్షం నాయకుల భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ మొదటి అలైన్ మెంట్ కొనసాగించాలని, సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడర్ ఒ స్టేషన్ ఏర్పాటు చేయాలనీ కోరుతూ రెండు నెలల క్రితం రాష్ట్ర మంత్రులకు, ఉమ్మడి నల్గొండ జిల్లా చట్ట సభ సభ్యులకు, రాజకీయ పార్టీ ల రాష్ట్ర అధ్యక్షులకు విజ్ఞప్తి పత్రాలు ఇవ్వటం జరిగింది అని, సుమారు 65 రోజుల నుండి వివిధ పోరాట పద్దతులలో ఉద్యమిస్తున్నారని, 35 రోజులుగా నిరాహార దీక్ష లు కొనసాగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కనీస స్పందన లేకుండా నిమ్మకు నిరేత్తనట్లు ఉండటం సరికాదని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంతానికి రావాల్సిన నీళ్లు దారి మళ్లించారని, స్వ రాష్ట్రంలో ఈ ప్రాంతనికి రావాల్సిన రైలు దారి మల్లించి, ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. సూర్యాపేట మీదుగా మొదటి అలైన్ మెంట్ కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు దారి మళ్ళించిందో ప్రకటించాలని డిమాండ్ చేసారు. బుల్లెట్ ట్రైన్ సాధించే వరకు భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉపాధ్యకులు బషీపంగు సునీల్, రాష్ట్ర అధికార ప్రతి నిధి ఎనిగా సంతోష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పోరెల్ల విప్లవ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు దారావత్ శివ నాయక్, నాయకులు బంటు సందీప్, మహేందర్, వంశీ,వీరన్న మరియు అఖిల పక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సత్ఫలితాలిస్తున్న పోలీసు సిబ్బంది పునర్వ్యవస్థీకరణ

- రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్, సెప్టెంబరు 18 (జనంసాక్షి) : తెలంగాణ పోలీసుశాఖలో చేపట్టిన సిబ్బంది పునర్వ్యవస్థీకరణ, వనరుల హేతుబద్ధీకరణతో ప్రభుత్వానికి భారీగా ఆదా సమకూరుతోంది. వివిధ పదవీ విరమణ చేసిన ఉద్యోగుల వద్ద విధులు నిర్వహిస్తున్న 376 మంది పోలీసు సిబ్బందిని తిరిగి అందుబాటులోకి తీసుకురావడంతోపాటు 20 బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, 7 ఫార్చ్యూనర్లు, 18 ఇన్నోవా క్రిస్టాలు, 58 ఇతర నాలుగు చక్రాల వాహనాలు అందుబాటులోకి వచ్చాయని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ చర్యల ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.90 కోట్ల మేర ఆదా జరిగిందన్నారు. డీజీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్టాఫ్ ఆఫీసర్ల సమావేశంలో మానవ వనరుల ఆడిట్, పునర్వ్యవస్థీకరణపై ఆయన సమీక్షించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లోని 573 మంది సిబ్బందికి చెల్లిస్తున్న 60 శాతం అదనపు చెల్లింపులను ఉపసంహరించడం ద్వారా సుమారు రూ.28.16 కోట్ల ఆదా జరిగినట్లు తెలిపారు. గ్రేహౌండ్స్, ఎస్ఐబీ తదితర విభాగాల పునర్వ్యవస్థీకరణతో అదనంగా అందుబాటులోకి వచ్చిన సిబ్బందిని అవసరాన్ని బట్టి ఇతర విభాగాల్లో వినియోగించనున్నట్లు వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల డీజీపీల ప్రాంతీయ సదస్సుకు తెలంగాణ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను డీజీపీ ఆదేశించారు. అక్టోబరులో జరగనున్న ఈ సదస్సులో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వామపక్ష తీవ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, తీర ప్రాంత భద్రత, కొత్తగా ఉద్భవిస్తున్న నేర ధోరణులు తదితర అంశాలపై చర్చించనున్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా 'ఫిట్ కాప్'

పోలీసు సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమంపై దృష్టి సారిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 'ఫిట్ కాప్' కార్యక్రమాన్ని అమలు చేయాలని డీజీపీ నిర్ణయించారు. ఇందులో ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతోపాటు థైరాయిడ్, మధుమేహం, పోషకాహారం, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించనున్నారు. ఆరోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి అవసరమైన వైద్య సహాయం అందించనున్నారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసిన విషయాన్ని డీజీపీ గుర్తుచేశారు. ఆరోగ్యంగా ఉన్న పోలీసు సిబ్బంది విధులను మరింత సమర్థంగా నిర్వహించగలరని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఐజీ, ఆపై స్థాయిలో మొత్తం 48 పోస్టులు ఉండగా ప్రస్తుతం 24 పోస్టులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని డీజీపీ తెలిపారు. డీఐజీ స్థాయిలో 11 పోస్టులు ఉండగా భవిష్యత్తులో మరో 10 పోస్టులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. 1992, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన అధికారులను అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## పదవ తరగతి మెమో పోయింది

నిరుడు ప్రియాంక తండ్రి వెంకన్న, కాసింపేట(గ్రామం), చివ్వెంల (మండలం), సూర్యాపేట(జిల్లా). ఈ నెల 15న కాసింపేట గ్రామం నుండి సూర్యాపేటకు ఆటోలో వస్తుండగా మార్గమధ్యంలో నా పదవ తరగతి మెమో పోయింది. దొరికినవారు 9885516811 నెంబర్‌కు సమాచారం ఇవ్వగలరు.

# సొంత పార్టీలో వ్యవస్థాపకులే పరాయివాళ్లు

సంపాదకీయం

పార్టీ అంటే ఒక వ్యక్తి కాదు, ఒక సిద్ధాంతం, ఒక కార్యకర్తల సమూహం, ఒక ప్రజాక్షేత్రం అని చెప్పుకుంటాం. కానీ భారత రాజకీయాల చరిత్ర చూస్తే, పార్టీలు చాలావరకు ఒక్క వ్యక్తి చుట్టూనే నిర్మించబడతాయి, ఆ వ్యక్తి బలహీనపడిన క్షణంలోనే అదే పార్టీ అతణ్ణి బయటకు నెట్టేస్తుంది. తెలుగుదేశం పార్టీని 1982లో నందమూరి తారక రామారావు సొంత చేతుల మీదుగా నిర్మించారు. ఆంధ్రుల ఆత్మగౌరవం అనే నినాదంతో ఒక తుఫానులా వచ్చి అధికారంలోకి తెచ్చిన ఆయనే, ఒక దశాబ్దం తరువాత అదే పార్టీలో ఒంటరివాడయ్యాడు. తాను నమ్మి, తనవాడని భావించిన అల్లుడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎమ్మెల్యేలు చీలిపోయి, పార్టీ పగ్గాలు చేజిక్కించుకున్నారు. కర్త, కర్మ, క్రియ అన్నీ తానే అయిన వ్యక్తి, తుది క్షణంలో తన సృష్టిలోనే పరాయివాడయ్యాడు.

ఇదే కథ కాలం మారినా, రాష్ట్రం మారినా, పార్టీ మారినా పునరావృత మవుతూనే ఉంది. బాల్ థాక్రే నెలకొల్పిన శివసేన, మరాఠీ మానుషుల భావోద్వేగాల మీద నిర్మించబడిన పార్టీ, ఆయన మనవడు ఉద్ధవ్ థాక్రే చేతుల్లోకి వచ్చాక ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో రెండుగా చీలిపోయింది. ఎన్నికల సంఘం అసలు పార్టీ గుర్తింపు, పేరు కూడా షిండే వర్గానికే కట్టబెట్టింది. వారసత్వంగా వచ్చిన పార్టీ, రాత్రికి రాత్రి మరొకరి చేతుల్లోకి వెళ్ళిపోవడం మహారాష్ట్ర ప్రజలు కళ్ళారా చూశారు. ఇప్పుడు అదే పంథాలో పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో సైతం చీలిక సంకేతాలు కనిపిస్తున్నాయి. తానే స్వయంగా స్థాపించి, మూడు దశాబ్దాలుగా నడిపిస్తున్న పార్టీలో అరూప్ రాయ్ నేతృత్వంలోని వర్గం తమదే అసలైన తృణమూల్ అని ప్రకటించుకోవడం, ప్రత్యేక గుర్తు, పేరుతో ఎన్నికల సంఘం అనుమతి కోరడం చూస్తుంటే, చరిత్ర మళ్ళీ పునరావృతమవుతోందా అనిపించక మానదు.

ఈ మూడు ఉదాహరణలు వేర్వేరు రాష్ట్రాలవి, వేర్వేరు కాలాలవి అయినా, అంతస్సూత్రం ఒక్కటే. పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థలుగా కాక, వ్యక్తి కేంద్రంగా నడుస్తున్నప్పుడు, అధికారమే అంతిమ లక్ష్యంగా మారినప్పుడు, సిద్ధాంతాలు, విలువలు వెనక్కి నెట్టబడతాయి. అంతర్గత ప్రజాస్వామ్యం లోపించిన పార్టీలో అసంతృప్తి కుములుతూ ఉంటుంది, అది ఏదో ఒక దశలో పేలిపోతుంది. అధికారం లేదా పదవి దక్కని నాయకులు, తమకు మద్దతు కూడగట్టుకున్న వర్గాలతో సొంత పంథా ఎంచుకుంటారు. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, పార్టీ గుర్తు, పేరు, చిహ్నం ఎవరిదన్న విషయంలో తుది నిర్ణయం తీసుకునేది ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలే. వ్యవస్థాపకుడైనా, వారసుడైనా, ఎమ్మెల్యేల బలం ఆధారంగానో, పార్టీ నిర్మాణ పత్రాల ఆధారంగానో నిర్ణయం జరుగుతుంది తప్ప, నైతిక హక్కు ఆధారంగా కాదు. ఇది ఒక రకంగా ప్రజాస్వామ్య వ్యవస్థలోని పారదర్శకతను, చట్టబద్ధతను ప్రతిబింబిస్తున్నా, మరోవైపు రాజకీయ పార్టీలలో వ్యక్తిగత విధేయత కంటే సంఖ్యాబలమే అంతిమంగా గెలుస్తుందన్న చేదు వాస్తవాన్ని కూడా బయటపెడుతుంది.

ప్రజాస్వామ్యంలో పార్టీలు ప్రజల చేత, ప్రజల కోసం పనిచేయాలి తప్ప, ఒక కుటుంబం లేదా ఒక వ్యక్తి ఆస్తిగా మిగిలిపోకూడదు అన్నది ఆదర్శం. కానీ ఆచరణలో, స్థాపకుడు బలంగా ఉన్నంత కాలం పార్టీ అతని చుట్టూనే తిరుగుతుంది, బలహీనపడిన క్షణంలో అదే పార్టీ కొత్త కేంద్రాన్ని వెతుక్కుంటుంది. ఇందులో ద్రోహం అనుకోవాలో, రాజకీయ పరిణామ క్రమం అనుకోవాలో అన్నది వేరే చర్చ. కానీ ఖచ్చితంగా చెప్పగలిగేది ఒక్కటే, అధికార రాజకీయాలు నడిచేది వ్యక్తిగత విధేయతల మీద కాదు, బలాబలాల మీద. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా, ఏ నాయకుడైనా తాను శాశ్వతంగా తన పార్టీకి కేంద్రబిందువుగా ఉంటానని భ్రమపడితే, ఎన్టీఆర్, ఉద్ధవ్ థాక్రే చెప్పే పాఠం ముందు ఉంది. మమతా బెనర్జీకి కూడా అదే పాఠం, భవిష్యత్తు హెచ్చరికగా నిలుస్తుందా అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

# ప్రపంచీకరణలో యూపీఐ పేమెంట్ల మాయాజాలం




ఇటీవల భారత ప్రభుత్వం యూపిఐ పేమెంట్లలో చిన్న చిన్న మార్పులు తీసుకొచ్చింది. ఇది అత్యంత పెద్ద గణనీయమైన మార్పు కాదు. అయినా సరే, భవిష్యత్తులో గణనీయమైన పాత్ర పోషిస్తుందని చెప్పక తప్పదు. ఇది ఒక విడివిడి సంఘటన కాదు. వీటికి నోట్ల రద్దు కాలానికీ అనుసంధానం ఉంది. నోట్ల రద్దు తర్వాత నుండి పేమెంట్ యాప్ ల పరిశ్రమ మరింత అభివృద్ధి చెందింది. కరెన్సీ నోట్లు అవసరమే ఉండలని ఆరోజు మనం విన్నాం. అందుకే,దీన్ని ఒక విడివిడి సంఘటనగా కాకుండా 1990 నుండి కొనసాగుతూ వస్తున్న ఆర్థిక సంస్కరణల్లో అంతర్భాగంగా మాత్రమే చూడగలిగితేనే అసలైన వాస్తవాలు మనకు తేటతెల్లమవుతాయి. ప్రపంచీకరణ ఫలితంగా దేశం తన ద్వారాలు తెరుచుకున్న తర్వాత పేమెంట్ యాప్ల కొనసాగింపు మరింత ప్రతిభావంతంగా ముందుకు నడిచింది. వ్యాపారాలకు సంబంధించి, లావాదేవీలకు సంబంధించి ఇది చాలా చిన్న మార్పుగా కనిపించినప్పటికీ కూడా అత్యంత ప్రతిభావంతంగా ఆర్థిక సంస్కరణల్లో భవిష్యత్తులో పాత్ర వహిస్తుంది అనడంలో సందేహం లేదు. పేమెంట్ యాప్ ల కారణం గా, కరెన్సీ నోట్ల అవసరం తగ్గుతూ ఉండడం కారణంగా దేశ ప్రభుత్వాలకు కూడా ప్రజలకు కరెన్సీ నోట్లు అందివ్వాలి అన్న బాధ్యత నుండి పక్కకు జరిపాయి. ఆ బాధ్యతను ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లు తీసుకొని పండగ చేసుకుంటున్నాయి. విందు భోజనాలు కూడా సిద్ధం అయిపోతున్నాయి.

2016లో నోట్ల రద్దు ప్రక్రియ ఆరంభం అయ్యేటప్పుడు, దాన్ని కొనసాగించే ప్రయత్నం జరిగేటప్పుడు రాత్రికి రాత్రే పెద్ద నోట్లు మాయం అయ్యేటప్పుడు దేశం అత్యంత సులభంగా , చాకచక్యంగా అంతవరకు కొనసాగుతూ వస్తున్న కరెన్సీ మారకాలను కొంతవరకు పక్కకు జరిపి అప్పుడే అభివృద్ధిలోకి వస్తున్న ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్లను ఉపయోగించుకొని యాప్స్ విధానంలో మారకాలను ఆరంభించే దిశ వైపు గురి పెట్టింది.

నోట్ల రద్దు కాలంలో కొద్ది రోజులు భారత పౌరులకు అత్యంత భయంకరమైన ఇబ్బందులు కలిగినప్పటికీ కూడా తర్వాత ప్రారంభమైన యూపిఐ పేమెంట్లు ప్రజలకు అత్యంత సౌకర్యాన్ని అందించగలిగాయి.

ఏదైనా ఒక కొత్త మార్పు ఆర్థిక సంస్కరణ ఆరంభమయ్యేటప్పుడు లేదా కొనసాగుతూ ఉన్నప్పుడు అవి ఆయా కొనుగోలుదారులకు ప్రయోజనం కలిగించడానికి వచ్చాయని భ్రమ కలుగుతుంది. . లేదా, ఆ దేశ ప్రజల ఔన్నత్యాన్ని ఊహించుకుని వారిని అభివృద్ధి చేయడానికి మాత్రమే ఆవిర్భవించాయని మనం భ్రమల్లో మునుగుతాం. గతంలో స్వాతంత్రానికి పూర్వం అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం తమ కాలనీలుగా మార్చేసుకున్న మనదేశంలో రైల్వేలను స్థాపించినప్పుడు అవి భారత ప్రజలకు లేక భారతదేశ వ్యాపారానికి ప్రయోజనం కలిగిస్తుందనే ఉద్దేశంతో రాలేదు. దేశంలోని పెద్ద సంపద అత్యంత సరళంగా, అత్యంత చాకచక్యంగా తమ దేశాలకు దోచుకుపోవడానికి ఏర్పడిన ఒక ప్రయత్నం. అలానే ఏ ఆర్థిక సంస్కరణ అయినా సరే వ్యవస్థల్లో కొనసాగితే బడా కార్పొరేట్ వర్గాలకు తమ లావాదేవీలను సులభం చేయడానికి మాత్రమే పనికొస్తాయి. ఇదే నేపథ్యంలో అభివృద్ధి చెందిన స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్లు, యాప్ల పరిశ్రమ, ఈ కామర్స్ సైట్లు యూపీఐ పేమెంట్ సహకారం ద్వారా వ్యాపారాన్ని మూడు పువ్వులూ, ఆరు కాయలుగా అభివృద్ధి చేశాయి. కానీ, అభివృద్ధి ఫలాలు మాత్రం సాధారణ ప్రజలకు అందలేదని ఆక్స్ ఫామ్ లాంటి ఎన్నో నివేదికలు తెలియజేస్తూ ఉన్నాయి. కరెన్సీ నోట్లు మాత్రమే చలామణిలో ఉన్నప్పుడు దేశ మధ్య తరగతి, యువత నేడున్నంత అప్పుల్లో లేరు. వీటి మాయాజాలం పెరగడం ద్వారా మాత్రమే అవసరమైనవీ, లేనివీ సరుకులు ఈజీ ఈఎంఐ ల ద్వారా ఇళ్లల్లోకి ప్రవేశించి అసంఖ్యాకమైన మధ్యతరగతి ప్రజల్ని అప్పుల్లో ముంచారు. ఎవరో మనకు బావిలోకి తోసేయడం కాదు. ప్రపంచీకరణలో మార్కెటీకరణ ప్రచారాలు ఎంత ఆర్భాటంగా, ఎంత అందంగా జరుగుతాయో అంటే, ఆ క్షణంలో ప్రచారాల మాయలో పడి, విచక్షణా జ్ఞానం కోల్పోయి మనకు మనమే ఉచ్చు బిగించుకొని ఈఎంఐ బావిలోకి దూకేస్తాం. ఇదే ప్రపంచీకరణ నీతి. ఆ వేలం వేర్రిలో మనమే కలిసిపోతాం. అది యూపీఐ పేమెంట్లు కావచ్చు. ఫ్యాషన్ ఇండస్ట్రీ కావచ్చు. కొనుగోలు సరుకుల విలాసాల ప్రచారాలు కావచ్చు. భారీ వినోదాలు కావచ్చు. అంతా మనకి మనమే సమర్పితం అయిపోతాం. ఇదే ఈనాటి ప్రపంచీకరణ. ఒకవైపు డబ్బు సంచులు ఒక వర్గానికి. మరోవైపు అస్థిరత మెజారిటీ వర్గానికి. నేటి కాక్రోచ్ పార్టీ ఆవిర్భావం నేపథ్యం పరిశీలిస్తే ఇదే అసంతృప్తి, అస్థిరత మనకు స్పష్టం అవుతుంది. కాదేదీ వ్యాపారానికి అనర్హం అంటూ నేడు సాధారణ వివాహాలు కూడా భారీ సినిమా సెట్టింగ్ లామారిపోయాయి. మధ్యతరగతిని నడ్డి విరుస్తున్నాయి.

ఇక కథలోకి వస్తే, యూపీఐ పేమెంట్ లలో మనిషికి మనిషికి మధ్య ఏ రకమైన మార్పులు లేనప్పటికీ కూడా చిన్నచిన్న సంస్థలను పెద్దగా ప్రభావితం చేయలేనప్పటికీ కూడా మున్ముందు వాటిలో కూడా మార్పులు చేస్తూ ఉంటాయనడంలో సందేహం లేదు.

పి టు ఎమ్ ( పర్సన్ టు మర్చంట్) 2000 రూపాయల వరకు ఏ రకమైన చార్జీలు లేవు. యూపీఐ ట్రాన్జక్షన్ లలో ఇవి 60.5 శాతం ఉన్నాయి. అలానే పి టు పి 37 శాతం ఉన్నాయి. అంటే దాదాపు 97.5 శాతం యూపీఐ ట్రాంజంక్షన్ ఏ రకమైన చార్జీల పరిధిలోకి రావని హిందూ పత్రిక ద్వారా తెలుస్తుంది. కాబట్టి ఆందోళన చెందాల్సినంత అవసరం ప్రస్తుతానికి అయితే లేదు.

అయితే, ఈ మారిన వ్యూహం ఆర్థిక సంస్థలకూ, పేమెంట్ బ్యాంకులకూ, యాప్లను అందించే థర్డ్ పార్టీలకూ మంచి విందు భోజనాన్ని అందించగలవు.

సేకరించిన నిధులలో 40 శాతం పేమెంట్ బ్యాంకులు తీసుకుంటాయి. పేమెంట్ బ్యాంకులలో మొదటి వరుసలో ఎస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్‌లు ఉన్నాయని హిందూ ద్వారా తెలుస్తుంది. 50 శాతం యూపీఐ ట్రాన్సాక్షన్ లు ఎస్ బ్యాంక్ ఆధీనంలో ఉన్నాయి. 18.3 శాతం ఐసిఐసిఐ బ్యాంక్ పరిధిలో ఉన్నాయి. కాబట్టి, మెజారిటీ వాటా ప్రస్తుతానికైతే ఈ రెండు సంస్థలు అందుకుంటున్నాయి. రిసీవింగ్ బ్యాంకులు కూడా సేకరించిన నిధులలో 30 శాతం అందుకుంటాయి. మిగిలిన 20 శాతం యూపీఐ థర్డ్ పార్టీలు అందుకుంటాయి. యూపీఐ పేమెంట్లలో 46 శాతం ఉన్న ఫోన్ పే, 32 శాతం ఉన్న గూగుల్ పే ఈ విందు భోజనాన్ని ఆరగిస్తాయి. మిగిలిన 10 శాతం పేమెంట్లను బ్యాంకులతో అనుసంధానం చేసే సంస్థలు అందుకుంటాయి. ఒక కొత్త వ్యాపార గీతానికి డి జె ఎఫెక్ట్ తో స్వాగతం పలుకుతున్నట్టే అర్థం. ప్రస్తుతానికి ఈ ఆర్థిక సంస్కరణలు మెజారిటీ వర్గానికి భయంకరమైన ప్రభావం కలిగించకపోయిన ప్పటికీ కూడా పరోక్షంగా ధరలు పెరగడంలో ప్రోత్సహిస్తాయి. అలానే, మొత్తం ట్రాన్సక్షన్లు ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు కైవసం చేసుకుంటూ తమ వ్యాపార సామ్రాజ్యాన్ని పెంచుకుంటూ మనకు చిన్న చిన్న సదుపాయాలు కలిగిస్తూనే అవి ప్రపంచీకరణ ఫలాలను గొప్ప సరదాగా ఆనందిస్తాయి. ప్రపంచీకరణ ఫలాలు సాధారణ మనిషికి ఏనాడు అందాయని?



కేశవ్
కోల్కతా ఆర్థిక సామాజిక విశ్లేషకులు
జాగృతి సమీక్ష సంపాదకులు

## సలామత్ తెలంగాణ



విమోచన దినోత్సవం
పాలనా దినోత్సవం
విజయ దినోత్సవం
ఏదైనా ఏముంది
సంతోషం గర్వకారణం
అంతా అయ్యాక
ఎందుకంత పదబంధ రణం...
పాడుకుంటె చాలు స్వేచ్ఛా గీతం
పాతజ్ఞాపకాల గాయాల
హృదయాలకై
ఎగురుతుంది కదా విజయ
కేతనం...
పోటిపడి కాటులాడె కన్న
పోటిపడి చేటు తెచ్చెకన్న
పోరుగడ్డకు
గట్టి మేలు తలపెట్టడమే మిన్న
నడవండి నడిపించండి
నవ తెలంగాణ నావ
ప్రపంచ పటం లో గుర్తుండి పోవ

రేడియమ్
9291527757

## తెలంగాణ సాయుధ పోరాటయోధుడు
# కామ్రేడ్ కందాళ లక్ష్మణాచార్యులు



నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు, భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూని స్టు పార్టీ (సి.పి.ఐ) నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. 'బాంచెన్ దొరా ... నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆయుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమెందించారు. ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందడమే కాకుండా పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి.

బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా, నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కామ్రేడ్ కందాళ లక్ష్మణాచార్యులు సమరశీల పోరాటాలు నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో రాజరికం ముసుగులో కొనసాగిస్తున్న నియంతృత్వానికి వ్యతిరేకంగా, భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆయన నిరంతరం ఉద్యమించారు. అలాగే అంటరానితనం, కులవివక్ష, బానిసత్వం లకి వ్యతిరేకంగా ఉద్యమించి పీడిత ప్రజానీకానికి అండగా నిలిచి వారిని చైతన్యవంతులను చేయడంలో ఆయన విశేష కృషి చేశారు.కుటుంబ ఆస్తిని లూటీ చేసిననూ, భార్యా-పుత్రులను హింసించిననూ మరియు తన తల్లిదండ్రులను హత్య గావించిననూ ఆయన ఏమాత్రం అధైర్యపడకుండా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో అటు భారత జాతీయోద్యమంలోనూ, ఇటు తెలంగాణ సాయుధ పోరాటంలోనూ అవిశ్రాంతంగా ఉద్యమించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు.

కందాళ లక్ష్మణాచార్యులు 1921లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ( ప్రస్తుత నాగర్ కర్నూలు) లోని పెద్ద ముద్దునూర్ గ్రామంలో రుక్మిణమ్మ, రామకృష్ణాచార్యులు దంపతులకు ద్వితీయ సంతానంగా జన్మించారు. ఆయన 1939 లో వనపర్తిలో 'శారదా భక్త సమాజం' అనే విద్యార్థి సంఘాన్ని స్థాపించి విద్యార్థులను చైతన్యపరిచి అనేక ఆందోళనలు నిర్వహించారు. దేశభక్తిపూరితమైన గేయాల ద్వారా, దేశ స్వాతంత్ర్య నినాదాల ద్వారా విద్యార్థుల్లో దేశభక్తిని తద్వారా స్వాతంత్ర్య చైతన్యాన్ని కలిగించారు. హైదరాబాద్ లో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ నుండి డిగ్రీ అభ్యసించి విశ్వవిద్యాలయంలో విద్యార్థి ఉద్యమాలలో పాల్గొన్నారు. అలాగే హైదరాబాద్ నగరంలో మున్సిపల్ కార్మికుల సంఘం, రోడ్డు కూలీల సంఘం మరియు ఆల్విన్ ఫ్యాక్టరీ కార్మిక స్థాపించడమే కాకుండా వారి సమస్యల పరిష్కారాల కోసం ఉద్యమించారు. కందాళ లక్ష్మణాచార్యులు 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని లెక్కలేనన్ని లాఠీ దెబ్బలు తిన్నారు. ఆ సమయంలోనే ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ)లో చేరారు. 1945లో హైదరాబాద్ స్టూడెంట్ యూనియన్ ( హెచ్.ఎస్.యు) కార్యక్రమంలో భాగంగా కందాళ లక్ష్మణాచార్యులు జాతీయ జెండాను ఎగురవేశారు. 1946 నుండి మహబూబ్ నగర్ జిల్లాలో కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్ కర్నూలు, వనపర్తి మొదలైన ప్రాంతాలలో ఆయన కమ్యూనిస్టు పార్టీని విస్తరింపజేశారు. 1947 ఆగస్టు 15 నాడు నిజాం భయంకర ఛాయల్లో ప్రభుత్వ దమనకాండ మధ్యన ప్రప్రథమంగా హైదరాబాద్ లోని ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యాలయం పైన స్వాతంత్ర్య జెండాను ఎగురవేసి అరెస్టు అయ్యారు. ఆ తర్వాత మహబూబ్ నగర్ జిల్లాలో ప్రజలను సమీకరించి నిజాం ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి శిక్షణ అందించారు. ఆయన నేతృత్వంలో 1948 లో పెద్దకొత్తపల్లి పోలీసు స్టేషన్‌పై దాడిచేసి ఆయుధాలను ఎత్తుకెళ్లడమే కాకుండా పోలీసు స్టేషన్ ని తగులబెట్టారు.

ఆ 1948 లో నిజాం ప్రభుత్వం కందాళ లక్ష్మణాచార్యులను అరెస్ట్ చేసి రెండు సంవత్సరాల పాటు కాళ్ళకు ఇనుప సంకెళ్ళు తగిలించి కఠిన కారాగార శిక్షని విధించింది. కాని ఆయన తన ఎనిమిది మంది అనుచరులతో కలిసి జైలు గోడలు బద్దలుకొట్టి బయటపడడమే కాకుండా రజాకార్ అల్లరి మూకను ఢీకొన్నారు. పెద్ద లింగారెడ్డిని గుంటూరులో దాచిపెట్టిన భూస్వాములు 'ఆయనను కమ్యూనిస్టులు చంపివేశారు' అని అనాధ శవాన్ని తీసుకువచ్చి సి.పి.ఐ పార్టీ మీద అబద్ధపు కుట్ర కేసు పెట్టారు. 'నక్కలపల్లి కుట్ర కేసు' గా నమోదైన ఈ కేసు అప్పట్లో మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించగా ఈ కుట్ర కేసుని కందాళ లక్ష్మణాచార్యులు ఛేదించి కేసు పెట్టిన వారికి అప్పజెప్పి ఆ అబద్ధపు కుట్ర కేసుని నిలువరించి భూస్వాముల కపటనీతిని బహిర్గతపరచి పార్టీ ప్రతిష్ఠతను కాపాడారు. నిజాం పాలన అంతం అయిననూ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించిన దరిమిలా మళ్ళీ కందాళ లక్ష్మణాచార్యుల కోసం వేటాడటం ప్రారంభించింది. ఈ విషమ నిర్బంధ పరిస్థితులలో ఆయన మరలా రహస్య జీవితాన్ని గడిపారు. అయిదు సంవత్సరాల జైలు జీవితాన్ని మరియు అనేక నెలల పాటు అజ్ఞాత జీవితాన్ని ఆయన అనుభవించారు. కందాళ లక్ష్మణాచార్యులు సహచరి యశోదమ్మ ఆయనతో కలిసి అనేక ప్రజా పోరాటాలలో మరియు అజ్ఞాతంలోనూ ఉద్యమించారు.

సి.పి.ఐ పార్టీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శిగా కందాళ లక్ష్మణాచార్యులు 1952 నుండి 1967 వరకు పనిచేశారు. ఆయన కష్టజీవులకు నాయకత్వం వహించి ప్రజాస్వామికవేత్తలను సమీకరించి కమ్యూనిస్టు పార్టీని మహబూబ్ నగర్ జిల్లాలోని ఏడు తాలూకాలలోకి విస్తృతపరిచారు. 1967 అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఆయన పోటీ చేశారు. కందాళ లక్ష్మణాచార్యులు 1972 లో అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ నుండి 'తామ్ర పత్ర స్వాతంత్ర్య సమరయోధుల ధ్రువపత్రాన్ని' స్వీకరించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుండి ఈ ధ్రువపత్రాన్ని స్వీకరించిన మొదటి వ్యక్తి ఆయనే కావడం గమనార్హం. తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం అనేక సవాళ్లను అధిగమించి పీడిత ప్రజానీకం అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా ఉద్యమించిన కందాళ లక్ష్మణాచార్యులు 1976 జనవరి 10 నాడు వీర మరణం చెందారు. అంతిమంగా ఆయన ప్రజా హృదయాలలో ఎన్నటికి చెరగని 'పోరాట స్ఫూర్తి'గా వెలుగొందుతూనే ఉన్నారు.

( తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా )



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

## దివ్యాంగుల పట్ల దయ అవసరం లేదు
# హక్కుల పరిరక్షించే బాధ్యత ప్రభుత్వాలదే



దివ్యాంగులను జాలితో చూడటం కాదు, సమాన హక్కులు, సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవితం కల్పించడమే నిజమైన సంక్షేమం. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సుమారు 130 కోట్ల మంది, అంటే ప్రతి ఆరుగురిలో ఒకరు, గణనీయమైన దివ్యాంగతతో జీవిస్తున్నారు. దివ్యాంగతను కేవలం వ్యక్తిగత వైకల్యంగా కాకుండా, అందుబాటులో లేని భవనాలు, రవాణా, సమాచార వ్యవస్థలు, విద్యా-ఉపాధి అవకాశాలు, సామాజిక వివక్ష వంటి అడ్డంకులతో కలిసిన సామాజిక సమస్యగా చూడాలని అంతర్జాతీయ విధానాలు స్పష్టం చేస్తున్నాయి.

భారతదేశంలో జనాభా లెక్కలు 2011 ప్రకారం 2.68 కోట్ల మంది దివ్యాంగులుగా నమోదయ్యారు. ఇది మొత్తం జనాభాలో 2.21 శాతం. 2018లో జరిగిన జాతీయ నమూనా సర్వేలో దివ్యాంగుల శాతం 2.2గా నమోదైంది. అయితే ఈ సంఖ్యలను ప్రపంచ గణాంకాలతో నేరుగా పోల్చేటప్పుడు నిర్వచనాలు, సర్వే విధానాల్లో తేడాలను పరిగణనలోకి తీసుకోవాలి. అదే సర్వేలో 7 సంవత్సరాలు పైబడిన దివ్యాంగుల్లో అక్షరాస్యత 52.2 శాతం మాత్రమే; 15 సంవత్సరాలు పైబడిన వారిలో మాధ్యమిక విద్య లేదా అంతకంటే పై స్థాయి విద్య పొందినవారు 19.3 శాతం. అంతకంటే ఆందోళనకరమైన విషయం ఏమిటంటే 15 సంవత్సరాలు పైబడిన దివ్యాంగుల శ్రమశక్తి భాగస్వామ్య రేటు 23.8 శాతం, ఉద్యోగాల్లో ఉన్న వారి నిష్పత్తి 22.8 శాతమే. ప్రభుత్వ సహాయం అందుకున్నట్లు తెలిపిన వారు 21.8 శాతం మాత్రమే.

అంటే సమస్య చట్టాల కొరత మాత్రమే కాదు; చట్టం కాగితంపై ఉండటం, హక్కు జీవితంలో అందుబాటులోకి రావడం మధ్య ఉన్న అంతరం. భారతదేశం ఇప్పటికే దివ్యాంగుల హక్కుల చట్టం, 2016ను అమలు చేస్తోంది. ఈ చట్టం బెంచ్‌మార్క్ దివ్యాంగత కలిగిన పిల్లలకు 6 నుంచి 18 సంవత్సరాల వరకు ఉచిత విద్య హక్కును, ప్రభుత్వ మరియు ప్రభుత్వ సహాయం పొందే ఉన్నత విద్యా సంస్థల్లో కనీసం 5 శాతం సీట్ల రిజర్వేషన్‌ను, ప్రభుత్వ ఉద్యోగాల్లో కనీసం 4 శాతం ఖాళీల రిజర్వేషన్‌ను నిర్దేశించింది.

అయితే రిజర్వేషన్ ప్రకటించడం కంటే దాని అమలును పర్యవేక్షించడం ముఖ్యం. ప్రతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలో దివ్యాంగుల రిజర్వేషన్ రోస్టర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఖాళీలను గుర్తించడంలో ఆలస్యం, పోస్టులను అనర్హమైనవిగా చూపించడం, నియామక ప్రక్రియలో సహేతుకమైన సౌకర్యాలు కల్పించకపోవడం వంటి సమస్యలకు ప్రత్యేక ఫిర్యాదు, అప్పీల్ వ్యవస్థ ఉండాలి. ఉద్యోగాల్లో ప్రవేశమే కాకుండా పదోన్నతులు, శిక్షణ, కార్యాలయ సౌకర్యాలు, పని సమయాల్లో అవసరమైన మార్పులు, సహాయక సాంకేతిక పరికరాలు కూడా విధానంలో భాగం కావాలి.

ఇదే సమయంలో విద్యను ప్రత్యేక పాఠశాలలకే పరిమితం చేయకుండా సమగ్ర విద్యగా మార్చాలి. పాఠశాలల్లో ర్యాంపులు, లిఫ్టులు, అందుబాటులో ఉండే మరుగుదొడ్లు మాత్రమే కాకుండా బ్రెయిలీ పాఠ్యపుస్తకాలు, సంకేత భాషా నిపుణులు, స్క్రీన్ రీడర్లు, సహాయక సాంకేతిక పరికరాలు, ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అవసరం. 2018 సర్వేలో దివ్యాంగ పిల్లల్లో సాధారణ పాఠశాలలో ఎప్పుడైనా చేరిన వారి శాతం 62.9 మాత్రమే ఉండటం విద్యా వ్యవస్థలో ఇంకా ఎంత దూరం ప్రయాణించాల్సి ఉందో చెబుతోంది. భారత ప్రభుత్వం 2015లో ప్రారంభించిన సుగమ్య భారత్ అభియాన్ భవనాలు, ప్రజా రవాణా, సమాచార-సాంకేతిక వ్యవస్థలను అందుబాటులోకి తేవడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు బ్యాంకింగ్, ఉన్నత విద్య, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, ఆరోగ్య సంస్థలు, పోలీస్ స్టేషన్లు, ఐసీటీ వంటి రంగాలకు కూడా ప్రత్యేక ప్రాప్యత ప్రమాణాలు రూపొందించబడ్డాయి. 2026 ఆగస్టులో అడ్డంకులేని వాతావరణం కోసం కొత్త మార్గదర్శకాలు కూడా విడుదలయ్యాయి.

న్యాయవ్యవస్థలో ప్రాప్యత మరింత కీలకం. దివ్యాంగుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం, ఫిర్యాదు ఇవ్వడం, న్యాయవాదిని కలవడం, కోర్టు పత్రాలను చదవడం, వాంగ్మూలం ఇవ్వడం, తీర్పును అర్థం చేసుకోవడం, ప్రతి దశలోనూ సహాయక వ్యవస్థ ఉండాలి. ప్రతి జిల్లాలో దివ్యాంగుల కోసం ప్రత్యేక న్యాయ సహాయ కేంద్రాలను బలోపేతం చేయాలి. పోలీసులకు, న్యాయమూర్తులకు, ప్రభుత్వ న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, న్యాయసేవా సంస్థలకు దివ్యాంగుల హక్కులపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ఐక్యరాజ్యసమితి కూడా న్యాయ ప్రక్రియలో భౌతిక ప్రాప్యత, ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్, శిక్షణ పొందిన సహాయకులు, న్యాయ సహాయం వంటి అంశాలను అవసరమైనవిగా గుర్తిస్తోంది.

విదేశాల్లోనూ ఉపయోగకరమైన నమూనాలు ఉన్నాయి. అమెరికాలోని అమెరికన్స్ విత్ డిజెబిలిటీస్ యాక్ట్ ఉద్యోగం, ప్రభుత్వ సేవలు, ప్రజా ప్రదేశాలు, రవాణా, కమ్యూనికేషన్ వంటి రంగాల్లో వివక్షను నిషేధిస్తూ సహేతుకమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యతను నిర్దేశిస్తుంది. బ్రిటన్‌లోని ఈక్వాలిటీ యాక్ట్, 2010 ప్రకారం సేవలందించే సంస్థలు దివ్యాంగులకు కలిగే అడ్డంకులను ముందుగానే గుర్తించి 'రీజనబుల్ అడ్జస్ట్‌మెంట్స్' చేయాలి; అవసరమైన సందర్భాల్లో భౌతిక మార్పులు, సహాయక పరికరాలు, ప్రత్యామ్నాయ సమాచార విధానాలు కల్పించాలి. ఇవి భారతదేశంలో కూడా అమలు పర్యవేక్షణను మరింత బలపరచడానికి ఉపయోగపడే అనుభవాలు.

కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేక డిజెబిలిటీ బడ్జెట్ రూపొందించి, ప్రతి పథకానికి కేటాయించిన నిధులు ఎంత, ఖర్చు ఎంత, లబ్ధిదారులు ఎంతమంది అన్నది జిల్లా స్థాయిలో ప్రజలకు తెలియజేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి జిల్లాలో పునరావాస కేంద్రాలు, సహాయక పరికరాల పంపిణీ కేంద్రాలు, వృత్తి శిక్షణ కేంద్రాలు, మానసిక-సామాజిక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. యూడీఐడీ వ్యవస్థ ద్వారా డేటాను సమగ్రపరచి, గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎవరు ఏ పథకం పొందుతున్నారో తెలుసుకునేలా చేయాలి. 2026-27 నుంచి 2030-31 వరకు యూడీఐడీ వ్యవస్థకు కేంద్రం ప్రత్యేక ఆర్థిక సహాయ పథకాన్ని కొనసాగిస్తోంది. దివ్యాంగుల సంక్షేమాన్ని కేవలం పింఛన్లు, పరికరాలు, సబ్సిడీలకు పరిమితం చేయడం కూడా సరైంది కాదు. రాజకీయాల్లో, స్థానిక సంస్థల్లో, ప్రజా విధానాల రూపకల్పనలో దివ్యాంగుల భాగస్వామ్యాన్ని పెంచాలి. ఐక్యరాజ్యసమితి ఒప్పందంలోని 29వ అధికరణం వారికి ఓటు హక్కుతో పాటు ఎన్నికల్లో పోటీ చేయడం, ప్రజా పదవులు చేపట్టడం, రాజకీయ-ప్రజా జీవితంలో సమానంగా పాల్గొనే హక్కును గుర్తిస్తోంది.

ఈ విస్తృత సమస్యలపై నిరంతరం గొంతెత్తుతున్న డాక్టర్ బరిగెల శివ, కాకతీయ విశ్వవిద్యాలయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు వంటి వ్యక్తులు గత మూడు దశాబ్దాలకు పైబడిన వారి కృషి ప్రత్యేకంగా ప్రశంసించదగినది. ముఖ్యంగా ప్రొఫెసర్ శ్రీనివాసరావు స్వయంగా 100 శాతం ఆర్థోపెడిక్ దివ్యాంగత కలిగిన వ్యక్తిగా, దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమాలపై పరిశోధన చేసినవారిగా, 2002 నుంచే దివ్యాంగుల సమస్యలపై నిరంతరంగా రచనలు చేస్తున్నవక్తిగా కాకతీయ విశ్వవిద్యాలయ అధికారిక ప్రొఫైల్‌లో వివరాలు ఉన్నాయి. దివ్యాంగుల సంక్షేమ పరిపాలనపై ఆయన పీహెచ్‌డీ పరిశోధన చేయడమే కాకుండా, దివ్యాంగుల సంక్షేమం, విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాలు, రాజకీయ భాగస్వామ్యం, హక్కుల అమలు వంటి అంశాలపై పుస్తకాలు, పరిశోధనా వ్యాసాలు, సంపాదకీయాలు రాశారు.

అందువల్ల డాక్టర్ బరిగెల శివ,జైభీమ్ సంస్థల ఫౌండర్ , ఎడిటర్ ప్రస్తావించిన దివ్యాంగులకు చట్టపరమైన అవగాహన, న్యాయ ప్రాప్యత, రిజర్వేషన్ల అమలు, రాజకీయ అవకాశాలు, వేధింపులపై కఠిన చర్యలు వంటి అంశాలు కేవలం డిమాండ్లుగా కాకుండా ప్రభుత్వ పరిపాలనలో కొలిచే లక్ష్యాలుగా మారాలి. దివ్యాంగుల కోసం విధానం రూపొందించే ప్రతి కమిటీలో దివ్యాంగుల ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలి. వారి గురించి నిర్ణయాలు తీసుకునేటప్పుడు వారిని పక్కన పెట్టి తీసుకునే నిర్ణయం ఎంత మంచి ఉద్దేశంతో ఉన్నా అసంపూర్ణమే. ఐక్యరాజ్యసమితి కూడా దివ్యాంగులను ప్రభావితం చేసే విధానాల రూపకల్పన, అమలులో వారి ప్రతినిధి సంస్థలను సంప్రదించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. చివరికి దివ్యాంగుల సంక్షేమానికి కొలమానం వారు ఎన్ని పథకాలు పొందారన్నది కాదు; వారు ఎన్ని అడ్డంకులను దాటి స్వతంత్రంగా జీవించగలుగుతున్నారు, చదువుకోగలుగుతున్నారు, ఉద్యోగం పొందగలుగుతున్నారు, న్యాయం పొందగలుగుతున్నారు, ప్రజా జీవితంలో భాగస్వాములు కాగలుగుతున్నారు అన్నదే ప్రధానాంశం. దయను దాటి హక్కుల దిశగా, సంక్షేమాన్ని దాటి సాధికారత దిశగా, ప్రత్యేక సదుపాయాలను దాటి సమగ్ర సమాజం దిశగా భారతదేశం అడుగులు వేయాల్సిన సమయం ఇది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## మొండి గౌరెల్లి భూ బాధిత రైతులకు న్యాయం చేస్తాం



**యాచారం, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** మొండి గౌరెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో భూములు కోల్పోతున్న రైతులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మొండి గౌరెల్లి గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, మాజీ సర్పంచులు, భూ బాధిత రైతులు ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్లు 19, 68, 127 లలో ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న పట్టా భూమితో పాటు తాము సాగు చేసుకుంటున్న కబ్జా భూమికి కూడా పూర్తి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దీనిపై స్పందించిన ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు నిర్వహించిన ఎంజాయ్మెంట్ సర్వే ఆధారంగా పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టా భూమితో పాటు సాగులో ఉన్న భూమికి కూడా నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని, ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగనివ్వమని హామీ ఇచ్చారు.

# విద్యార్థి ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

- విద్యార్థి ప్రాణాలతో పోరాటం..
- పాఠశాల ఎదుట బీసీ సంఘాల ధర్నా

**హయత్ నగర్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** ఎక్సర్షన్‌లో విద్యార్థిని అవమానించారనే ఆరోపణల నేపథ్యంలో చోటుచేసుకున్న విద్యార్థి ఆత్మహత్య ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బొంగు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. యాదాద్రి-భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన భార్గవ్ రజక పదో తరగతి విద్యార్థి. వనస్థలిపురంలోని ప్రశాంత్ విద్యానికేతన్ పాఠశాలలో చదువుతున్న అతడు పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎక్సర్షన్‌కు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎక్సర్షన్‌లో తోటి విద్యార్థుల సమక్షంలో ఉపాధ్యాయులు బాలికలను వేధించేందుకు, టీజ్ చేసేందుకు వచ్చావా అంటూ ప్రశ్నించి



అవమానించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనతో విద్యార్థి తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. తన ఆత్మహత్యకు పాఠశాల యాజమాన్యమే కారణమని పేర్కొంటూ సూసైడ్ నోట్ రాసినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. విద్యార్థిని తల్లిదండ్రులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స ఖర్చు మొత్తాన్ని పాఠశాల యాజమాన్యం భరిస్తామని, కుటుంబ సభ్యుల సమక్షంలో రూ.10.50 లక్షలు చెల్లిస్తామని బాండ్ పేపర్‌పై రాసి ఇచ్చినట్లు వారు తెలిపారు. అయితే ఇప్పటివరకు రూ.4 లక్షలు మాత్రమే చెల్లించారని, మిగిలిన మొత్తం చెల్లించకపోవడంతో విద్యార్థికి చికిత్స అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ప్రస్తుతం విద్యార్థి తెలంగాణ చౌరస్తాలోని ఆరుద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రి బకాయిలను వెంటనే చెల్లించి విద్యార్థికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. విద్యార్థి కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి అసలు కారణాలను వెలుగులోకి తీసుకురావాలని, విచారణలో ఎవరి తప్పిదం నిర్ధారణ అయితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బొంగు వెంకటేష్ గౌడ్ కోరారు. ధర్నా సందర్భంగా పోలీసులు ఆందోళనకారులను వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లి విజయ, తండ్రి మల్లేష్, అశ్విని, గౌతమ్, బీసీ సంఘాల నాయకులు పరమేష్ గౌడ్, కొంగర కృష్ణ, కారింగుల నరేందర్ గౌడ్, దళిత సంఘాల జేఏసీ చైర్మన్ ఈడుల పరశురాం, దళిత జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు బొల్లుగు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# జీవో 118 బాధితుల సమస్యపై మంత్రులతో మధుయాష్కి భేటీ

- పూర్తి యాజమాన్య హక్కులతో రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి
- రేపు ఎల్బీనగర్‌లో బాధిత కాలనీల ప్రజలతో ప్రత్యేక సమావేశం

**హయత్ నగర్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** జీవో 118 పరిధిలోని బాధిత కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించి, పూర్తి యాజమాన్య హక్కులతో రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్‌పర్సన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ కోరారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానం మేరకు శుక్రవారం అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో మధుయాష్కి గౌడ్, మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు పర్వతి గణేష్ రెడ్డి, జీవో 118 బాధిత కాలనీల ప్రతినిధులతో కలిసి మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ లోకేష్ కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డైరెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితర అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై బాధితులు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ల సమస్యను వివరించారు. గతంలో జీవో 118 కింద జారీ చేసిన డీడ్ ఆఫ్



కన్వేయన్స్ కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. జీవో 118కు సంబంధించిన న్యాయపరమైన సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు, బాధిత కాలనీలను 22ఏ జాబితా నుంచి తొలగించి, పూర్తి యాజమాన్య హక్కులతో రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మధుయాష్కి గౌడ్ కోరారు. బాధిత కాలనీల ప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కూడా మధుయాష్కి గౌడ్, బాధిత కాలనీల ప్రతినిధులు కలిసి సమస్యను వివరించారు.

### 44 కాలనీలకు పరిష్కారం లభిస్తుందని మధుయాష్కి వెల్లడి

మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. జీవో 118 కారణంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 44 బాధిత కాలనీల ప్రజలు అనేక సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్ల సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ప్రజలకు నూతన హక్కు పత్రాలు అందజేసి, రిజిస్ట్రేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావడంపై ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజల తరఫున ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

### నేడు బాధిత కాలనీల ప్రజలతో సమావేశం

రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారంపై శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎల్బీనగర్ నియోజకవర్గంలో జీవో 118 బాధిత కాలనీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మధుయాష్కి గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై, బాధిత కాలనీల ప్రజలతో మాట్లాడనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## జన్వాడ ఫామ్‌హౌస్‌పై రాజకీయం వద్దు



**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండల పరిధిలోగల జన్వాడ ఫామ్ హౌస్ వివాదంపై ఫామ్ హౌస్ యజమాని ప్రదీప్ రెడ్డి స్పందించారు. ఆభూమితనసొంతమేనని, దానికి మాజీ మంత్రి కే టీ ఆర్ కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఫామ్ హౌస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కే టీ ఆర్ నాకు చిన్ననాటి స్నేహితుడు. నా సొంత ప్రాపర్టీ అయిన జన్వాడ ఫామ్ హౌస్ ను ఆయనకు లీజుకు ఇచ్చాను అని తెలిపారు. ఫామ్ హౌస్ ను పరిశీలించేందుకు రాజకీయ పార్టీల నేతలు వస్తారన్న ప్రచారంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది నా వ్యక్తిగత ఆస్తి. రాజకీయ పార్టీల నేతలు వచ్చి పరిశీలిస్తామనడం సరికాదు. ప్రభుత్వానికి, అధికారులకు ఏవైనా అనుమానాలు ఉంటే నాకు నోటీసులు ఇచ్చి వివరణ కోరవచ్చు. భూమికి సంబంధించిన లీగల్ టైటిల్ క్లియర్ గా ఉంది. ఎలాంటి పత్రాలు అడిగినా చట్టపరంగా సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నాను అని ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు.

## పాఠశాల మెట్లపై నుండి పడి విద్యార్థి మృతి

### పాఠశాల యాజమాన్యం తీరుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ శివారులోని ఇండియన్ హెడ్స్ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న వర్షిక (9) పాఠశాలలోని మెట్లపై నుండి కిందికి దిగుతూ కింద పడడంతో తలకు బలమైన గాయం కావడంతో షాద్ నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించిగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు దీంతో కుటుంబ సభ్యులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు ప్రైవేటు పాఠశాలలా యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాల యాజమాన్యం విద్యార్థుల స్థితిగతులపై దృష్టి పెట్టడం లేదని మండి పడుతున్నారు.

## ఇందువాసి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- కలెక్టర్ వేటుతో ఊపిరి పీల్చుకున్న ఇందువాసి గ్రామస్థులు



**గట్టు, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి, విధులను పూర్తిగా గాలికొదిలేసిన ఇందువాసి గ్రామ పంచాయతీ కార్యదర్శి గొల్ల శేఖర్ తీరుపై గ్రామస్థులకు విసుగు ఎత్తిపోయింది. ఆయన నిరంతర నిర్లక్ష్యం, ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేస్తున్న వైఖరితో విసిగివేసారిన ప్రజలు, ఇక లాభం లేదనుకుని నేరుగా 'ప్రజావాణి' వేదికగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు మొరపెట్టుకున్నారు. నిధుల గోల్‌మాల్‌పై ప్రజల నుంచి వచ్చిన తీవ్ర అసంతృప్తిని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్, దీనిపై తక్షణ విచారణకు ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి జరిపిన విచారణలో కార్యదర్శి గొల్ల శేఖర్ లీలలు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. విధుల్లో ఘోరమైన నిర్లక్ష్యం వహించడమే కాకుండా, పంచాయతీ నిధులను పక్కదారి పట్టించినట్లు విచారణలో స్పష్టంగా తేలింది. గ్రామాభివృద్ధిని కుంటుపరిచి, ప్రజల సహనాన్ని పరీక్షించిన సదరు కార్యదర్శిపై కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు ఎంపీవో సయ్యద్ బాసిత్ వివరాలు వెల్లడించారు. ఎట్టకేలకు సదరు అవినీతి అధికారి పీడ విరగడైందని, ఆయన నిర్వాకాలతో విసిగిపోయిన ఇందువాసి గ్రామ ప్రజలు ఈ నిర్ణయంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

# ఒక్క కెమెరాతో ఎన్నో ఉల్లంఘనలకు చెక్

- సైబరాబాద్ సిపి

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** ఔటర్ రింగ్ రోడ్డుపై ఏర్పాటు చేయనున్న మల్టీ ఫంక్షన్ హాల్ కెమెరా ద్వారా ఎన్నో ఉల్లంఘనలకు చెప్పే అవకాశం ఉందని సైబరాబాద్ పోలీస్ బాస్ డాక్టర్ ఎం. రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓఆర్ఆర్ పై ట్రాఫిక్ సాంకేతిక వ్యవస్థల వినియోగం అనే అంశంతో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డుపై ట్రాఫిక్ ఉల్లంఘనలకు సాంకేతికతతో చెక్ పెట్టేందుకు సైబరాబాద్ పోలీసులు సమాయత్తం అవుతున్నారన్నారు. ఇందులో భాగంగా అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉన్న ఒకే కెమెరాతో పలు రకాల ఉల్లంఘనలను గుర్తించే మల్టీ వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్‌సహా అధునాతన ట్రాఫిక్ పర్యవేక్షణ వ్యవస్థల పనితీరును ఆయన సమీక్షించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన ఆయన ఓఆర్ఆర్ పై రియల్‌టైమ్ ట్రాఫిక్ నిఘా, ఆటోమేటెడ్ ఉల్లంఘనల గుర్తింపు, రోడ్డు భద్రతకు సంబంధించిన సాంకేతిక ఏర్పాట్లను పరిశీలించారు.

### "ఒక కెమెరా.. ఎన్నో ఉల్లంఘనలు గుర్తింపు"

నగరం నడిబొడ్డున ఉన్న కంట్రోల్ రూమ్ నుంచి ఓఆర్ఆర్ పై వాహనాల రాకపోకలను రియల్‌టైమ్‌లో ఎలా పర్యవేక్షిస్తున్నారో అధికారులు కమిషనర్‌కు వివరించారు. ప్రధానంగా కొత్తగా ఏర్పాటుచేసిన సింగిల్ కెమెరా ఆధారిత మల్టీ వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్ పనితీరును ఆయన



ప్రత్యేకంగా పరిశీలించారు. ఒకే కెమెరాద్వారా పలు రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించేలా ఈ వ్యవస్థను రూపొందించారని, వీడియో అనలిటిక్స్, ఆటోమేటెడ్ ఉల్లంఘనల గుర్తింపు ద్వారా ట్రాఫిక్ నియంత్రణ, అమలును మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఇది ఉపయోగపడనుందని సంబంధిత అధికారులు సిపి కి వివరించారు. ఔటర్ పై ట్రాఫిక్ నిఘా, ఆటోమేటెడ్ అమలు, రోడ్డు భద్రతను మెరుగుపరిచే ట్రాఫిక్ క్రమశిక్షణ పెంపు, ప్రమాదాల నివారణలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్బి సిఈఓ డా. సతీందర్ సింగ్ రాణా, ప్రాజెక్ట్ హెడ్ కల్నల్ గిరీశ్వర్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బిస్వజిత్ సింగ్, సీనియర్ జీఎం చాంద్ బాషా, టోల్ జీఎం మూర్తి, ఎస్సిఎస్సి సిఈఓ నవీద్, ట్రయోస్ బిజినెస్ హెడ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# స్వార్థపూరిత రాజకీయాలు మానుకోవాలి

- అబద్దాలతో చరిత్రను మార్చలేరు
- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** తమ స్వార్థపూరిత రాజకీయాల కోసం అబద్దాలతో చరిత్రను మార్చలేరని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ అన్నారు, సెప్టెంబర్ 17- వాస్తవ చరిత్ర- వక్రీకరణలు' అనే అంశంపై షాద్ నగర్ పట్టణంలోని స్థానిక పెన్షనర్స్ భవన్లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్ కార్యక్రమానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై 1946 జూలై 4 నుండి 1951 అక్టోబర్ దాకా జరిగిన సాయిధ రైతాంగ పోరాటం ఆనాటి నిజాం నవాబుల పాలనలో రాజ్యానికి ప్రజలకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరించిన భూస్వాములు, జాగిర్దారులు, జమీందారులు, దేశముకులు ప్రజలపై తీవ్రమైనటువంటి అణిచివేతకు పీడనకు పాల్పడి తీవ్రమైనటువంటి ఇబ్బందులకు గురి చేశారనీ అదే సమయంలో నిజాం ప్రైవేటు ఆర్మీ రజాకార్లు వీరికి తోడై ప్రజలపై మరింత దౌర్జన్యాలకు ,దోపిడీలకు పాల్పడి చిత్రహింసలకు గురి చేశారు. ఇలాంటి సందర్భంలో ప్రజలకు గత్యంతరం లేక దొరలకు, భూస్వాములకు, దేశముకులకు, జాగిర్దారులకు, రజాకార్లకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారనీ. ప్రజలకు కమ్యూనిస్టులు తోడై ఆంధ్ర మహాసభ ద్వారా పోరాటాన్ని సాయుధ పోరాటంగా



రూపొందించి కొనసాగించారు. ఆ క్రమంలో గ్రామాలలో ఉన్నటువంటి దొరలు, జాగిర్దారులు, జమీందారులు, భూస్వాములు పోరాటానికి తలవంచి పల్లెలు వదిలి పట్టణానికి పారిపోయారు. అలా జరిగిన పోరాటం ద్వారా దొరల ఆధీనంలో ఉన్నటువంటి భూములను ప్రజలకు పంచడం జరిగిందనీ ప్రజా పోరాటం విజయం సాధించిందని నిజాం నవాబు ఉస్మాన్ అలీ ఖాన్ లొంగిపోయే దశలో భారత ప్రభుత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నాటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రాజ్యంపై ఆపరేషన్ పోలో చేపట్టి కమ్యూనిస్టుల పోరాటం ఇలాగే కొనసాగితే భారతదేశానికి ముఖ్యంగా భూస్వాములకు, జాగిర్దారులకు, జమీందారులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని భావించి ఎలాగైనా సరే కమ్యూనిస్టు భావజాలాన్ని ఎదగకుండా చేయాలని కమ్యూనిస్టులపై కమ్యూనిస్టులకు మద్దతుగా నిలిచిన ప్రజలపై భారత సైన్యము విపరీతమైనటువంటి అణిచివేతకు పాల్పడింది. ఆ సైన్యం నిర్వహించినటువంటి అణిచివేతలో దాదాపు 4,000 మంది కమ్యూనిస్టులు ప్రజలు అమరులయ్యారు. వీరోచితమైన పోరాటం ద్వారా సాధించుకున్నటువంటి భూములను తదనంతర కాలంలో ప్రజలు కోల్పోవలసి వచ్చింది. ఇది వాస్తవ చరిత్ర. దీనిని కొన్ని రాజకీయ హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించి తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధికారం కోసం ప్రచారం చేస్తున్నారనీ దీనిని ప్రజలంతా శ్రద్ధగా గమనించి వాస్తవ చరిత్రను తెలుసుకొని అలాంటి రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప, జిల్లా కార్యదర్శులు కే.వెంకటయ్య, జి శివారెడ్డి, ఎన్ నర్సిములు, తెలంగాణ జేఏసీ షాద్ నగర్ చైర్మన్ జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, ఫరూక్ నగర్ మండల అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, ప్రధాన కార్యదర్శి సత్యం ,ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, ఎల్ రాములు, రామకృష్ణ, ఉపాధ్యక్షులు వినీత్, శేఖర్ గౌడ్ ,ఎల్ బాలయ్య, వలిగి కృష్ణ, సీనియర్ నాయకులు బి కృష్ణయ్య, వెంకటరమణ, రంగరాజన్ కుమార్, రంగయ్య, కాశన్న,సుధాకర్ రెడ్డి, కురుమయ్య,బి.నర్సిములు,అరుణ,కల్యాణి, శాంతబాయి, నక్క బాల్ రాజ్,తిరుమలయ్య ,రవికుమార్, సిద్దార్థ, రవీంద్రనాత్, ఎం.నర్సిములు, రాము,రాజు, శివ భాస్కర్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే వినతి



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** నియోజకవర్గ పరిధిలో నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రతిపాదిత నూతన పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మల్కాజిగిరి జోనల్ కమిషనర్ ను కోరారు. శుక్రవారం ఆయన జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా స్మశాన వాటికల అభివృద్ధి, పార్కులు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, బాక్స్ డ్రెయిన్ పనులతో పాటు సీసీ రోడ్ల నిర్మాణానికి వెంటనే నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వినతులపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్ధం పరశు రాం రెడ్డి, ప్రభాకర్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, వెంకటేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, నర్సింగ్ రావు, బాలకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
19 సెప్టెంబర్ 2026

# ఎంఎస్ అగర్వాల్ కంపెనీ హటావో...!

- కాలుష్యంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు
- ప్రజల గోడును పట్టించుకోని ఎమ్మెల్యే, మంత్రి
- కంపెనిని తొలగించే వరకు ప్రజా పోరాటం ఆగదు
- కంపెనీ తొలగించే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తామని హెచ్చరిక

**మెదక్ బ్యూరో చీఫ్ / మనోహరాబాద్, సెప్టెంబర్ 19( జనం సాక్షి) :** మనోహరాబాద్ మండలం రంగాయపల్లి, చెట్లగౌరారం గ్రామాల సమీపంలోని ఎంఎస్ అగర్వాల్ కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై జిల్లా యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. కంపెనీ కాలుష్యంతో జలవనరులు, పంట పొలాలు కలుషితమవుతున్నాయని, భూగర్భ జలాలు సైతం దెబ్బతింటున్నాయని ఆరోపించారు. సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 30 నుంచి 35 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పరిశ్రమ 2005లో ఉత్పత్తులను ప్రారంభించిందని గ్రామస్థులు తెలిపారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థాలను డ్రైనేజీలు, చెరువులు, కుంటలు, వాగులు, ఖాళీ స్థలాల్లో పారబోస్తున్నారని ఆరోపించారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, బోరు నీరు రంగుమారి దుర్వాసన వస్తోందని పేర్కొన్నారు. కాలుష్యం కారణంగా చర్మవ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలు




పెరిగాయని గ్రామస్థులు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారించిన వివరాలు వెల్లడించాల్సి ఉంది. ఎంఎస్ అగర్వాల్ కంపెనీ తమ ప్రాంతంలో వద్దంటూ గ్రామస్థులు నినాదాలు చేశారు. కంపెనీ వల్ల తమ పిల్లల భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతిపత్రాలు సమర్పించినా ఇప్పటివరకు సమస్య కొలిక్కి రాలేదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను కంపెనీ ప్రాంగణంలో కాకుండా గ్రామ నడిబొడ్డున నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కాలుష్యంపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి, పరిశ్రమల శాఖ మంత్రి గ్రామాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడి సమస్య





పరిష్కారం సాధించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని గ్రామస్థులు హెచ్చరించారు.

## వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి రంగం సిద్ధం

- రూ.11.75 కోట్లతో సెమీ రెసిడెన్షియల్ విధానంలో అత్యాధునిక పాఠశాల



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణల్లో భాగంగా పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. రూ. 11.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ పాఠశాల ద్వారా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు, మెరుగైన బోధనా విధానాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి శుక్రవారం వెల్టూరు గ్రామాన్ని సందర్శించి తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించి, విద్యార్థులకు అన్ని విధాలా అనుకూలంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లపై సూచనలు చేశారు. విదేశాల్లో అమలవుతున్న ఉత్తమ విద్యా విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణ అవసరాలకు అనుగుణంగా వాటిని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఒక్కో విద్యార్థికి సుమారు రూ. 1,400 విలువైన విద్యా సామగ్రి సమకూర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు.

## గంజాయి చాక్లెట్ల స్వాధీనం

- ఒకరి అరెస్ట్



**తూప్రాన్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద నర్సాపూర్ ఎక్సైజ్ అధికారుల తనిఖీలు గంజాయి చాక్లెట్లు లభించినట్లు నర్సాపూర్ ఎక్సైస్ అధికారులు పట్టుకున్నారు. నర్సాపూర్ ఎక్సైజ్ అధికారుల వాహన తనిఖీల్లో 218 గ్రాముల డ్రై గంజాయి చాక్లెట్లు స్వాధీనం. ఈరోజు ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు నర్సాపూర్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు సిబ్బందితో కలిసి మనోహరాబాద్ టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా డ్రై గంజాయి చాక్లెట్లను కలిగి ఉండటం, రవాణా చేయడం విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు గుర్తించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్పూర్ కు మురెరి గద్వ కు చెందిన రాహుల్ ను అదుపులోకి తీసుకున్నారు అతని వద్ద నుంచి మొత్తం 218 గ్రాముల డ్రై గంజాయి చాక్లెట్లను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిని జిల్లా ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి ఆదేశాల మేరకు దాని నిర్వహించినట్లు చెప్పారు. ఈ ఘటనపై నర్సాపూర్ ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా చూడాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూడాలి

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక (సబ్‌ప్లాన్) నిధులు నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. శుక్రవారం వనపర్తి సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూసి, వారి సమస్యలను సావధానంగా విని నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందించాలని, ఎఫ్ఎస్ఎల్ కేసులు పెండింగ్‌లో లేకుండా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ బాధితులకు అందాల్సిన పరిహారం, విదేశీ విద్య, కులాంతర వివాహ ప్రోత్సాహకాలు తదితర ప్రయోజనాలు పెండింగ్‌లో లేకుండా చూడాలని తెలిపారు. పెండింగ్ పరిహారాల వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని సూచిస్తూ, ఈ నెల 22న ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో నిధుల విడుదల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, రోస్టర్ విధానం పక్కాగా అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి



అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్టీలకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో తగిన అవకాశాలు కల్పించాలని, పారిశుద్ధ్య కార్మికులకు భద్రతా పరికరాలు, సకాలంలో వేతనాలు అందేలా చూడాలని అన్నారు. జిల్లాలో అటవీ భూముల సమస్యలను ఈ నెల 22న జరిగే సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వివరాలు అందించాలని కోరారు. వనపర్తిలో అంబేద్కర్ కళాభవనం, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నెల సివిల్ రైట్స్ డే, మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు లక్ష్మణ్, రాంబాబు నాయక్, అదనపు కలెక్టర్లు ఖిమ్యా నాయక్, వినోద్‌కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిరాజుద్దీన్, సామాజికవేత్త గంధం నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో ఘనపూర్ విద్యార్థి సత్తా

- లాంగ్‌జంప్‌లో 6.86 మీటర్లు.. బంగారు పతకం కైవసం




**ఖిల్లా ఘనపూర్ సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** మండల కేంద్ర నికి చెందిన విద్యార్థి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటాడు. పుదుచ్చేరిలో శుక్రవారం జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్ విభాగంలో 6.86 మీటర్ల దూరం దూకి బంగారు పతకం సాధించాడు. వివరాలకు వెళితే ఘనపురం మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన కదిరి ఉదయ్ కిరణ్ తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఈ ఘనత సాధించాడు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడంతో పర్వతాపూర్ గ్రామం, ఖిల్లా ఘనపూర్ మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాడు. ఉదయ్ కిరణ్ సాధించిన విజయంపై గ్రామస్థులు, విద్యార్థులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి తెలంగాణకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఆర్టీసీ బస్సు ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా

- ప్రయాణికులకు మెరుగైన వైద్యం అందించాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి

**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి స్టేజి వద్ద సికింద్రాబాద్ - సిద్దిపేట మధ్య ప్రయాణిస్తున్న సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఆర్టీసీ ఎండీతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడగా, క్షతగాత్రులను అధికారులు వెంటనే సిద్దిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సహాయం అందించడంతో పాటు, అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## రేపల్లె దళిత కుటుంబం ఇల్లు కూల్చివేతపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు కమిటీ వినతి



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా రేపల్లె గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన ఇంటిని కూల్చివేసిన ఘటనపై అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఇంటి కూల్చివేతకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్‌ను కోరారు. దళిత కుటుంబానికి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం వెంటనే గుర్తించి, బాధితులకు నూతన పక్కా ఇంటిని నిర్మించి ఇవ్వడంతో పాటు 25 లక్షలు తగిన నష్టపరిహారం అందించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. దళితుల హక్కులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించకుండా బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ ప్రత్యేకంగా జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో ఇలాంటి సంఘటనలు మళ్ళీ మళ్ళీ జరగకుండా సామాజిక చైతన్య కార్యక్రమాలు అవగాహన కార్యక్రమాలు పెంపొందించాలని తగిన రక్షణ కల్పించాలని దీనికోసం సమాజంలో అవగాహన ఉన్నటువంటి ప్రజాసంఘాలు సామాజిక సంస్థలు స్వచ్ఛత సంస్థలు న్యాయవాదులు టీచర్ల ద్వారా నిరంతరాయంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్ రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు, సిపిఐఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి, బహు జన రాజ్య సమితి నాయకులు వినోద్, కోళ్ల హుస్సేన్,వాల్మీకి, బి ఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కుర్వ పల్లయ్య,అవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు అతికూర్ రెహ్మాన్,టీపీఎఫ్ రాష్ట్ర కోశాధికారి ప్రభాకర్. సిఎల్సి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సుభాన్ బి ఆర్ ఎస్ గంజిపేట రాజు,సిపిఐ ఎంఎల్ బీరవెల్లి దానయ్య, భీమ్ ఆర్మీ మాచర్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో విద్యార్థుల అస్వస్థతపై విచారణ



**మునిపల్లి, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** మునిపల్లి మండలం లోనికలాన్ గ్రామంలోని ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం చోటుచేసుకున్న విద్యార్థుల అస్వస్థత ఘటనపై జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. మునిపల్లి మండల విద్యాధికారి భీమసింగ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంతోషి కుమారి, తుకారాం పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయురాలు సునీత కులకర్ణి, ఉపాధ్యాయులు, విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశం (సామాజిక శాస్త్రం) తీసుకొచ్చిన చికెన్ బిర్యానీ తిన్న అనంతరం కొంతమంది విద్యార్థులకు వాంతులు కావడంతో వారిని సదాశివపేట, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించినట్లు విచారణలో వెల్లడైంది. మొత్తం 34 మంది విద్యార్థులు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో 12 మంది, సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 22 మంది చికిత్స పొందిన అనంతరం కోలుకున్నారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. అధికారులు విద్యార్థులను స్వయంగా పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన విచారణ నివేదికను జిల్లా విద్యాధికారికి సమర్పించారు.

## పర్యావరణ పరిరక్షణతో పాటు వెదురు వృత్తులకు ప్రోత్సాహం

- అదనపు కలెక్టర్లు సంగీత, పాండు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణతో పాటు వెదురు ఆధారిత వృత్తులను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెదురుతో తయారు చేసిన వివిధ రకాల వస్తువుల ప్రదర్శనను అదనపు కలెక్టర్లు తిలకించారు. వెదురు ఉత్పత్తుల తయారీ, వినియోగం, సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణలో వెదురు మొక్కలకు, వెదురు ఉత్పత్తులకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. వెదురు ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక అభివృద్ధికి దోహదపడవచ్చని



తెలిపారు. మేదర సామాజిక వర్గానికి చెందిన అనేక మంది వెదురు ఆధారిత వృత్తిని జీవనాధారంగా కొనసాగిస్తున్నారని, తరతరాలుగా వస్తున్న సంప్రదాయ వృత్తిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వెదురుతో వివిధ ఉపయోగకరమైన వస్తువులను తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వెదురు ఉత్పత్తుల తయారీలో అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని అదనపు కలెక్టర్లు అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని, విద్యతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు కాలానుగుణంగా అభివృద్ధి చెందాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పై చదువులు చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఏ. జగదీష్, అదనపు డీఆర్‌డీఓ బాల్‌రాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి రవి, మేదరి మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు అంబదాస్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర, కోశాధికారి పులి రాజేష్ కుమార్, నాయకులు ఆంజనేయులు, రమేష్, నరేందర్, ప్రమోద్ కుమార్, సాయి మల్లేష్, శ్రీలత, జగదాంబ, సంతోషి, రజిని, మమత, బిక్షపతి, సిబ్బంది, మేదర సామాజిక వర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాగుపాము కాటుతో మహిళ మృతి

- బాత్ రూంలోకి వెళ్లగా పాము కాటు
- చికిత్సకు తరలించేలోపే మృతి

**నంగునూరు, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** నాగుపాము కాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన విషాద ఘటన నంగునూరు మండలం బద్దిపడగలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పసుపుల సుశీల (52) శుక్రవారం ఉదయం సుమారు ఏడు గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్‌రూంలోకి వెళ్లింది. అప్పటికే అక్కడ ఉన్న నాగుపాము



సుశీలను కాటువేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాము కాటుకు గురైన సుశీల తీవ్ర అస్వస్థతకు గురయ్యింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ పరిస్థితి విషమించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో బద్దిపడగ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన పసుపుల సుశీలకు భర్త యాదయ్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న సుశీల మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబానికి సుశీల మృతి తీరని లోటుగా మారింది. పాము కాటుకు గురికాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్ల పరిసరాలు, మరుగుదొడ్లు, బాత్‌రూంలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చీకటి ప్రదేశాల్లోకి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని గ్రామ సర్పంచి మంద లక్ష్మి రాజు సూచించారు.

## ఉర్సు చెరువు ప్రాంతాన్ని టాంక్ బండ్‌గా తీర్చిదిద్దాలి

- కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసిన తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** చారిత్రాత్మక వరంగల్ మహా నగరంలో ఉన్న ఉర్సు చెరువు ముందు ప్రాంతాన్ని టాంక్ బండ్ మాదిరిగా మార్చి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తేవాలని తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదను కలిసి వినతి పత్రం సమర్పించి విజ్ఞప్తి చేశారు. ఈ అహ్లాదకర ప్రదేశంలో హైదరాబాద్ వంటి ప్రసిద్ధ నగరంలో ఉన్న ట్యాంక్ బండ్,ఉప్పల్ రామంతాపూర్ చెరువు ముందు ప్రాంతాలలో వివిధ సంఘ సంస్కర్తలైన మహనీయుల విగ్రహాలను నెలకొల్పిన నేపథ్యంలో పర్యాటకంగా ఏ విధంగా ఆ ప్రాంతాలు అభివృద్ధి సాధించాయో అదే విధంగా వరంగల్ మహా నగరంలో ఉన్న ఉర్సు చెరువు ముందు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా చేసి మహనీయుల విగ్రహాలను నెలకొల్పి వారి స్ఫూర్తిని భావి తరాలకు అందించాలని కోరారు. మా జాతి ఆరాధ్య దైవం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని, మా జాతి ప్రముఖ వ్యక్తి, తెలంగాణ సిద్ధాంతకర్త దివంగత డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ గారి విగ్రహాన్ని కూడా ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు పెందోట సురేష్ కుమార్,వీణవంక సదానందం,రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్,సిద్దోజు వీరన్న తదితరులు ఉన్నారు.

## వెదురు వస్తువుల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణ

- జిల్లా కలెక్టర్ కె.హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18(జనంసాక్షి) :** వెదురుతో తయారుచేసిన వస్తువులను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు పేదవాడి కలప అని, వెదురు పెంచడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. మేదరులు తయారు చేసే వెదురు వస్తువులు చాలా చౌకగా లభిస్తాయని, వాటిని కొనుగోలు చేసి వారి కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించి ప్రోత్సహించడంతో పాటు కాలుష్య నియంత్రణలో భాగస్వాములు కావాలని తెలిపారు. మేదర కులస్తులు తమ నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని తెలిపారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన మేదర కుటుంబాలకు అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వెదురు మొక్కలను నాటి సంరక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా మేదరులు తయారుచేసిన వస్తువులను పరిశీలించారు. అనంతరం వెదురుతో తయారు చేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి జ్ఞాపకను కలెక్టర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నదీమ్, ముఖ్య ప్రణాళిక అధికారి గురువయ్య, జిల్లా మేదర సంఘం ప్రతినిధులు సులువ కనకయ్య, డీకొండ సత్యనారాయణ, మేదర కులస్తులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పరిశీలన



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం సంబధిత అధికారులతో సందర్శించి పనులను పరిశీలించారు. పరిశీలన అనంతరం పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష లో ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, పారిశుధ్యం తదితర పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అందుకు ఆసుపత్రి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంజీఎం పర్యవేక్షకులు రాం కుమార్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజకుమార్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ ఆనందం, ఆర్ అండ్ బీ ఈఈ రాజేందర్, ఆర్డీఓ సుమ, ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సర్వాణన్, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ఫుల్.. ప్రజాప్రతినిధులు నిల్..!

- మండల సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టిన సర్పంచులు..
- 23 మందికి 8మంది మాత్రమే హాజరు...
- ఎజెండా అంశాలపై జరగని చర్చ..



**వెంకటాపూర్ (రామప్ప), సెప్టెంబర్ 18 (జనం సాక్షి):** వెంకటాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా ముగిసింది.మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించేందుకు నిర్వహించే అత్యంత కీలకమైన ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కాగా, ప్రజాప్రతినిధులు మాత్రం గైర్హాజరు అయ్యారు. దీంతో మండల సర్వ సభ్య సమావేశం కాస్త కేవలం అధికారుల సమావేశంగా మారింది.వెంకటాపూర్ మండలంలో మొత్తం 23 గ్రామ పంచాయతీలకు 23 మంది సర్పంచ్ లు ఉన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలపై చర్చించేందుకు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీడీవో రాజ్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు హాజరు కావలసి ఉండగా, కేవలం కేశవాపురం సర్పంచ్ తోట భద్రయ్య,తిమ్మాపూర్ సర్పంచ్ మామిడి పవన్,నర్సాపూర్ సర్పంచ్ గైరుద్రమాదేవి, అడవిరంగాపూర్ సర్పంచ్ దొంతరవేన లక్ష్మి, నల్లగుంట సర్పంచ్ భూక్యాశ్రీదేవి, సింగరకుంటపల్లి సర్పంచ్, నర్సింగాపూర్ సర్పంచ్, వెల్తుర్లపల్లి సర్పంచ్ మాత్రమే హాజరు కాగా మిగతా 15 గ్రామాల సర్పంచులు హాజరు కాలేదు. దీంతో సమావేశ మందిరంలోని అధికారుల కుర్చీలు నిండగా కనిపించగా, ప్రజాప్రతినిధుల కుర్చీలు మాత్రం ఖాళీగా దర్శనమిచ్చాయి. సమావేశం ప్రారంభంలో మొదటి గా ఒక్క సర్పంచ్ మాత్రమే హాజరు కాగా, సమావేశం పూర్తి అయ్యేలోగా మరో 7 గురు సర్పంచ్ లు హాజరవ్వటం తో మొత్తం 8 మంది సర్పంచ్ లు మాత్రమే హాజరు కావటం విశేషంగా మారింది.

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోఎంపీడీఓ రాజు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి విబిజిరామ్ జీ. ఉపాధి హామీ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, రెవిన్యూ మరియు పౌరసరఫలాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ,అటవీ సంరక్షక శాఖ, పశు సంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖ, వైద్య మరియు ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, విద్యుత్ శాఖ,ఎక్సైజ్ శాఖ,పట్టు పరిశ్రమ అభివృద్ధి శాఖ, వెనుకబడిన తరగతుల సహకార సంస్థ శాఖ,షెడ్యూల్ కులముల సహకార సంస్థ శాఖ,గిరిజన సహకార సంస్థ శాఖ, సహకార సంఘాల శాఖ, ఎ.ఇ.పిఆర్ శాఖ, రోడ్డు రవాణా సంస్థ శాఖ, సెర్ప్ శాఖ, ఎఇ ఇరిగేషన్ శాఖ, ఎఇ ఆర్ అండ్ బి శాఖతోపాటు ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష జరిపేందుకు అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. కాగా, వారు తమ శాఖల పురోగతి నివేదికలను సిద్ధం చేసుకుని వచ్చారు.కానీ,వాటిని వినేందుకు, ప్రశ్నించేందుకు సమావేశం లో సర్పంచ్ లు లేకపోవడంతో అధికారులు తమలో తామే చర్చించుకుని వెళ్లిపోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గత 3 సర్వసభ్య సమావేశాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సర్పంచ్ లకు వారం రోజుల ముందే నోటీసులు ఇవ్వడం, ఫోన్లు చేసి ఆహ్వానించడం చేసినా వారు పట్టించుకోవడం లేదు. సమావేశ సమయంలో ఎప్పుడు ఇదే తంతు కొనసాగుతుంది.దీంతో మండల సర్వ సభ్య సమావేశం లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరగకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సర్వసభ్య సమావేశాలకు సర్పంచ్ లు హాజరు అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులు,ప్రజలు కోరుతున్నారు.



## వృద్ధుడికి కలెక్టర్ భరోసా

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18(జనంసాక్షి):** వృద్ధుడి పోషణ విషయంలో అండగా ఉండి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత భరోసా ఇచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయానికి తన కుమారుడు తన పోషణ, బాగోగులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసేందుకు వచ్చిన జిల్లాలోని కాగజ్ నగర్ మండలం బోడేపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే వృద్ధుడి వద్దకు జిల్లా కలెక్టర్ వెళ్లి సమస్యను విని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

## అంటువ్యాధుల నివారణకు అప్రమత్తంగా ఉండాలి



**లక్ష్మణచందా, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి సూచించారు. లక్ష్మణచందా మండలం పారుపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలంలో పారిశుధ్య లోపం, కలుషిత నీరు, దోమల వ్యాప్తి కారణంగా వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకుని వ్యాధులను నిరోధించడమే మేలైన పద్ధతి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ నటరాజ్ గౌడ్, ఆరోగ్య సహాయకుడు శివకృష్ణ గౌడ్, ఏఎన్ఎంలు కళ్యాణి, వనజ, ఆశా కార్యకర్తలు గంగామణి, కల, పంచాయతీ కార్యదర్శి పి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎండిపోతున్న పంట పొలాలు

- కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్
- తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న కాల్ నాయక్ తండావాసులు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయి త్రీఫేస్ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు వేసుకున్న పంటలు ఎండిపోయి తాగునీటి కోసం తండావాసులు, రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు తెలిపిన పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కాల్ నాయక్ తండాలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయి 13 రోజులు అవుతుంది. దీంతో త్రీఫేస్ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీని మూలంగా రైతులు వేసుకున్న పంట పొలాలకు వ్యవసాయ బావుల ద్వారా సాగునీరు అందించుకోలేక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక గ్రామపంచాయతీ నల్లాల బావికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా నిల్చుకోవడంతో త్రాగునీరు అందక గ్రామస్తులు నానా తంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను వెంటనే మరమ్మతులు చేయించి త్రీఫేస్ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి పంటలు ఎండిపోకుండా చూడాలని అలాగే గ్రామపంచాయతీ నల్లాల బావిద్వారా త్రాగునీటికి అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని వార్డు సభ్యులు బానోతు వీరు, భూక్య శ్రీను, గ్రామస్తులు, తండావాసులు, రైతులు బానోత్ రమేష్, గుగులోతు నరేష్, బానోతు జంపన్న, గుగులోతు స్వామి, తదితరులు కోరుతున్నారు.

## రెసిడెన్షియల్ విద్యా విధానం భేష్

- టర్కీ దేశస్థుల కితాబు
- ముప్పారం కస్తూర్బా పాఠశాలను సందర్శించిన టర్కీ దేశస్తులు
- రెసిడెన్షియల్ విద్యా విధానం భేష్ : టర్కీ దేశస్థుల కితాబు




**వేలేరు సెప్టెంబర్ 18(జనం సాక్షి) :** తెలంగాణలో రెసిడెన్షియల్ విద్యా విధానం ముఖ్యంగా కస్తూరిబా పాఠశాలలో మెరుగైన నాణ్యమైన విద్య బాగుందని టర్కీ దేశపు ప్రతినిధులు ప్రశంసించారు. భారతదేశ విద్యా విధానం అధ్యయనంలో భాగంగా తెలంగాణలో పర్యటిస్తున్న టర్కీ విదేశీయుల బృందం శుక్రవారం ముప్పారం కస్తూరిబా పాఠశాలను సందర్శించింది. టర్కీ కి చెందిన మసూద్, నూరుల్లాఖాన్ లు మాట్లాడుతూ తెలంగాణ జిల్లాలో రెసిడెన్షియల్ విద్యా విధానంపై అధ్యయనం చేస్తున్నామని ఇందులో కస్తూర్బా పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు నాణ్యమైన విద్యను గమనించామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రతిపాదనలు విద్యను మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. టర్కీ దేశంలో తెలంగాణ విద్యా విధానాన్ని అమలు చేసేందుకు దాదాపు మూడు నెలల పాటు పర్యటన ఉంటుందని వివరించారు. విద్యార్థినులకు అందిస్తున్న న్యూట్రిషన్ ఫుడ్, హైజెనిక్ కిచెన్, స్టోర్, గ్రంథాలయం, కంప్యూటర్ తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తినీ వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థినీల తో ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక టర్కీ దేశస్థులకు అలాగే ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులకు ఎమ్మెల్సీలకు స్వాగతం పలికి సన్మానం చేశారు. పాఠశాలలో ముప్పారం గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విలేజ్ క్యాబినెట్, గ్రామ సమాచార పుస్తకాన్ని అందజేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ బృందంలో పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, బాల్ రెడ్డి అశ్విన్ లతో పాటు ఎంపీడీవో అనిల్ కుమార్,ఈ కార్యక్రమంలో జిల్లా డి.ఈ.ఓగిరిరాజ్ గౌడ్, సునీత గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక, కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి మాధవి, గ్రామ కార్యదర్శి ఆకార సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## లంచం లేనిదే పని కావడం లేదు..

- కలెక్టర్ మేడం నా బాధ వినండి..
- కలెక్టర్ కు బాధను విన్నవించుకున్న బాధితుడు



**నడికుడ సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా కలెక్టర్ నడికుడ మండలంలో శుక్రవారం పర్యటించారు పర్యటనలో భాగంగా తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ కు మండలంలోని చౌటుపర్తి గ్రామానికి చెందిన బోయినీ ప్రవీణ్ రెడ్డి తహసిల్దార్ కార్యాలయ అధికారుల నిర్లక్ష్య ధోరణి పై ఫిర్యాదు చేయడం జరిగింది మేడం దయచేసి నా బాధ వినండి అంటూ బాధితుడు గోడువెళ్లబోసుకున్నాడు తహసిల్దార్ కార్యాలయంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా లంచం లేనిదే పని కావడం లేదు మేడం లేదు అంటూ తెలియజేశారు చౌటుపర్తి గ్రామంలో వ్యవసాయ భూమి అత్యధికంగా ఉన్నవారికి ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ ఎలా మంజూరు చేశారని అది ఎలా సాధ్యమైందని అన్నారు కలెక్టర్ వెళ్ళాక స్పందించిన తహసిల్దార్. మీ గ్రామంలో ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ పొందిన వారు ఎవరు వారు ఎవరికి లంచం ఇచ్చారు మా దగ్గరికి తీసుకురండి వారి వివరాలు తెలపండి వారిపై తక్షణమే చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ తెలిపారు.

## విద్యుద్ఘాతంతో ఇల్లు దగ్ధం

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 18(జనంసాక్షి) :** మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్ ఐటీఐ వెనుక నివాసం ఉంటున్న ఇర్పా సుజాత–నరేష్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి ఘటనను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ తహసీల్దార్ కి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. ప్రభుత్వ సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చిటమట రఘు హామీ ఇచ్చారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులకు సాధ్యమైనంత సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, కూరపాటి వేణు, గండపెల్లి సత్యం, వార్డు నెంబర్ ముమ్మనేని రమేష్, గండపెల్లి మహాలక్ష్మి, గండపెల్లి రజిని, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల తహసిల్దార్ రాఘవేంద్ర తో కలిసి సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులముల సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి భవనం శిథిలావస్థలో ఉన్నందున నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. తెలంగాణ ఆదర్శ పాఠశాల, బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

జనంసాక్షి www.janamsakshi.org
శనివారం 19 సెప్టెంబర్ 2026

## ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

- అదనపు కలెక్టర్ సీను పరిశీలన
- త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభం



**మక్తల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో పలు కీలక ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం అదనపు కలెక్టర్ సీను శుక్రవారం స్థలాలను పరిశీలించారు. ?ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మహిళా సమాఖ్య భవనం, సెట్విన్, ఏటీసీ సెంటర్ పలు పీహెచ్‌సీ కేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలనకు సంబంధించిన పూర్తి నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి అందజేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. స్థలాల కేటాయింపుపై మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తుది నిర్ణయం తీసుకుంటారని, ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే అతి త్వరలో నూతన భవన నిర్మాణ పనులను సైతం ప్రారంభిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ పర్యటనలో ఆయన వెంట తహశీల్దార్ సతీష్ కుమార్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్ శాలం తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సౌకర్యం కల్పించాలి

- సూర్యాపేట పట్టణ బంద్ విజయవంతం
- బంద్‌కు మద్దతుగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు

**సూర్యాపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుల్లెట్ ట్రైన్ సాధన పోరాట కమిటీ ఇచ్చిన పిలుపు సూర్యాపేట పట్టణ బంద్ శుక్రవారం స్వచ్ఛందంగా, ప్రశాంతంగా జరిగింది.జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపో ఎదురుగా తెల్లవారుజామున నాలుగు గంటలకు అఖిలపక్షాల నాయకులు చేరుకొని బస్సులు బయటికి రాకుండా అడ్డుకున్నారు. వివిధ సంఘాలు బంద్ ను విజయవంతం చేసేందుకు మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్న వర్తక, వాణిజ్య, వ్యాపార, ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థలు, వర్క్ షాప్ లు, హోటళ్లు షాపింగ్ మాల్‌లు, కిరాణా షాపులు, ఆటో నగర్, బైక్ మెకానిక్‌ల అసోసియేషన్, పట్టణంలోని అన్ని రంగాల సంస్థలు మూసివేసి సూర్యాపేట బంద్‌కు సంఘీభావం ప్రకటించారు.రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, సూర్యాపేట బార్ అసోసియేషన్, ఆటోనగర్ కార్మిక సంఘం, హోటల్ యజమానుల సంఘం, టైలర్స్ అసోసియేషన్,క్లాత్ మర్చంట్ అసోసియేషన్, దివ్యాంగుల అసోసియేషన్, తదితర సంఘాలు బందుకు మద్దతుగా ర్యాలీలు చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు,ముస్లిం మైనారిటీ నేతలు,మహిళా సంఘాల బాధ్యులు, బందులో,ర్యాలీలో



పాల్గొన్నారు.అన్ని పార్టీల నేతలు, విద్యార్థి, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, బుల్లెట్ ట్రైన్ సాధన కమిటీ ప్రధాన బాధ్యులు పట్టణ బందులో పూర్తిగా పాల్గొని ముందుండి నడిచారు.మధ్యాహ్నం దీక్షా శిబిరం నుండి కొత్త బస్టాండ్ వరకు అన్ని సంఘాలు, సంస్థలు, పార్టీలతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ,డాక్టర్ రామ్మూర్తి యాదవ్ , నూకల సుదర్శన్ రెడ్డి, తలమల్ల హసెన్, కొనకంచి వీరభద్రయ్య, అనంతుల యల్లయ్య, యాదగిరి రావు, గండూరి శంకర్, యమా ప్రభాకర్, ఇరిగి కోటేశ్వరి, జహంగీర్,పోలేబోయిన కిరణ్, గంట నాగయ్య, బెలిదే శ్రీనివాస్, బండారు రాజా, కర్నాటి కిషన్,రవి, సలిగంటి వీరేందర్, ముప్తి సయ్యద్, రాపర్తి శ్రీనివాస్ గౌడ్,రాందేని అదినారాయణ,యాతకుల రాజయ్య,సంపత్, సింహాద్రి, సుమన్ నాయక్,నాగు నాయక్,మురళీ తదితరులు పాల్గొన్నారు.శంషాబాద్ నుండి చెన్నై కు వయా జాతీయ రహదారి 65కు సమాంతరంగా సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ కోసం మద్దతుగా సూర్యాపేట పట్టణ బందును, విజయవంతం చేసి ప్రజల ఆకాంక్షను బలంగా రాష్ట్ర స్థాయికి చేరిందని ఉద్యమ కమిటి అభిప్రాయం వ్యక్తం చేసింది.ఈ కార్యక్రమంలో ఉద్యమ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి, గౌరవ సలహా దారులు పెద్దిరెడ్డి గణేష్ , రమణాచారి, పెద్దిరెడ్డి రాజా, ధర్మార్జున్,మల్లు నాగార్జున రెడ్డి , తండు శ్రీనివాస్ యాదవ్, డేవిడ్ కుమార్ , బూర వెంకటేశ్వర్లు ,కొత్తపల్లి శివకుమార్, రేణుక, నెమ్మాది వెంకటేశ్వర్లు, వేల్పుల వెంకన్న, అనంతుల మధు,జర్నలిస్టు భూపతి రాములు, యాదగిరి,సట్టు నాగయ్య, వెలుగు వనిత, శోభారాణి, విద్యార్థి సంఘం నాయకులు సునీల్, అఖిల్, సంతోషి, పద్మ,సంతోష్ రెడ్డి, విప్లవ్ కుమార్, సురేష్ నాయక్, శివ నాయక్, సందీప్, మహేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.బుల్లెట్ ట్రైన్ సాధనలో ముందస్తుగా బందుకు పిలుపునిచ్చి ఆర్టీసీ డిపో ముందు నిరసన వ్యక్తం చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు.

# ఫుడ్ సేఫ్టీ తనిఖీలు ఎక్కడ..?

- హోటళ్లు, స్ట్రీట్‌ఫుడ్, స్వీట్‌హౌస్‌లపై నిఘా కరువు
- నాణ్యతపై పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వాహకుల ఇష్టారాజ్యం
- ఆకస్మిక తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని వినియోగదారుల డిమాండ్

**మర్పల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** మండలంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు కనిపించకపోవడంపై ప్రజలు, వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు నిత్యం వినియోగించే ఆహార పదార్థాల నాణ్యత, తయారీ విధానం, పరిశుభ్రతను పరిశీలించాల్సిన అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని హోటళ్లు, స్ట్రీట్‌ఫుడ్ సెంటర్లు, స్వీట్‌హౌస్‌లు, టిఫిన్ సెంటర్లలో ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాలపై పర్యవేక్షణ కొరవడిందని స్థానికులు పేర్కొంటున్నారు. కొన్ని హోటళ్లలో కనీస పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకుండానే ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నాణ్యత లేని ముడి పదార్థాలను ఉపయోగిస్తున్నారనే ఫిర్యాదులు కూడా వినిపిస్తున్నాయి.

### ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం

ఆహార పదార్థాల నాణ్యతపై తనిఖీలు లేకపోతే కల్తీ, నాసిరకం పదార్థాల వినియోగం, అపరిశుభ్రమైన వాతావరణంలో తయారీ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. బయట ఆహారం తీసుకునే ప్రజలు



నాణ్యతపై సందేహాలు వ్యక్తం చేస్తున్నా సంబంధిత శాఖ నుంచి క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదని అంటున్నారు.

### ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మర్పల్లి మండలంలోని హోటళ్లు, స్వీట్‌హౌస్‌లు, టిఫిన్ సెంటర్లు, స్ట్రీట్‌ఫుడ్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఆహార నాణ్యత, పరిశుభ్రతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## బీసీ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి



**గద్వాల, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** గద్వాల పట్టణంలోని వైఎస్సార్ చౌక్ మరియు పాత బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన బీసీ హక్కుల సింహగర్జన సభకు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు, బీసీ సంఘాల ప్రతినిధులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. సభలో బీసీల హక్కులు, సామాజిక న్యాయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ బీసీల రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధన కోసం వెనుకబడిన వర్గాలన్నీ రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్టసభల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో సరైన వాటా దక్కినప్పుడే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు.జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ బీసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి హక్కులను కాపాడుకోవాలని కోరారు. సభను విజయవంతం చేసిన కార్యకర్తలకు, బీసీ బంధువులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## గొర్రెల మంద వద్ద కుప్పకూలి గొర్రెల కాపరి మృతి

**తెలకపల్లి, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** గొర్రెల మంద వద్ద కుప్పకూలి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. శుక్రవారం ఈ సందర్భంగా స్థానిక ఎస్సై యం. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని దాసుపల్లి గ్రామంలో గొర్రెల కాపరిగా పనిచేస్తున్న దుడ్డు కాసుమల్లి (43) హఠాత్తుగా కుప్పకూలి మృతి చెందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారు దుడ్డు యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాసుమల్లి ప్రతిరోజూ గొర్రెలను కాసుకుంటూ దాసుపల్లి గ్రామంలో గొర్రెల మంద వద్దనే రాత్రి వేళ నిద్రిస్తుంటాడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 17న రాత్రి సుమారు 9:30 గంటలకు ఇంటి వద్ద భోజనం చేసి, దాసుపల్లిలోని గొర్రెల మంద వద్దకు వెళ్లాడు. అక్కడ బంధువులతో ఫోన్‌లో మాట్లాడుతుండగా అకస్మాత్తుగా కిందపడి మరణించినట్లు తెలిపారు. పక్కనే ఉన్న మరో గొర్రెల కాపరి మహేష్ గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే కాసుమల్లిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వైద్యుల ప్రకారం హార్ట్ స్ట్రోక్ కారణంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి మరణంపై తమకు ఎవరిపైనా ఎలాంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శవపరీక్ష నిర్వహించి మృతదేహాన్ని తమకు అప్పగించాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు.

# విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రభుత్వ కృషి

**మొయినాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీంభరత్ అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల పరిధిలోని కాశీంబౌలి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన నదీమ్నగర్ కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహంలో రంజిత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకోని కౌన్సిలర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీంభరత్ పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వసతి గృహాల అభివృద్ధి కోసం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తున్నారని తెలిపారు. వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు.



విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటూ చక్కగా చదువుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, నాయకులు పల్లగోల్ల అశోక్ యాదవ్, గడ్డం వెంకట్ రెడ్డి, దర్శన్, భిక్షపతి, మాధవరెడ్డి, శ్రీపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జగన్ రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలుకు ఉద్యమకారుల పట్టుదల

- అల్వాల్‌లో రెండో రోజూ కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



**అల్వాల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో అల్వాల్ తెలంగాణ అమరవీరుల శిబిరంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజూ కొనసాగాయి. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ నాయకులు దీక్షలు చేపట్టారు. హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేయకుండా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. రెండో రోజు రిలే నిరాహార దీక్షలో పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, రఫీష్, వెంగళ భాస్కర్, బి. సత్తయ్య కూర్చున్నారు. వారికి సంఘీభావంగా దయాకర్, సంతోష్, సుధీర్, సంగమేశ్వర్, రమేష్, వి.ఎన్. రాజు, నరసింహ తదితరులు దీక్షా శిబిరానికి హాజరై మద్దతు ప్రకటించారు.


## బాలానగర్ పీహెచ్సీలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

- సాధారణ ప్రసవాలే లక్ష్యంగా పని చేయాలని ఆదేశం

**బాలానగర్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా, బాలానగర్ మండలం కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలని, గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గర్భం దాల్చిన వెంటనే నమోదు, పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, ప్రమాదాన్ని ముందే గుర్తించి సాధారణ ప్రసవానికి కృషి చేయాలని సూచించారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు చేసి ముందస్తుగా గుర్తించాలని, దోమల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశించారు. సమావేశంలో డా. శైలజ, డా. రాజు, డా. నేహా ఫర్హానా, సుభాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పాడైన గుడ్లు చిన్నారులకేలా..?

**కేటీదొడ్డి, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** చిన్నారుల ఆకలి తీర్చి, వారికి పౌష్టికాహారాన్ని అందించాల్సిన అంగన్వాడీ కేంద్రాలు నిర్లక్ష్యానికి నిలయాలుగా మారుతున్నాయి. పసిపిల్లల ఆరోగ్యంపై అధికారులకు కాస్తయినా కనికరం లేకుండా పోయిందనడానికి కేటీదొడ్డి మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఘటనే నిదర్శనం. మండల కేంద్రంలోని ఒక అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పంపిణీ చేస్తున్న కోడిగుడ్లు తీవ్రంగా పాడైపోయి ఉన్నాయి. కుళ్ళిపోయినట్లు, నాణ్యత లేకుండా కనిపిస్తున్న ఈ గుడ్ల ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో స్థానికులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన మరియు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సకాలంలో ఇవ్వరు.. ఇచ్చినవి తినలేరు!ప్రభుత్వ నిబంధనల ప్రకారం గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు నెలకోసారి నాణ్యమైన గుడ్లను పంపిణీ చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ కనీస మానవత్వం లేకుండా సుమారు 50 రోజులకు ఒకసారి చొప్పున గుడ్లను ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలా ఆలస్యంగా ఇస్తూ, కనీసం అవి తినడానికైనా పనికొస్తాయా లేదా అని కూడా చూడకుండా పురుగులు పట్టినట్లు, పాడైపోయిన గుడ్లను చిన్నారులకు ఎలా ఇస్తారని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.ఇలాంటి నాణ్యత లేని ఆహారాన్ని తింటే పసిపిల్లల ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, పంపిణీ చేసే ముందు అధికారులకు కనీస బాధ్యత లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఈ అంగన్వాడీ కేంద్రంలో గుడ్ల నాణ్యతను పరిశీలించాలని, చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## కొడంగల్ పంచ జన్య సంకల్ప సభ విజయవంతం చేయండి

- తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి బేగరి రాజు
- టీఆర్ఎస్ పార్టీ ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ ప్రజాపతి
- పంచ జన్య సంకల్ప సభ వాల్ పోస్టర్ విడుదల

మొయినాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు పంచ జన్య సంకల్ప సభ వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈనెల 20వ తేదీన ఆదివారం కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండల కేంద్రంలోని కళాశాల ఆవరణలో పంచ జన్య సంకల్ప సభ విజయవంతం చేయాలని టీఆర్ఎస్ పార్టీ ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ ప్రజాపతి, టీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి బేగరి రాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచ జన్య సంకల్ప సభ ఉద్దేశం రాష్ట్రంలో అందరూ సామాజికంగా సమానంగా ఉండాలని, తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి వస్తే పంచ జన్య ఉచిత విద్య, ఉచిత వైద్యం ఉపాధి వ్యవసాయం సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కవితమ్మ నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ బలోపేతం అవుతుందని




రాష్ట్రంలో రానున్న ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమేనని వారు అన్నారు. ఈ సభకు చేవెళ్ల నియోజకవర్గం నుండి అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సహాయ కార్యదర్శి ఏనుగుల సంజీవరెడ్డి, టీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు ఎండీ.అన్వర్ ఖాన్, టీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపల్ కోశాధికారి షేక్ మొహమ్మద్ నూర్ భాయ్, టీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల ప్రధాన కార్యదర్శి బొక్క సురేందర్ రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు మద్యపాక శ్రీకాంత్ సాగర్, సయ్యద్ యాహియ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గీతా స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా రైతు దినోత్సవం




**మెదక్ టౌన్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కేంద్రంలోని గీతా స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం రైతు దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'రైతు రాజు' అనే నినాదంతో ఓ రైతును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి సుగుణాకర్, పీఈటీ నాగరాజు వ్యవహరించారు. విద్యార్థుల్లో రైతుల పట్ల గౌరవం, వ్యవసాయం ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. "రైతు లేనిదే రాజ్యం లేదు. రైతు పంటలు పండిస్తేనే సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆహారం అందుతుంది" అనే విషయాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి, రైతుల పట్ల గౌరవాన్ని చాటుతూ ప్రతిజ్ఞ చేయించారు. రైతు కష్టాన్ని గుర్తించి, అన్నదాతకు సమాజంలో సముచిత గౌరవం కల్పించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు.




# మిశ్రమంగా ముగిసిన సూచీలు

**ముంబై(జనంసాక్షి):**అమెరికాలో కీలక వడ్డీ రేట్లను పెంచడం, మున్ముందు మరిన్ని పెంపులు ఉండొచ్చనే సంకేతాల మధ్య.. కొనుగోళ్లకు మొగ్గు చూపే విషయంలో దేశీయ ఈక్విటీ మదుపర్లు జాగ్రత్తగా వ్యవహరించారు. ఈ ప్రభావంతో సూచీలు మిశ్రమంగా (సెన్సెక్స్‌కు నష్టం, నిఫ్టీకి లాభం) ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 2 పైసలు పెరిగి 95.89 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 1.02% నష్టంతో 104.75 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్, చైనా మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లూ సానుకూలంగా ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.3.12 లక్షల కోట్లు పెరిగి రూ.476.08 లక్షల కోట్ల (4.96 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.స్వల్ప శ్రేణిలో..: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 74,182.62 పాయింట్ల వద్ద నష్టాల్లో ఆరంభమైంది. వెంటనే లాభాల్లోకి వచ్చిన సూచీ.. స్వల్ప శ్రేణికి లోబడి కదలాడింది. చివరకు 21.86 పాయింట్ల నష్టంతో 74,314.59 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 53 పాయింట్లు లాభపడి, 23,270.60 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 23,363.55 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని; 23,193.65 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ తాకింది. తొమ్మిది డీలా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 9 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్ 2.82%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 2.38%, ఇండిగో 2.32%, ఎటర్నల్ 2.24%, మారుతీ సుజుకీ 1.64%, ఏషియన్ పెయింట్స్ 1.45% పెరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.3%, టైటన్ 1.14%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.03%, ఎస్‌బీఐ 0.67%, భారతీ ఎయిర్‌టెల్ 0.52% చొప్పున నష్టపోయాయి.

ఐపీఓ సమాచారమ్



నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) తొలి పబ్లిక్ ఆఫర్‌కు తొలి రోజున 43% బిడ్‌లు వచ్చాయి. రిటెయిల్ మదుపర్ల విభాగంలో 44% షేర్లకే దరఖాస్తులు వచ్చాయి. హీరో మోటార్స్ ఐపీఓ రెండో రోజుకు 3.36 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 5.02 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి. జిందాల్ సుప్రీమ్ లిమిటెడ్ ఐపీఓ రెండో రోజుకు 31.50 రెట్లు అధికంగా బిడ్‌లు వచ్చాయి. చిన్న మదుపర్ల విభాగంలో 39.74 రెట్ల స్పందన లభించింది. వర్మోరా గ్రానిటో రూ.708 కోట్ల పబ్లిక్ ఇష్యూ ఈనెల 22న ప్రారంభమై 24న ముగుస్తుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.140- 148. ఎ-వన్ స్టీల్స్ ఇండియా ఐపీఓకు ధరల శ్రేణిగా రూ.385- 405ను నిర్ణయించారు. ఇష్యూ ఈనెల 24న ప్రారంభమై 28న ముగియనుంది. యాగ్జియోమ్ గ్యాస్ ఇంజినీరింగ్ ఐపీఓ ఈనెల 18న ప్రారంభమై 22న ముగియనుంది. ఇష్యూకు ధరల శ్రేణి రూ.51- 54.

**లిస్టింగ్ కబుర్లు**

మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ షేర్లు స్టాక్ మార్కెట్లో నమోదైన తొలి రోజు 1.99% లాభపడి రూ.345.75 వద్ద ముగిశాయి. స్టీమ్‌హౌస్ ఇండియా షేరు ఇష్యూ ధర రూ.81తో పోలిస్తే, తొలి రోజున 26.17% లాభంతో రూ.102.20 వద్ద ముగిసింది. రెంటోమోజో లిమిటెడ్ షేరు కూడా ఇష్యూ ధర రూ.404 కంటే, 31.91% లాభపడి రూ.532.95 వద్ద ముగిసింది.కరమ్‌తారా ఇంజినీరింగ్ షేరు, ఇష్యూ ధర రూ.254తో పోలిస్తే 38.56% లాభంతో రూ.351.95 వద్ద స్థిరపడింది.ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ షేరు ఇష్యూ ధర రూ.146 కంటే 18.32% లాభంతో రూ.172.75 వద్ద ముగిసింది.అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్ (ఆర్సిల్) షేరు, ఇష్యూ ధర రూ.139తో పోలిస్తే 1.4% నష్టంతో రూ.137.05 వద్ద ముగిసింది.

# నెస్లే ఇండియాపై లీగల్ యాక్షన్

దిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ నెస్లే ఇండియా లిమిటెడ్‌పై ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చట్టపరమైన చర్యలకు దిగింది. చంటి పిల్లలకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల విషయంలో నిబంధనలు పాటించడంలో విఫలమైనందున లీగల్ యాక్షన్ చేపట్టింది. నాన్ ఎక్సెల్లాప్రో స్టేజ్ 1, లాక్టోజన్ ప్రో 1, మరో ఫాలోఅప్ ఫార్ములా విషయంలో ఇ-కామర్స్ ప్లాట్‌ఫారాల్లో ప్రమోషనల్ మెటీరియల్‌ను గుర్తించినట్లు ఈఊూాంఎ తెలిపింది.నాన్ ఎక్సెల్లా ప్రో స్టేజ్ 1లో 5ఊటూబ, వే ప్రోటీన్ ఉంటుందని, లాక్టోజన్ ప్రో 1లో వే ప్రోటీన్ సులభంగా జీర్ణం అవుతుందని కంపెనీ పేర్కొనడాన్ని ఈఊూాంఎ తప్పుబట్టింది. ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ రెగ్యులేషన్- 2020 కింద చంటిపిల్లల ఆహార ఉత్పత్తుల విక్రయాలను పెంచుకోవడానికి ఉద్దేశించిన ఇలాంటి ప్రకటనలు నిషిద్ధం. అలాగే, పిల్లల ఆహారానికి సంబంధించి ఎలాంటి ప్రకటనలూ ఇవ్వకూడదని 1992 నాటి మరో చట్టం చెబుతోంది. ఈ విషయంలో నెస్లే ఇండియా నిబంధనలు ఉల్లంఘించిందని ఈఊూాంఎ పేర్కొంది. దీంతో పాటు నెస్లే ఇండియా తయారు చేసిన ఫార్ములాలో బయోటిన్ పదార్థం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని గుర్తించింది. మూడు వేర్వేరు అడ్జ్యుడికేషన్ కేసులను నమోదు చేసింది. కంపెనీ నుంచి వివరణ తీసుకున్న అనంతరం ఈ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో నెస్లే ఇండియా షేర్లు 2 శాతం నష్టంతో 1345 వద్ద ట్రేడవుతున్నాయి.



# క్షణాల్లో ఇంటికే ఐఫోన్ లేటెస్ట్ మోడళ్లు

### బ్లింకిట్, జెప్టో పోటాపోటీ..


**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
యాపిల్ ఐఫోన్ ఫీవర్ మొదలైంది. కంపెనీ తాజాగా లాంచ్ చేసిన ఐఫోన్ 18 ప్రో మోడళ్ల విక్రయాలు దేశీయంగా ప్రారంభమయ్యాయి. వీటి కోసం కొనుగోలుదారులు అర్ధరాత్రి నుంచే ఆఫ్‌లైన్ స్టోర్ల వద్ద బారులు తీరారు. దీనికి సంబంధించిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో ఆర్డర్ చేసిన కొన్ని క్షణాల్లోనే మీ ఇంటికే కొత్త ఐఫోన్ మోడళ్లను డెలివరీ చేస్తామంటున్నాయి ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థలు బ్లింకిట్, జెప్టో.ఐఫోన్ 18 ప్రో ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్, యాపిల్ వాచ్ ఎస్ 12, ఎయిర్‌పాడ్స్ 5 బ్లింకిట్ ద్వారా కొనుగోలు చేయొచ్చని కంపెనీ సీఈఓ అల్బీందర్ దిండ్సా పేర్కొన్నారు. దిల్లీ-ఎన్‌సీఆర్, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, పుణె, కోల్‌కతా, అహ్మదాబాద్, జైపుర్, లఖ్‌నవూలో వినియోగదారులు ఈ సేవల్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపిక చేసిన కార్డులపై డిస్కౌంట్‌తో పాటు, నో-కాస్ట్ ఈఎంఐ సదుపాయం కూడా ఉంటుందని తెలిపారు.

# ఎన్ఎస్ఈ నుంచి ఆ ప్రతిపాదనేదీ రాలేదు: సెబీ


**న్యూఢిల్లీ(జనంసాక్షి):**స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదయ్యాక, తన సొంత ప్లాట్‌ఫామ్‌లో షేర్లు ట్రేడయ్యేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఎన్ఎస్ఈ నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదన రాలేదని సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. ప్రస్తుతం అలాంటి ట్రేడింగ్‌ను అనుమతించడం లేదని స్పష్టం చేశారు. యూపీఐ ఎండీఆర్ రుసుము పై బ్రోకర్లు, అసెట్ మెనేజ్ మెంట్ కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తుండటంపై ఆయన స్పందిస్తూ.. 'ఇందులో కొన్ని ముఖ్యమైన సమస్యలు ఉన్నాయని అనుకుంటున్నాను. అందువల్ల వీటిని తప్పకుండా పరిశీలించి, ఈ ఆందోళనలను ఎలా తగ్గించాలో యోచన చేస్తామ'ని తెలిపారు.

# పండుగ సీజన్‌లో టీవీఎస్ నుంచి 18 మోటార్‌సైకిళ్లు

దిల్లీ: పండుగ సీజన్ కోసం టీవీఎస్ మోటార్ కంపెనీ, తన ప్రీమియం శ్రేణిలో అపాచీ ఆర్‌టీఆర్ 160, అపాచీ ఆర్‌టీఆర్ 160 4వీ, అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ, ఆర్‌ఆర్ 310, రోనిన్ వంటి మోడళ్లతో పాటు మెరుగైన హంగులతో కూడిన 18 కొత్త మోటార్‌సైకిళ్లను గురువారం ఆవిష్కరించింది. ఈ సీజన్‌లో 18 కొత్త మోటార్‌సైకిళ్లను విడుదల చేయడం ఇదే తొలిసారని టీవీఎస్ మోటార్ కంపెనీ హెడ్ (ప్రీమియం బిజినెస్) విమల్ సంబ్లీ తెలిపారు. 150 సీసీ, అంతకంటే ఎక్కువ సీసీ ఉన్న ప్రీమియం మోటార్‌సైకిళ్ల అమ్మకాలు మొత్తం మోటార్‌సైకిల్ పరిశ్రమలో 27 శాతంగా ఉన్నట్లు పేర్కొన్నారు.పరిశ్రమ అమ్మకాల్లో 10% లోపే వృద్ధి: పండుగ సీజన్ గిరాకీపై జాగ్రత్తతో కూడిన ఆశావాదంతో ఉన్నామని సంబ్లీ పేర్కొన్నారు. గత ఏడాది



జీఎస్‌టీ రేటు తగ్గిస్తారనే అంచనాతో కొనుగోళ్లను వాయిదా వేసుకున్న వారు అధికమైనందునే, పండగ సీజన్‌లో అధిక విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు. ఫలితంగా భారీ అమ్మకాలు నమోదవ్వడంతో (హైబేస్ కారణంగా), ఈసారి పండుగ సీజన్‌లో ద్విచక్ర వాహన పరిశ్రమ ఏక అంకె వృద్ధిని నమోదు చేస్తుందన్నది తమ అంచనాగా వివరించారు. అధిక సామర్థ్యం కలిగిన వాహనాలపై యువత ఆసక్తి పెరుగుతున్నందున, ప్రీమియం మోటార్‌సైకిల్ విభాగంలో బలమైన గిరాకీ లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.




# టాటాసన్స్‌కు బూస్ట్..

### పరుగులు తీసిన గ్రూప్ కంపెనీల షేర్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ బోర్డు సమావేశంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. గురువారం ముంబయిలో మూడున్నర గంటల పాటు జరిగిన భేటీలో చంద్రశేఖరన్ (చంద్ర)ను మరో అయిదేళ్ల కాలానికి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగించాలని బోర్డు నిర్ణయించింది. టాటా సన్స్‌ను లిస్టింగ్ చేసే ప్రక్రియకూ బోర్డు ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయాలు 'చట్టవిరుద్ధమైనవి'గా నోయల్ టాటా ఛైర్మన్‌గా ఉన్న టాటా ట్రస్ట్స్ అభివర్ణించింది. తాజా పరిణామాల మధ్య టాటా గ్రూప్ కంపెనీల షేర్లు దూసుకెళ్లాయి. 'రెండోవిడత పదవీకాలం 2027 ఫిబ్రవరితో ముగిశాక, మరోవిడత కొనసాగరాదన్న నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలన్న బోర్డు విజ్ఞప్తిని 2026 సెప్టెంబరు 17న జరిగిన సమావేశంలో చంద్రశేఖరన్ అంగీకరించారు. దీంతో ఆయన్ని ప్రస్తుత పదవీకాలం ముగిశాక (2027 ఫిబ్రవరి), మరో అయిదేళ్ల కాలానికి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా పునర్నియమించడానికి మెజారిటీ సభ్యులు ఓటు వేశారు. టాటా సన్స్ లిస్టింగ్ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాలను పాటించడానికి ప్రాథమిక చర్యలు చేపట్టేందుకూ బోర్డు ఆమోదముద్ర వేసింది. ఈ విషయంలో ఆర్‌బీఐ, టాటా ట్రస్ట్స్, ఇతర వాటాదార్ల మార్గదర్శకాన్ని కోరతామ'ని టాటా సన్స్ వివరించింది. ఈ రెండు నిర్ణయాలకు కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఆమోదం లభించాలి. ఈ నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు టాటా ట్రస్ట్స్ ప్రకటించింది. చంద్రశేఖరన్‌ను మరో అయిదేళ్లకు ఛైర్మన్‌గా నియమిస్తూ చేసిన తీర్మానం 'చట్టవిరుద్ధమ'ని టాటా సన్స్ బోర్డు సమావేశంలోనే టాటా ట్రస్ట్స్ తరఫున పాల్గొన్న నోయల్ టాటా పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నుంచి లీగల్ ఓపీనియన్‌ను సైతం నోయల్ టాటా సమర్పించారని, దానిని బోర్డు పట్టించుకోలేదని టాటా ట్రస్ట్స్ వెల్లడించింది. టాటా సన్స్ ఛైర్మన్‌గా కొనసాగబోనని చంద్రశేఖరన్ ఆగస్టు 12న తెలుపగా.. దానికి అంగీకారం లభించి, వారసుడి ఎంపిక కమిటీ కూడా ఏర్పడిందని టాటా ట్రస్ట్స్ వివరించింది. ఇప్పుడు మళ్లీ చంద్రశేఖరన్ పునర్నియామకానికి ఓటింగ్ జరపడం చట్టవిరుద్ధమని



పేర్కొంది. ఈ పరిస్థితుల మధ్య జరిగిన ఓటింగ్‌పై ఏ వాటాదారు అయినా న్యాయపోరాటానికి వెళ్లడానికి వీలు కల్పించినట్లు అయ్యిందని నోయల్ హెచ్చరించారు. టాటా సన్స్ బోర్డులోని నలుగురు డైరెక్టర్లు, చంద్రరశేఖరన్ పునర్నియామకానికి అనుకూలంగా ఓటు వేయగా, నోయల్ ఒక్కరే వ్యతిరేకంగా వేశారు.


ఐపీఓ ముందు నాయకత్వ అనిశ్చితి ఉండరాదనే.. ఈ పరిణామాలకు, గత వారం ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం కేంద్ర బిందువుగా మారింది. టాటా సన్స్ తనకున్న బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ(ఎన్‌బీఎఫ్‌సీ) రిజిస్ట్రేషన్‌ను సరెండర్ చేయడానికి అభ్యర్థిస్తూ, చేసుకున్న దరఖాస్తును ఆర్‌బీఐ తిరస్కరించింది. ఫలితంగా లిస్టింగ్‌కు వెళ్లరాదన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. టాటా సన్స్‌ను లిస్టింగ్‌కు దూరంగా ఉంచేందుకు, ఏడాదికాలంగా చేస్తున్న ప్రయత్నాలు విఫలమైనట్లయింది. టాటాసన్స్‌ను స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయాల్సి ఉన్నందున, ఈ ప్రక్రియకు ముందు సంస్థ నాయకత్వం విషయంలో మదుపర్లకు అనిశ్చితి ఉండరాదని బోర్డు సభ్యులు అభిప్రాయపడి ఉండొచ్చని, అందుకే చంద్రకు పగ్గాలు అప్పజెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. 'గ్రూప్‌నకు ఆయన చేసిన సేవలను, టాటా గ్రూప్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, విస్తృత స్థాయిలో మదించిన తర్వాతే ఏకగ్రీవంగా ఎన్ఆర్‌సీ(నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీ) ఈ నిర్ణయం తీసుకుంద'ని టాటా సన్స్ తెలిపింది.

ఎందుకు లిస్టింగ్ రావాలంటే..
టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)గా 2022లోనే ఆర్‌బీఐ వర్గీకరించింది. ఈ గుర్తింపు వచ్చిన మూడేళ్లలోగా సదరు కంపెనీ లిస్టింగ్‌కు వెళ్లాలి. ఈ గడువూ 2025 సెప్టెంబరులోనే ముగిసింది. అయితే తమ ఎన్‌బీఎఫ్‌సీ రిజిస్ట్రేషన్‌ను సరెండర్ చేస్తామంటూ, టాటాసన్స్ పెట్టుకున్న దరఖాస్తు ఆర్‌బీఐ వద్ద పెండింగ్‌లో ఉండగా, ఇటీవలే తిరస్కరణ ఎదురైంది. లిస్టింగ్ నుంచి మినహాయింపు పొందడానికి తమకున్న రూ.21,000 కోట్ల రుణాన్ని తీర్చడానికీ టాటాసన్స్ సిద్ధపడింది. అయితే టాటాసన్స్‌లో వాటాలున్న షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ మాత్రం, లిస్టింగ్‌కు అత్యంత అనుకూలంగా ఉంది. సైరస్ మిస్త్రీని ఛైర్మన్ పదవి నుంచి టాటాసన్స్ బోర్డు వైదొలగించాక, తాత్కాలిక ఛైర్మన్‌గా రతన్ టాటా వ్యవహరించారు. ఆయన నుంచి 2017 ఫిబ్రవరిలో చంద్రశేఖరన్ పగ్గాలు చేపట్టారు. మళ్లీ 2022లో అయిదేళ్ల కాలానికి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. మూడో దఫా కూడా చంద్ర ఉండాలని 2025లోనే టాటా ట్రస్ట్స్ అంగీకరించింది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రూప్ సంస్థలైన ఎయిరిండియా, టాటా డిజిటల్ నష్టాలపై నోయల్ టాటా ఆందోళన వ్యక్తం చేయడంతో, ఈ ప్రతిపాదన ప్రతిష్టంభనకు గురైంది. టాటా సన్స్‌ను అన్‌లిస్టెడ్‌గా ఉంచాలన్న నోయల్ ప్రతిపాదనను చంద్ర తిరస్కరించారు. వీటన్నిటి మధ్య మూడో దఫా కొనసాగరాదని చంద్ర నిర్ణయించుకున్నారు. గురువారం బోర్డు విజ్ఞప్తితో తన మనసు మార్చుకున్నారు. టాటా సన్స్ లిస్టింగ్‌కు వస్తే భారత చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓగా నిలవగలదు. ఎందుకంటే కంపెనీ మొత్తం విలువ రూ.20 లక్షల కోట్లకు దరిదాపుల్లో (230 బి. డాలర్లు) ఉండొచ్చు. ఇందులో 1% వాటా విక్రయించినా రూ.15000-20,000 కోట్లు సమీకరించొచ్చు. తాజా పరిణామాల మధ్య టాటా గ్రూప్‌లోని నమోదిత కంపెనీల షేర్లు రాణించాయి. టాటా కెమికల్స్ 6.6%, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టీఎమ్‌పీవీ, టాటా స్టీల్, టాటా పవర్, టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్, ర్యాలీస్ ఇండియా, ట్రెంట్, టాటా ఎలక్సీ, ఓల్టాస్, టీసీఎస్ 0.21-5.47% మేర బీఎస్ఈలో లాభపడ్డాయి.

# ఏడాదికి ఒక్కసారి తీసుకునే హెచ్ఐవీ నిరోధక ఔషధం

### గిలియడ్‌తో డాక్టర్ రెడ్డీస్ ఒప్పందం

**దిల్లీ:** అంతర్జాతీయ బయోఫార్మా సంస్థ గిలియడ్ సైన్సెస్‌తో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. హెచ్ఐవీ నిరోధానికి ప్రీ-ఎక్స్‌ప్రోజర్ ప్రొఫిలాక్సిస్ రూపంలో ఏడాదికి ఒక్కసారి మాత్రమే తీసుకునే లెనాకాపావిర్ ఔషధానికి రాయల్టీ-రహిత, నాన్-ఎక్స్‌క్లూజివ్ స్వచ్ఛంద లైసెన్సింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు గురువారం డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. టెక్నాలజీ బదిలీ, తయారీ సన్నద్ధత, భవిష్యత్తు సరఫరా ప్రణాళికలు వేగవంతం చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం. భారత్‌తో పాటు హెచ్ఐవీ తీవ్రత ఎక్కువగా ఉన్న 120 అల్పాదాయ, దిగువ మధ్యతరగతి దేశాలకు ఈ ఔషదాన్ని అందించే వీలు కలుగుతుంది. హెచ్ఐవీ నిరోధం, చికిత్స కోసం ఏడాదికి రెండుసార్లు తీసుకునే లెనాకాపావిర్ తయారీకి సంబంధించి 2024 అక్టోబరులో గిలియడ్‌తో చేసుకున్న ఒప్పందానికి ఇది కొనసాగింపు. ఏడాదికి ఒక్కసారి ఇచ్చే ఈ ఫార్ములేషన్, ప్రస్తుతం గిలియడ్ నిర్వహిస్తున్న ఫేజ్3 'పర్పస్ 365' క్లినికల్ అధ్యయనం.. పరిశోధనా దశలో ఉంది. ఇంకా తుది సమీక్షలో ఉన్నందున, ఈ ఔషధానికి ఏ నియంత్రణ సంస్థ నుంచీ ఆమోదం లభించలేదు. ఏడాదికి రెండుసార్లు తీసుకునే లెనాకాపావిర్ ఫార్ములేషన్‌కు ఇప్పటికే అమెరికా ఎఫ్‌డీఏ, యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ ఆమోదం దక్కింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా హెచ్ఐవీ నివారణ మార్గదర్శకాల్లో దీన్ని సిఫారసు చేసింది. నియంత్రణ సంస్థల ఆమోదం లభిస్తే, ఏడాదికి ఒక్కసారి మాత్రమే తీసుకునే నూతన ఔషధం ఎంతోమందికి ఉపశమనం కలిగిస్తుందని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ (ఏపీఐ, సర్వీసెస్) దీపక్ సప్రా పేర్కొన్నారు.




# సెమీకాన్‌లోకి 1.14 లక్షల కోట్ల పెట్టుబడులు!


### లక్ష ఉద్యోగాలకు వీలు:కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్



**దిల్లీ:** దేశీయంగా చిప్‌సెట్ల డిజైనింగ్ నుంచి తయారీ వరకు (సెమికాన్ 2.0) కింద సుమారు 11-12 బిలియన్ డాలర్ల (రూ.1.05-1.14 లక్షల కోట్ల) పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోందని కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. సెమికాన్ ఇండియా 2026 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరికరాలు, మెటీరియల్స్, గ్యాసెస్, రసాయనాలు, అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్ (ఏటీఎంపీ) యూనిట్లు, సబ్‌స్ట్రేట్‌లు, వేఫర్లతో పాటు అనేక విభాగాల్లోకి పెట్టుబడులు వస్తాయని పేర్కొన్నారు. తమ బోర్డులు, వాటాదార్ల నుంచి ఆమోదాలు పొందాక, సంబంధిత కంపెనీలే పెట్టుబడి ప్రకటనలు చేస్తాయని మంత్రి చెప్పారు. ఇందువల్ల సెమీకండక్టర్ వ్యవస్థలో సుమారు లక్ష కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని, భవిష్యత్తులో వీటి సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చని తెలిపారు. కేంద్ర మంత్రి వర్గం జులైలో రూ.1,27,500 కోట్లతో సెమికాన్ 2.0కు ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమం చిప్ డిజైన్, యంత్రాలు, మెటీరియల్స్, సెమీకండక్టర్ ఫ్యాబ్స్, ఏటీఎంపీ/ఓఎస్‌ఏటీ పరిశోధన-అభివృద్ధి, ప్రతిభ అభివృద్ధి అనే 6 మూలస్తంభాలపై ఆధారపడి ఉంది. ఈ కార్యక్రమం కింద 12 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటిలో మూడు ఇప్పటికే వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించాయి. సెమికాన్ ఇండియా సదస్సులో ఐరోపా, జపాన్, సింగపూర్‌తో పాటు మన దేశంలోని సంస్థలతో టాటా ఎలక్ట్రానిక్స్ 16 ఒప్పందాలపై సంతకాలు చేయనుందని సీఈఓ రణధీర్ ఠాకూర్ తెలిపారు. ప్రభుత్వానికి తెలిపిన ప్రకారమే గుజరాత్‌లోని ధోలేరాలో ఉన్న కంపెనీ ఫ్యాబ్, అసోంలోని ప్యాకేజింగ్ సదుపాయంలో పనులు సరిగ్గా సాగుతున్నాయన్నారు. దేశంలో హరిత ఇంధన పర్యావరణ వ్యవస్థను వేగవంతం చేయడానికి, ప్రపంచ సరఫరా వ్యవస్థను ఏకీకృతం చేయడానికి పదేళ్లలో 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.47,500 కోట్ల) పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నట్లు సెమీకండక్టర్ పరికరాల తయారీ సంస్థ అప్లైడ్ మెటీరియల్స్ ప్రెసిడెంట్ ప్రభు రాజా వెల్లడించారు. వచ్చే ఏడాది తమ చిప్ అసెంబ్లింగ్, టెస్టింగ్ కేంద్రాన్ని భారీగా విస్తరించనున్నట్లు మైక్రాన్ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా పేర్కొన్నారు. వాహన తయారీదార్లు, సెమీకండక్టర్ సంస్థల కోసం కస్టమ్ సిస్టమ్-ఆన్-చిప్ (ఎస్ఓసీ) డిజైన్ సేవలను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ప్రారంభించింది. ఏజెంటిక్ ఏఐలో వృద్ధి, దేశీయంగా డిజైన్ నిపుణుల లభ్యత కారణంగా మన దేశం సెమీకండక్టర్ రంగంలో నాయకత్వం వహించడానికి కూడా సిద్ధమవుతోందని ఇంటెల్‌లో సెంట్రల్ ఇంజినీరింగ్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ శ్రీనివాసన్ అయ్యంగార్ వెల్లడించారు.

# కృత్రిమ మేధలో ఆందోళనకర ప్రవర్తన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
కృత్రిమ మేధ (ఏఐ) భద్రతపై ప్రపంచవ్యాప్తంగా చర్చ నడుస్తున్న తరుణంలో, తమ ఏఐ మోడళ్లలో ఆరు 'ఊహించని లేదా ఆందోళనకరమైన' ప్రవర్తనలను గుర్తించినట్లు ఓపెన్‌ఏఐ ప్రకటించింది. అనుమతి లేకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం, ఇతర మోడళ్లతో సమన్వయం చేసుకోవడం లేదా మానవ




పర్యవేక్షణ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించడం వంటి అంశాలను నిశితంగా పరిశీలించడానికి సరికొత్త ట్రాకింగ్ నియమావళిని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఇంకా మార్కెట్‌లోకి విడుదల చేయని ఒక అంతర్గత రీసెర్చ్ మోడల్, తనకు తాను విధించిన ప్రాథమిక పరిమితులను ఉల్లంఘించేలా తన సొంత నోట్స్‌లోనే 'జైల్ బ్రేక్' తరహా సూచనలను చొప్పించుకుంది. ఇతర చాట్‌బాట్‌లను బంధించే నియమ నిబంధనల నుంచి తాను విముక్తి పొందాలని తనకు తనే నిర్దేశించుకుంది. మరో సందర్భంలో ఒక ఏఐ ఏజెంట్ బ్రౌజర్ సైటేషన్ పొందడం కోసం వినియోగదారుడి అనుమతి తీసుకోకుండానే ఇంటర్నెట్‌లోకి ఫైళ్లను అప్‌లోడ్ చేసింది. ఇటువంటి ఆరు ఉదంతాలు గత కొద్ది నెలలుగా మోడళ్ల శిక్షణ, మూల్యాంకన దశల్లోనే గుర్తించినట్లు ఓపెన్‌ఏఐ స్పష్టం చేసింది.

# వచ్చే ఏడాది దేశీయ మార్కెట్‌లోకి తొలి డెంగీ వ్యాక్సిన్

హైదరాబాద్: డెంగీ నివారణకు ఉద్దేశించిన తొలి వ్యాక్సిన్ దేశీయ మార్కెట్‌లోకి త్వరలో అందుబాటులోకి రానుంది. జపాన్‌కు చెందిన వ్యాక్సిన్ తయారీ సంస్థ టకేడా, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ మధ్య ఈ మేరకు శుక్రవారం ఒప్పందం కుదిరింది. దీంతో మొట్టమొదటి డెంగీ వ్యాక్సిన్ 'క్యుడెంగా' 2027 తొలి అర్ధభాగంలో మార్కెట్‌లోకి రానుంది.ఈ ఒప్పందం ప్రకారం.. వ్యాక్సిన్ పంపిణీ, మార్కెటింగ్‌కు డాక్టర్ రెడ్డీస్ తన దేశవ్యాప్త పంపిణీ మౌలిక సదుపాయాలు, హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌ను వినియోగించనుంది. 'క్యుడెంగా'ను భారత్‌లో విడుదల చేసేందుకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఇప్పటికే అనుమతిచ్చింది. 4-60 ఏళ్ల వయసుగల వారు మూడు నెలల వ్యవధిలో 0.5 మి.లీ. చొప్పున రెండు మోతాదుల్లో ఈ టీకా వేసుకోవాల్సి ఉంటుంది. గతంలో డెంగీ సోకిందా లేదా అన్న దాంతో సంబంధం లేకుండా, ఎలాంటి ముందస్తు పరీక్షలు అవసరం లేకుండానే దీన్ని తీసుకోవచ్చు. నాలుగు రకాల డెంగీ వైరస్ వేరియంట్ల నుంచి రక్షణ కల్పించేలా క్యుడెంగా టీకాను రూపొందించారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
19 సెప్టెంబర్ 2026

# విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ప్రాధాన్యత: షబ్బీర్ అలీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18( జనం సాక్షి) :** విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించి వారి భవిష్యత్తును బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు నోట్‌బుక్స్, కాలేజ్ బ్యాగులు, స్పోర్ట్స్ షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన షబ్బీర్ అలీ కళాశాలలో విద్యాభ్యాసం, అందుతున్న సౌకర్యాలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 1,100 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన అభినందించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కళాశాలలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల అభివృద్ధిలో భాగంగా కొత్త తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని షబ్బీర్ అలీ తెలిపారు. కళాశాల నుంచి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పది రోజుల్లోగా సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు అందించే కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్, స్టడీ మెటీరియల్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ వంటి అవసరాలను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని షబ్బీర్ అలీ సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం, విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఐటీఐ కేంద్రాల అభివృద్ధి వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్లు, సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పూర్తి చేయకుంటే దీక్షకు పూనుకుంటా

- గుండ్లపల్లి - పొత్తూర్ రోడ్డు పై సర్కారుకు అల్టిమేటం
- అసెంబ్లీలో రోడ్ల దుస్థితిని ప్రస్తావించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** గన్నేరువరం మండలం గుండ్లపల్లి నుంచి పొత్తూర్ వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో మానకొండూర్ నియోజకవర్గంలోని రోడ్ల సమస్యలను ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ సమావేశాల్లో చాలా సార్లు రోడ్ల గురించి ప్రస్తావించ డం జరిగిందని, పంచాయతీరాజ్, రోడ్లు - భవనాల శాఖల పరిధిలో పలు రోడ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కాగితాలపై అనుమతులు మంజూరవుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణాలు పూర్తికాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడటంతోపాటు ప్రభుత్వ ప్రతిష్టకు కూడా కొంత ఇబ్బంది కలుగుతోందని ఆయన స్పష్టం చేశారు. గుండ్లపల్లి - పొత్తూర్ రోడ్డు నిర్మాణం విషయంలో కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని, గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని కవ్వంపల్లి తెలిపారు. సమస్యను పరిష్కరించి పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను కోరుతున్నప్పటికీ ఆయన సుముఖంగా లేరని సభ దృష్టికి తీసుకెళ్లారు. పాత బిల్లులను వెంటనే చెల్లించి గుండ్లపల్లి - పొత్తూర్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని ఇప్పటికే ఆ ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చానని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణం పూర్తికాకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టక తప్పదని ఆయన స్పష్టం చేశారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు.



# ప్రమాదవశాత్తు తుపాకి పేలి ఆర్ఐ మృతి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనం సాక్షి:** జిల్లా కేంద్రంలో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎన్ఎస్ఓ విధులు ముగించుకొని వచ్చిన రిజర్వ్ ఇన్స్పెక్టర్ హెచ్. సతీష్ ఉదయం సమయంలో ఆయుధం శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు మిస్ఫైర్ కావడం వల్లన ఆయన మరణించినట్లు కమిషనర్ ఆఫ్ పోలీస్ పోతరాజు సాయి చైతన్య తెలిపారు. ఇట్టి సంఘటన స్థలాన్ని హుటా హుటిన పర్యవేక్షించారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు.

# వ్యాను ఢీ కొట్టి గాంధీ విగ్రహం ధ్వంసం



**ముస్తాబాద్ సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో గురువారం వ్యాన్ గాంధీ విగ్రహాన్ని ఢీ కొట్టింది. వ్యాన్ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో 70 ఏళ్ల క్రితం నిర్మించిన గాంధీ విగ్రహం ధ్వంసం అయింది దీంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు అనేక సంవత్సరాలుగా కొండాపూర్ మధ్యలో ఉన్న గాంధీ విగ్రహాన్ని అజాగ్రత్తగా వాహనం నడిపి ధ్వంసం చేయడం సరైనది కాదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు సమాచారం అందుకున్న సిరిసిల్ల రూరల్ సిఐ నాగేశ్వరరావు ఎస్సై జ్యోతి కొండాపూర్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని విచారించారు గాంధీ విగ్రహం కొత్తది ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హామీ ఇచ్చారు దీంతో గ్రామస్తులు శాంతించారు.

# 2 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరు వ్యక్తుల అరెస్టు

**నాగ్‌పూర్ నుంచి తెచ్చినట్లు వెల్లడి.. టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసుల సంయుక్త ఆపరేషన్**
**మాదకద్రవ్యాలపై నిఘా కొనసాగింపు**



**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** కరీంనగర్‌లో టౌన్ 3 పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సుమారు 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ వి.సతీష్ పర్యవేక్షణలో హౌసింగ్ బోర్డు కాలనీలోని వరాహస్వామి ఆలయం సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న సయ్యద్ ముబీన్ (34), మహమ్మద్ యూనస్ (29)లను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద గంజాయితో పాటు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నాగ్‌పూర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి కరీంనగర్‌కు తీసుకువచ్చినట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. తమ వినియోగంతో పాటు పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసు సిబ్బందిని కమిషనర్ అభినందించారు. నగరంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# లక్ష్యంతో ముందుకు సాగాలి

- డ్రగ్స్‌కు దూరంగా.. చదువు, క్రీడలపై దృష్టి
- విద్యార్థులకు గోల్ కార్డులు, క్రీడా సామగ్రి పంపిణీ

**కేశవపట్నం, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** విద్యార్థులు చిన్ననాటి నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో దానిని సాధించేందుకు కృషి చేయాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచించారు. శంకరపట్నం మండలం మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన చిన్ననాటి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్న సీపీ.. లక్ష్యంతోపాటు దాని వెనుక ఉన్న ఉద్దేశం కూడా ముఖ్యమన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుతోపాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలని చెప్పారు. విద్యార్థుల లక్ష్యాలను తెలుసుకుని గోల్ కార్డులు, ఫొటో ఫ్రేమ్‌లు అందజేశారు.
మెట్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను సీపీ ప్రారంభించారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఇవి కీలకంగా పనిచేస్తాయని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులకు హెల్మెట్లు, విద్యార్థులకు వాలీబాల్, క్యారమ్ తదితర క్రీడా సామగ్రిని పంపిణీ చేసి, పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. అనంతరం కేశవపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాలను పరిశీలించి విద్యుత్, అగ్నిమాపక భద్రతా నిబంధనలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా విద్యుత్ తీగలు, నీటి వనరులు, ట్రాఫిక్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, ఎస్సై శేఖర్, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ నాటికి పనులు పూర్తి కావాల్సిందే!

- గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కావొద్దు
- ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమిష్టిగా ఏర్పాట్లు చేయండి
- గోదావరి పుష్కరాలు-2027" కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 18, (జనంసాక్షి) :** కుంభమేళా తరహాలోనే రాబోయే గోదావరి పుష్కరాలను నిర్వహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని, అందుకు అనుగుణంగా వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమిష్టిగా ముందుకెళ్లాలని అధికారులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన "గోదావరి పుష్కరాలు - 2027" కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా... గోదావరి పుష్కరాల సన్నద్ధత, ప్రముఖ దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు, ఘాట్ల నిర్మాణం, రవాణా, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్ల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... పుష్కర ఏర్పాట్లలో సమన్వయ లోపం తలెత్తకుండా జిల్లాలవారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చేపట్టాల్సిన అదనపు ఏర్పాట్లపై ఘాట్ల వారీగా ప్రత్యేకంగా కలెక్టర్లతో క్షేత్రస్థాయి అధ్యయనం చేయించామన్నారు. పుష్కరాలు మొదలయ్యే నాటికి పూర్తయ్యే అవకాశమున్న పనులకే తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. చివరి వరకూ వేచి చూడకుండా గ్రౌండ్ రియాల్టీకి అనుగుణంగా ప్రతి పనికి ఒక నిర్దేశిత గడువును విధించుకోవాలని ఆదేశించారు. ఆయా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఇంటిగ్రేటెడ్ డ్యాష్‌బోర్డ్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. ఇంజినీర్ల కొరత తలెత్తకుండా ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలన్నారు. పుష్కరాల సమయంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని చెప్పారు. భద్రాచలం వద్ద ఎస్‌టీపీ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ఎన్ని నిధులనైనా కేటాయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, పుష్కర ఏర్పాట్లు, పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని తేల్చి చెప్పారు.

# కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుంది

## మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్

**మంథని, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యదర్శిగా ఆరెల్లి కిరణ్‌గౌడ్, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ చైర్మన్‌గా వంగల తిరుమలేష్, శ్రీ గౌతమేశ్వర ఆలయ చైర్మన్‌గా గుండ రాజు నియమితులైన సందర్భంగా మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆరెల్లి కిరణ్‌గౌడ్ మంథని నియోజకవర్గం, మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరేలా చూడాలని సూచించారు. ఆలయ చైర్మన్లు వంగల తిరుమలేష్, గుండ రాజులు రానున్న పుష్కరాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆలయాల్లో పండుగల సమయంలో భక్తుల రద్దీ దృష్ట్యా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జీవో నెంబర్ 97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది నిరసన

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంలో గల శ్రీ రాజరాజేశ్వర పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 97 రద్దు చేయాలని ఇటీవల కాలంలో వేములవాడ ఆర్డిఓ, తాసిల్దార్‌కు వినతి పత్రాలు కూడా అందజేశామన్నారు.భోజన విరామ సమయంలో జీవో నెంబర్ 97 రద్దు చేయాలని కళాశాల గేటు ముందు నిరసన ప్రదర్శన తెలిపామన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 97 రద్దు చేయకపోతే జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు,సిబ్బంది పాల్గొనట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

# కళ్యాణి గార్డెన్స్ వద్ద మహిళ మృతదేహం గుర్తింపు

**కరీంనగర్, క్రైమ్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** బొమ్మకల్ గ్రామంలోని కళ్యాణి గార్డెన్స్ సమీపంలో ఈ నెల 17న కాలిపోయిన స్థితిలో లభించిన గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు కవిత (47)గా గుర్తించారు. పత్రికలు, టీవీ ఛానళ్లలో వచ్చిన వార్తలు, ఫొటోలను చూసిన ఆమె తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. దేవాదాయ శాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న కవిత మంకమ్మతోటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీసీ కెమెరాల పరిశీలనలో ఈ నెల 17న మధ్యాహ్నం 12.30 గంటలకు కవిత తల్లి ఇంటికి వచ్చి సుమారు పది నిమిషాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం బ్యాగ్‌తో కళ్యాణి గార్డెన్స్ వైపు వెళ్లిన దృశ్యాలు నమోదయ్యాయి. కవిత గతంలో మానసిక ఆరోగ్య సమస్యలకు చికిత్స పొందినట్లు, ఆత్మహత్యాయత్నాలకు పాల్పడిన సందర్భాలు ఉన్నట్లు వారు పోలీసులకు వివరించారు. ప్రస్తుత ఘటనలోనూ ఆమెకు తానే నిప్పంటించుకుని ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసినప్పటికీ.. ఈ విషయం దర్యాప్తులో తేలాల్సి ఉంది.
మృతిపై తమకు ఎవరిపైనా అనుమానం లేదని కవిత తండ్రి శ్రీరాముల రాంచంద్రం, కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పోలీసులు సీసీ కెమెరా దృశ్యాలు, పోస్టుమార్టం నివేదికతోపాటు ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

*ప్రభుత్వ కొలువు చేస్తూనే.. అదే ప్రభుత్వ శాఖలో కాంట్రాక్టులా? ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు.. మరోవైపు విద్యుత్ పనుల అగ్రిమెంట్లు! ఒకే కుటుంబం పేర్లతో లైసెన్సులు, వందలాది అగ్రిమెంట్ల వ్యవహారం ఇప్పుడు మిర్యాలగూడ విద్యుత్ శాఖలో తీవ్ర ప్రశ్నలను రేకెత్తిస్తోంది. ఉద్యోగ వివరాలు వెల్లడించకుండా లైసెన్స్ కొనసాగించారా? నిబంధనలకు విరుద్ధంగా పనులు ఎలా దక్కాయి? ఈ వ్యవహారం వెనుక అధికారుల పాత్ర ఎంత? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. రికార్డులు, అగ్రిమెంట్లు, బిల్లులు, ఫైల్ నోటింగులను సమగ్రంగా పరిశీలిస్తేనే ఆరోపణల్లో వాస్తవమెంతో తేలనుంది.*

# ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ.. కంట్రాక్టులు చేస్తూ




## ఒకే కుటుంబానికి రెండు లైసెన్సులు..200కు పైగా కాంట్రాక్టులు

## ఉద్యోగ వివరాలు దాచిపెట్టి టెండర్లు

- ఆ అధికారి హస్తంతోనే ఈ పనులు..!?
- మిర్యాలగూడ విద్యుత్ శాఖలో కలకలం
- రికార్డుల ఆధారంగా సమగ్ర విచారణకు డిమాండ్

### ఎస్ఈ చేయాల్సిన పనులు డీఈ స్థాయిలోనే?

అగ్రిమెంట్ల ప్రక్రియలో అధికారిక స్థాయి నిబంధనలు పాటించలేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఎస్ఈ స్థాయిలో చేయాల్సిన అగ్రిమెంట్లను కూడా డీఈ స్థాయిలోనే నిర్వహించారని, అగ్రిమెంట్ మొత్తాన్ని తగ్గించి, బిల్లులు మాత్రం పూర్తి మొత్తానికి చేసినట్లు ఫిర్యాదుదారులు ఆరోపించారు. ఈ ఆరోపణలు నిజమా? కాదా? అన్నది సంబంధిత అగ్రిమెంట్లు, వర్క్ ఆర్డర్లు, బిల్లులు, ఎస్ఏపీ వివరాలు, ఫైల్ నోటింగ్స్ పరిశీలిస్తే స్పష్టమవుతుందని పేర్కొన్నారు.

### భర్త పేరుతో మరో లైసెన్స్.. ఆరు నెలల్లోనే 200కుపైగా..

ఇదే వ్యవహారంలో ఎ. నాగు పేరుతో 2025 డిసెంబర్‌లో లాస్య ఎలక్ట్రికల్ అండ్ సివిల్ వర్క్స్ పేరుతో మరో లైసెన్స్ తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ లైసెన్స్‌కు వెండర్ నంబర్ 316659 ఉన్నట్లు తెలిపారు. అత్యంత కీలకమైన ఆరోపణ ఏమిటంటే.. లైసెన్స్ పొందిన కొద్ది కాలంలోనే 200కు పైగా అగ్రిమెంట్లు పొందినట్లు రికార్డులు ఉన్నాయని ఫిర్యాదుదారులు చెబుతున్నారు. వీటిలో యూఎస్ఎల్ సీ పనులకు సంబంధించిన అగ్రిమెంట్లు కూడా ఉన్నాయని ఆరోపించారు. కొత్త ఏడీఈ బాధ్యతలు చేపట్టి నెల రోజులు మాత్రమే అయిన సమయంలో ఆయనకు సమాచారం లేకుండానే డీఈ స్థాయిలో కొన్ని అగ్రిమెంట్లు నేరుగా ఇచ్చినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.

**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** ప్రభుత్వ ఉద్యోగం ఒకవైపు.. విద్యుత్ కాంట్రాక్టు పనులు మరోవైపు! ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న విషయాన్ని సంబంధిత శాఖకు వెల్లడించకుండా ఎలక్ట్రికల్ లైసెన్స్ కొనసాగిస్తూ, అదే లైసెన్స్‌పై టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో టెండర్లు, అగ్రిమెంట్లు పొందిన వ్యవహారం మిర్యాలగూడ విద్యుత్ శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారానికి సంబంధించిన లైసెన్స్, వెండర్ నంబర్లు, అగ్రిమెంట్లు, ఎస్ఏపీ వివరాలు తదితర ఆధారాలు ఉన్నాయని పేర్కొంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.
ఫిర్యాదు వివరాల ప్రకారం.. లాస్య ఎలక్ట్రికల్ అండ్ సివిల్ వర్క్స్ ప్రొప్రైటర్ ఎ. అనుజ, వెండర్ నంబర్ 314902, 28-02-2025న జెన్ కో-వైటీపీఎస్, వీర్లపాలెం, దామరచర్ల మండలంలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరినట్లు పేర్కొన్నారు. అయితే టీజీఎస్పీడీసీఎల్ లో ఉన్న ఎలక్ట్రికల్ లైసెన్స్‌ను రద్దు చేయకుండా కొనసాగించడంతో పాటు, ఇటీవల దానిని ఎ-1 క్లాస్ లైసెన్స్‌గా రెన్యువల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**రూ.20 లక్షల యూఎస్ఎల్ సీ పనులకు అగ్రిమెంట్లు**

ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న సమయంలోనే అనుజ పేరుతో ఉన్న వెండర్ నంబర్ ద్వారా యూఎస్ఎల్ సీ టెండర్ ప్రక్రియలో పాల్గొని రూ.20 లక్షల విలువైన పనులకు అగ్రిమెంట్లు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మిర్యాలగూడ రూరల్ సబ్ డివిజన్‌లో ఎస్ఏపీ నెం.550012320 కింద రూ.10 లక్షలు, మిర్యాలగూడ టౌన్ సబ్ డివిజన్‌లో ఎస్ఏపీ నెం.550012319 కింద మరో రూ.10 లక్షల పనులకు అగ్రిమెంట్లు జరిగినట్లు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగి అనే విషయాన్ని టెండర్ దరఖాస్తు/షెడ్యూల్ లో వెల్లడించకుండా అగ్రిమెంట్లు పొందినట్లు ఆరోపిస్తూ, సంబంధిత రికార్డులను పరిశీలిస్తే పూర్తివాస్తవాలు బయటపడతాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

**మరో వెండర్‌పైనా ఆరోపణలు**

ఇండియన్ ఎలక్ట్రికల్స్, ఇంజినీరింగ్ వర్క్స్ ప్రొప్రైటర్ సైదాచారి, తన అక్క కుమార్తె జ్యోత్స్న మిర్యాలగూడ సబ్ డివిజన్‌లో ఏడీఈగా పనిచేస్తున్న విషయాన్ని వెల్లడించకుండా యూఎస్ఎల్ సీ పనులకు అగ్రిమెంట్లు పొందినట్లు కూడా ఫిర్యాదులో ఆరోపించారు. ఈ సంస్థ వెండర్ నంబర్ 311805గా పేర్కొన్నారు.

### "ఆధారాలు బయటపెట్టి విచారణకు సవాల్

లైసెన్స్ వివరాలు, వెండర్ నంబర్లు, ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించిన వివరాలు, ఎస్ఏపీ నంబర్లు, అగ్రిమెంట్లు, పనుల విలువలు వంటి అంశాలపై ఆధారాలు ఉన్నాయని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. దీంతో ఈ వ్యవహారం సాధారణ ఫిర్యాదుగా కాకుండా రికార్డుల ఆధారంగా తేల్చాల్సిన తీవ్రమైన ఆరోపణల వ్యవహారంగా మారింది. లైసెన్సులు జారీ చేసిన విధానం నుంచి టెండర్లలో పాల్గొనడం, అగ్రిమెంట్లు పొందడం, పనులు నిర్వహించడం, బిల్లుల చెల్లింపుల వరకు పూర్తిస్థాయిలో ఆడిట్ తరహాలో విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రైవేట్ కాంట్రాక్టు పనులు చేపట్టడంపై నిబంధనలు ఏమిటి? సంబంధిత లైసెన్సులు ఎలా కొనసాగాయి? అగ్రిమెంట్లు ఏ నిబంధనల ప్రకారం ఇచ్చారు? 200కు పైగా అగ్రిమెంట్ల వెనుక ప్రక్రియ ఏమిటి? అనే ప్రశ్నలకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల విచారణలో సమాధానం రావాల్సి ఉంది. వారికే అగ్రిమెంట్లు చేయడానికి స్థానిక మిర్యాలగూడ డీఈ హస్తం ఉందని ఆరోపణలు పెద్దఎత్తున వెలువడుతున్నాయి.

# మరొక ఆడబిడ్డకు ఇలా జరగకూడదనే..

- సెల్ఫీ వీడియో విడుదల చేసి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు సంతోష్
- పోలీసుల కస్టడీలో నిందితుడు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** నిజామాబాద్ నగరంలోని రాజా రాజేంద్ర సినిమా టాకీస్ వద్ద నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే ఈ ఘోరం జరిగిపోయింది. కంటికి రెప్పపాటు కాలంలో, కేవలం 8 సెకన్ల స్వల్ప వ్యవధిలోనే ఏకంగా 9 సార్లు కత్తితో విచక్షణారహితంగా పొడిచి హరిబాబును అత్యంత కిరాతకంగా హతమార్చాడు. సంతోష్ కొబ్బరి బొండాలు కట్ చేసే పదునైన కత్తితో ఈ దాడికి పాల్పడగా, ఘటన అనంతరం నిందితుడు కారెక్కి క్షణాల వ్యవధిలో అక్కడి నుంచి పరారయ్యాడు. నేరుగా తన సొంతూరైన కోరుట్లకు పరుగు తీసిన నిందితుడు, అక్కడ స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తానే స్వయంగా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. నిజామాబాద్ నగరంలో హరిబాబును అంతమొందించి వస్తున్నానని అతను స్టేషన్‌లో తెలపడంతో ఒక్కసారిగా అప్రమత్తమైన స్థానిక పోలీసులు వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నగరంలోని రెండో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం నిందితుడిని ప్రత్యేకంగా నిజామాబాద్‌కు తరలించి విచారణను వేగవంతం చేశారు. ఈ దారుణ ఘటనకు ముందు నిందితుడు సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన ఒక సెల్ఫీ వీడియో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తన చెల్లికి జరిగిన దుస్థితి మరో ఆడబిడ్డకు జరగకూడదనే తాను ఈ అఘాయిత్యానికి ఒడిగట్టానని అన్నాడు. అసలు చట్టం మరియు పోలీసులే తమకు న్యాయం చేస్తారని ఎంతగానో ఎదురు చూశామని, కానీ చివరికి ఎలాంటి న్యాయం జరగకపోవడంతోనే తాను ఈ తీవ్ర నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆ వీడియోలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఇది ముందే పథకం పన్ని చేసిన హత్య కాదని, తన కుటుంబాన్ని మోసం చేసిన తీరును తట్టుకోలేక ఈ చర్యకు పాల్పడ్డానని, పౌర సమాజం తన ఆవేశాన్ని అర్థం చేసుకుని తన చర్యను ఆమోదించాలని ఆయన కోరడం గమనార్హం. ఈ హత్య ఘటనపై నిజామాబాదు నగరంలోని రెండవ టౌన్ పోలీస్‌లు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

# కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన.. అభివృద్ధి పనులకు వేగం

- గునుకులపల్లి రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే
- ఉల్లంపల్లిలో ఆయిల్‌పామ్ నర్సరీ స్థలం, ఎక్లాస్పూర్‌లో ఎస్సారెస్పీ భూముల పరిశీలన



**చిగురుమామిడి/సైదాపూర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం పలు అభివృద్ధి, రెవెన్యూ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిగురుమామిడి మండల కేంద్రం నుంచి లంబాడి పల్లి మీదుగా గునుకులపల్లి వరకు నిర్మించనున్న 7.5 కిలోమీటర్ల ఇంటర్మీడియట్ రహదారి మార్గాన్ని కరీంనగర్ ఆర్డీవో షర్మిలతో కలిసి పరిశీలించారు. 6.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి హ్యామ్ పథకం కింద నిధులు మంజూరై టెండర్ దశలో ఉన్నాయని, మిగిలిన కిలోమీటర్‌కు త్వరితగతిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రహదారి పూర్తయితే ఇందుర్తి, ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లి గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రయాణ సమయం, దూరం తగ్గుతుందని తెలిపారు.
అనంతరం ఉల్లంపల్లిలో కొనసాగుతున్న భూముల రీసర్వేను పరిశీలించిన కలెక్టర్.. రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో హద్దులను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. రెండు బృందాలతో ఇప్పటివరకు 605 ఎకరాల రీసర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఓదెల మల్లన్న గుట్ట వద్ద ఆయిల్‌పామ్ నర్సరీ కోసం ప్రతిపాదించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి, నిబంధనల మేరకు ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. సైదాపూర్ మండలం ఎక్లాస్పూర్‌లో ఎస్సారెస్పీకి చెందిన నాలుగు సర్వే నంబర్ల పరిధిలోని సుమారు 24 ఎకరాల భూమిని పరిశీలించి, దాని ప్రస్తుత వినియోగం, సర్వే నంబర్లు, విస్తీర్ణం, రెవెన్యూ రికార్డుల వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు కనకయ్య, శ్రీనివాస్ గౌడ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా రైతులకు ఆయిల్‌పామ్‌తో ఆర్థిక భరోసా

- ఒంటరి మహిళా రైతులకు ప్రత్యేక ఆర్థిక సహాయం
- సెప్టెంబరు 30లోగా డిజిటల్ పంటల సర్వే పూర్తి
- డెంగ్యూ, మలేరియా నియంత్రణకు ముందస్తు చర్యలు
- గర్భిణులు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన



**పెద్దపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లాలో వ్యవసాయం, విద్య, వైద్యం, పోషణ రంగాల్లో కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఒంటరి మహిళా రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు హార్టికల్చర్ శాఖ అందించే రాయితీకి అదనంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి ఐదు ఎకరాల భూమి కలిగిన ఆర్థికంగా వెనుకబడిన ఒంటరి మహిళా రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ఆయిల్‌పామ్ తోటల్లో తొలి నాలుగేళ్లు అంతర పంటల ద్వారా ఆదాయం పొందడంతో పాటు నాలుగో సంవత్సరం నుంచి ఎకరానికి ఏటా సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు.
జిల్లాలో డిజిటల్ పంటల సర్వేను సెప్టెంబరు 30లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతు సాగు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సర్వే పూర్తికాకపోవడం వల్ల సన్నరకం ధాన్యం సాగు చేసే ఏ రైతూ బోనస్ కోల్పోకుండా చూడాలని సూచించారు. ఏఈఓలు, వ్యవసాయ అధికారులు రైతులతో సమన్వయంతో పనిచేసి సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.
కాలానుగుణ వ్యాధుల నియంత్రణపై నిర్వహించిన సమీక్షలో డెంగ్యూ, మలేరియా నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడంతోపాటు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, పరీక్షా కిట్లు అందుబాటులో ఉంచాలని, ప్రసవాల సంఖ్య పెంచేందుకు గర్భిణులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. టీబీ, హెచ్ఐవీ, అధిక రక్తపోటు, మధుమేహం నియంత్రణ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు.
కమాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. అల్పాహారం, పాలు, రాగిజావ నాణ్యతపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పోషణ మాసం-2026లో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, సమతుల్య ఆహారంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సెప్టెంబరు 9 నుంచి అక్టోబరు 8 వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

### తరగతి గదిలో క్షుద్రపూజల ప్రస్తావనా..

# ఒక మత గ్రంథ బోధనా..?

- ఉపాధ్యాయుడి తీరుపై విద్యార్థుల ఆరోపణలు
- విద్యార్థులను తిట్టి, కొట్టారని ఫిర్యాదు
- పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు
- ప్రధానోపాధ్యాయురాలి ఫిర్యాదుతో పోలీసుల విచారణ



**వికారాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం పులుమామిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు సుధాకర్ తీరుపై విద్యార్థులు చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఉపాధ్యాయుడు తమను తిట్టడంతోపాటు కొట్టారని, తరగతి గదిలో చదువుకు సంబంధం లేని క్షుద్రపూజలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారని, కొన్ని బైబిల్ పుస్తకాలను చూపించారని విద్యార్థులు ఆరోపించినట్లు సమాచారం. దీంతో తమకు భయాందోళనలు కలిగాయని వారు చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు.
విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు పాఠశాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయురాలు శిరీష, విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమాచారం అందుకున్న నవాబ్‌పేట్ ఎస్సై గిరి పాఠశాలకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఉపాధ్యాయుడి బోధనా విధానం, విద్యార్థుల పట్ల వ్యవహరించిన తీరు, తరగతి గదిలో ప్రస్తావించిన అంశాలపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ నాయకులు కోరారు. ఆరోపణలు వాస్తవమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆరోపణల నేపథ్యంలో సుధాకర్ ప్రస్తుతం పాఠశాలకు హాజరు కావడం లేదని సమాచారం. ఆయన సెలవులో ఉన్నట్లు తెలుస్తున్నప్పటికీ కారణాలు తెలియరాలేదు. ఇదిలా ఉండగా విద్యార్థులు చేసిన ఆరోపణలను ప్రధానోపాధ్యాయురాలు పోలీసుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గిరి తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలు నిర్ధారణ అయిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# చేవెళ్లలో రూ.52 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

*అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య*



**చేవెళ్ల, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో రూ.52 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య శుక్రవారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రత్యేక చొరవతో నగర అభివృద్ధి నిధుల నుంచి రూ.52 లక్షలు మంజూరు కాగా, ఈ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు వార్డుల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, ధావల్గారి గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్ళపల్లి నర్సింహులు, అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, బల్వంత్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రవీందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎర్ర మల్లేష్, మాజీ సర్పంచ్ ఉపసర్పంచులు పడాల ప్రభాకర్, గంగి యాదయ్య, టేకులపల్లి శ్రీనివాస్, నడిమొల్ల శంకర్, మద్దెల చింటు, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# పత్తిలో అంతర పంటగా గంజాయి సాగు

*400 మొక్కలు స్వాధీనం.. విలువ రూ.12 లక్షలు*


- ముగ్గురు నిందితుల అరెస్టు.. తుమ్మల శివారులో పోలీసుల తనిఖీలు
- నిందితులకు రిమాండ్.. మొబైల్ ఫోన్లు స్వాధీనం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** గాంధారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్మల గ్రామ శివారులో పత్తి పంటలో అంతర పంటగా సాగు చేస్తున్న గంజాయిని పోలీసులు గుర్తించి ధ్వంసం చేశారు. విశ్వసనీయ సమాచారంతో గురువారం నిర్వహించిన తనిఖీల్లో వ్యవసాయశాఖ విస్తరణ అధికారి సమక్షంలో గంజాయి సాగును గుర్తించారు. సుమారు 400 పచ్చి గంజాయి మొక్కలను వేర్లతో సహా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో మంజ సోనుసింగ్, మంజ మద్దిబాయి, బస్సి జోద్రాజ్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మొదటి ఇద్దరు నిందితులు 3 ఎకరాల 26 గుంటల భూమిని, మరో నిందితుడు 1 ఎకరం 20 గుంటల భూమిని కౌలుకు తీసుకుని పత్తిలో కలిపి గంజాయి సాగు చేసినట్లు విచారణలో వెల్లడైంది. అధికంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సాగు చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సాగుకు ఉపయోగించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసు వివరాలను ఎల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాస్‌రావు వెల్లడించారు. నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ సాగు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బాల్యవివాహం.. ఏడాది తర్వాత మ్యారేజ్ సర్టిఫికెట్?!

### పెళ్లికి ముందే శిశువు జననం..

- అధికారిక రికార్డులతో కొత్త ప్రశ్నలు
- వివాహ తేదీపై సర్టిఫికెట్‌లోని తేదీకి రికార్డుల్లో తేడాలు
- పంచాయతీ కార్యదర్శి జారీ చేసిన సర్టిఫికెట్‌పై వివాదం
- కళ్యాణలక్ష్మి దరఖాస్తుపై అధికారుల ధ్రువీకరణతో మరింత చర్చ



పెద్దేముల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):
పెద్దేముల్ మండల పరిధిలో ఓ వివాహానికి సంబంధించిన తేదీల్లో వ్యత్యాసం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బషీరాబాద్ మండలం మైల్వార్‌కు చెందిన నందిని, పెద్దేముల్ మండలం గొట్లపల్లికి చెందిన అనిల్‌కు 02-03-2025న వివాహం జరిగినట్లు కుటుంబ వివరాల్లో పేర్కొనగా.. కళ్యాణలక్ష్మి దరఖాస్తు కోసం పంచాయతీ కార్యదర్శి జారీ చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్‌లో వివాహ తేదీ 02-03-2026గా నమోదైనట్లు సమాచారం. సీరియల్ నంబర్ 35తో జారీ అయినట్లు తెలుస్తోంది. తేదీ నమోదులో పొరపాటా? లేక మార్పు జరిగిందా? అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.
ఇదే సమయంలో సంబంధిత దంపతులకు 30-01-2026న తాండూరు ప్రభుత్వ ఎంసీహెచ్ ఆసుపత్రిలో శిశువు జన్మించినట్లు రికార్డులు ఉన్నట్లు సమాచారం. సర్టిఫికెట్‌లోని వివాహ తేదీ 02-03-2026ను పరిగణనలోకి తీసుకుంటే శిశువు వివాహానికి ముందే జన్మించినట్లు కనిపిస్తోంది. అయితే అసలు వివాహ తేదీ, వివాహ రిజిస్ట్రేషన్, ఆసుపత్రి జనన రికార్డులను అధికారులు పరిశీలిస్తేనే వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.
మ్యారేజ్ సర్టిఫికెట్ ఆధారంగా కళ్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం జీపీఓ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పంచనామా నిర్వహించి, తహసీల్దార్ స్థాయిలోనూ ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం దరఖాస్తు బ్యాచ్ ఫ్రీజింగ్ దశలో ఉన్నట్లు తెలుస్తుండటంతో వివాహ తేదీ, వధువు వయస్సు, జనన రికార్డులు, మ్యారేజ్ సర్టిఫికెట్ వివరాలను మరోసారి పరిశీలించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా వివాహం జరిగిన సమయానికి వధువు చట్టబద్ధమైన వివాహ వయస్సు పూర్తిచేసిందా? సర్టిఫికెట్‌లో తేదీ ఎలా నమోదైంది? ధ్రువీకరణ సమయంలో సంబంధిత అధికారులు ఏ ఆధారాలను పరిశీలించారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. పంచాయతీ, రెవెన్యూ, ఆసుపత్రి రికార్డులను సమగ్రంగా పరిశీలించి ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# జిల్లా ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించేంతవరకు పోరాడుతాం

- బ్లడ్ బ్యాంకు ఎక్కడుందని అడిగితే అక్రమ కేసులు పెడతారా?
- రోజులు గడుస్తున్నా.. వికారాబాద్‌లో సమస్యలు ఎక్కడికక్కడే
- బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి



**వికారాబాద్ సెప్టెంబర్ 18,(జనంసాక్షి):**
వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో ప్రజలకు అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు సదానంద్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. 2012లో వికారాబాద్ ఏరియా ఆసుపత్రిలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన సమయంలో ప్రత్యేక గదులు ఏర్పాటు చేసి బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే ప్రస్తుతం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో బ్లడ్ బ్యాంకు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లా ఆసుపత్రిని, ఏరియా ఆసుపత్రిని సందర్శించి అక్కడ బ్లడ్ బ్యాంకు నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన సమయంలో తనను, బీజేపీ నాయకులను పోలీసుల ద్వారా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఆరోపించారు. అంతేకాకుండా మీడియా ప్రతినిధుల లోగోలు, సెల్‌ఫోన్లు తీసుకుని, వారి ఫోన్లలో చిత్రీకరించిన దృశ్యాలను డిలీట్ చేయించారని ఆరోపించారు. "వీడియో ఫుటేజ్ విడుదల చేయండి... నిజానిజాలు ప్రజలే తెలుసుకుంటారన్నారు, తమపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జిల్లా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకుతో పాటు అవసరమైన అన్ని వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేసి, జిల్లా ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సౌకర్యాలు కల్పించే వరకు రాష్ట్ర మెడికల్ సెల్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై కార్యక్రమాలు కొనసాగిస్తామని డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు సదానంద్ రెడ్డి, ధార్మిక సెల్ ప్రవీణ్ రెడ్డి, ఎర్రోళ్ల లక్ష్మయ్య, సుధాకర్ ఆచారి, మోహన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, శ్రీకాంత్, స్రవంతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల మెట్లపై నుండి పడి విద్యార్థి మృతి

### పాఠశాల యాజమాన్యం తీరుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ శివారులోని ఇండియన్ హెడ్స్ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న వర్షిక (9) పాఠశాలలోని మెట్లపై నుండి కిందికి దిగుతూ కింద పడడంతో తలకు బలమైన గాయం కావడంతో షాద్ నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు దీంతో కుటుంబ సభ్యులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు ప్రైవేటు పాఠశాలలా యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాల యాజమాన్యం విద్యార్థుల స్థితిగతులపై దృష్టి పెట్టడం లేదని మండి పడుతున్నారు.

## భర్త అనారోగ్యం.. భార్య బలవన్మరణం

**హయత్‌నగర్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి):** భర్త తొమ్మిదేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితం కావడంతో మానసిక ఒత్తిడికి గురైన ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీకి చెందిన సుజాత (52) హయత్‌నగర్ లోని వర్డ్ అండ్ డీడ్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త స్వామి గత తొమ్మిదేళ్లుగా అనారోగ్యంతో బెడ్‌రెస్ట్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో సుజాత కొంతకాలంగా మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సుమారు 6.15 గంటలకు సుజాత ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఉరివేసుకున్న స్థితిలో కనిపించారు. ఆమె చిన్న కుమార్తె నిస్సి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. మృతురాలి మరణంపై ఎలాంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. మృతురాలి పెద్ద కుమార్తె వినయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నామని వనస్థలిపురం ఎస్హెచ్ఓ రవిబాబు తెలిపారు.



# మంటలు.. పొగలు.. సాంకేతిక లోపాలు




### ఎలక్ట్రిక్ బస్సుల్లో వరుస ఘటనలు

**ప్రయాణికుల్లో ఆందోళన.. బస్సుల భద్రతపై ప్రశ్నల పరంపర**

**ఎలక్ట్రిక్ బస్సులకు భద్రత ఎక్కడ?**

## ప్రాణనష్టం జరగక ముందే..

ఇప్పటివరకు జరిగిన ఘటనల్లో ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశమైనా.. వరుస ఘటనలను తేలిగ్గా తీసుకోవద్దని ప్రయాణికులు అంటున్నారు. బస్సులో పొగలు వచ్చిన వెంటనే డ్రైవర్ గుర్తించి ప్రయాణికులను దింపడం వల్ల అలుగునూరు ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ప్రతి సందర్భంలోనూ అంత సమయం, అవకాశం ఉంటుందనే హామీ లేదని వారు పేర్కొంటున్నారు. ఎలక్ట్రిక్ బస్సులపై ప్రయాణికుల్లో ఉన్న భయాందోళనలను తొలగించేందుకు అధికారులు సమగ్ర సాంకేతిక తనిఖీలు చేపట్టి, లోపాలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉంది. కారణాలు పూర్తిగా నిర్ధారణ అయ్యే వరకు భద్రతా ప్రమాణాలపై స్పష్టత ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు. లేకపోతే భవిష్యత్‌లో ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్న ప్రస్తుతం ప్రయాణికుల నుంచి వినిపిస్తోంది.

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 18, ( జనం సాక్షి)**
పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో భాగంగా ఆర్టీసీ ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు కరీంనగర్‌లో వరుస ఘటనలతో వార్తల్లోకి వస్తున్నాయి. ఒకవైపు బస్సుల్లో మంటలు చెలరేగి దగ్ధమవుతుండ గా.. మరోవైపు పొగలు రావడం, సాంకేతిక సమస్యలతో నడిరోడ్డుపై గంటల తరబడి నిలిచిపోవడం ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తోంది. తాజాగా శుక్రవారం కరీంనగర్-2 డిపోలో హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ బస్సులో మంటలు చెలరేగడం కలకలం రేపింది. సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రమాదం తప్పింది.

**అలుగునూరు ఘటనతో మొదలైన కలకలం**

కరీంనగర్‌కు విడతల వారీగా మొత్తం 104 ఎలక్ట్రిక్ బస్సులు వచ్చాయి. వీటి నిర్వహణకు కరీంనగర్-2 డిపోలో ఛార్జింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. కొంతకాలం సజావుగానే నడిచినప్పటికీ జూన్ 1న అలుగునూరు వద్ద జరిగిన ఘటనతో ఎలక్ట్రిక్ బస్సుల భద్రతపై చర్చ మొదలైంది. హైదరాబాద్‌కు వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సులో ఒక్కసారిగా పొగలు రావడాన్ని డ్రైవర్ గమనించాడు. వెంటనే బస్సును సురక్షితంగా నిలిపి ప్రయాణికులను అప్రమత్తం చేసి కిందకు దించాడు. ప్రయాణికులంతా దిగిన కొద్దిసేపటికే మంటలు బస్సు మొత్తం వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదు. బస్సు జేబీఎం కంపెనీ కి చెందినది కావడంతో సంస్థకు చెందిన ఇంజినీర్లతో పాటు ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులు ఘటనపై పరిశీలన చేపట్టా రు. అయితే ఘటనకు అసలు కారణం ఏమిటనేది ఇప్పటికీ స్పష్టంగా తేలలేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కోర్టు చౌరస్తాలో 12 గంటలు నిలిచిన బస్సు**

అగ్ని ప్రమాద ఘటనలకే పరిమితం కాకుండా ఎలక్ట్రిక్ బస్సుల్లో సాంకేతిక సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. మంగళవారం నిజామాబాద్ డిపోకు చెందిన ఓ ఎలక్ట్రిక్ బస్సు కరీంనగర్ కోర్టు చౌరస్తాలో సాంకేతిక కారణంతో నిలిచిపోయింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు దాదాపు 12 గంటల పాటు బస్సు అక్కడే ఉండిపోయింది. బస్సులో ఏర్పడిన సమస్యను పరిష్కరించేందుకు నిజామాబాద్ డిపో నుంచి ఎలక్ట్రిషియన్‌ను రప్పించారు. ఆయన బస్సును పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేసిన అనంతరం బస్సును అక్కడి నుంచి తీసుకెళ్లారు. రద్దీగా ఉండే కోర్టు చౌరస్తాలో బస్సు అంతసేపు నిలిచిపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. అలుగునూరు ఘటన అనంతరం మరో రెండు ఎలక్ట్రిక్ బస్సుల్లో పొగలు వచ్చినట్లు ఘటనలు నమోదయ్యాయి. ఒక బస్సును కోర్టు సమీపంలో, మరో బస్సును ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో నిలిపివేశారు. తాజాగా కరీంనగర్-2 డిపోలో మరో బస్సులో మంటలు చెలరేగాయి.

**కారణాలు తేలకుండానే రాకపోకలు?**

అలుగునూరు ఘటన తర్వాత జేబీఎం కంపెనీకి చెందిన ఇంజినీర్లను పిలిపించి బస్సులను తనిఖీ చేయించిన అనంతరమే రోడ్డుపైకి పంపుతున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నట్లు సమాచారం. అయినప్పటికీ సాంకేతిక సమస్యలు, పొగలు, మంటలకు సంబంధించిన ఘటనలు పునరావృతం కావడం ప్రయాణికుల్లో అనుమానాలకు తావిస్తోంది.

# ప్రాణహిత-చేవెళ్ల కడదామా? వద్దా? బీజేపీ సమాధానం చెప్పాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, అసలు ఈ ప్రాజెక్టును కడదామా? వద్దా? అనే దానిపై బీజేపీ సభ్యులు తమ స్పష్టమైన వైఖరిని చెప్పాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. శాసనసభలో ఎల్‌నినో ప్రభావం తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యల గురించి జరుగుతున్న చర్చలో భాగంగా బీజేపీ సభ్యులు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు గురించి అంశం లేవనెత్తడంతో ఆయన జోక్యం చేసుకుని మాట్లాడారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ ప్రాంతానికి గ్రావిటీ ద్వారా నీళ్లందించాలనే ఆలోచనతో తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టిన విషయాన్ని భట్టి గుర్తుచేశారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా పక్కనబెట్టి, కాళేశ్వరం వద్ద ప్రాజెక్టు కట్టి లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసిందని విమర్శించారు. తెలంగాణకు ప్రాణప్రదమైన ఈ ప్రాజెక్ట్ విషయంలో అటు బిఆర్ఎస్, ఇటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించాయని మండిపడ్డారు. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నీళ్ల కోసం. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు కోసం ఏడు మండలాలను ఆంధ్రాకు ఇవ్వడానికి వీల్లేదని సోనియా గాంధీ గారు పట్టుబట్టారు. కానీ బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కేంద్రం ఆర్డినెన్స్ తెచ్చి 2 లక్షల ఎకరాల ముంపు భూములతో కూడిన 7 మండలాలను ఏపీలో కలిపేస్తే బిఆర్ఎస్ నోరు మెదపలేదు. అక్కడ 2 లక్షల ఎకరాలు ఇచ్చేసినవారు... తుమ్మిడిహట్టి వద్ద కేవలం 2,000 ఎకరాల ముంపు సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారు?" అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ఒక్క రూపాయి పరిహారం ఎక్కువ ఇచ్చైనా సరే ముంపు భూ బాధితులను ఆదుకోవడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఆ జిల్లాకు ప్రాణహిత నీళ్లు వరప్రసాదమని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు తమ ప్రాభవాన్ని ఉపయోగించి కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర జలశక్తి శాఖను, పొరుగున ఉన్న మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి అవసరమైన అనుమతులు తీసకురావాలని కోరారు. సభ్యుడు హరీష్ రావు ఇచ్చిన సలహాను తాము సానుకూలంగా స్వీకరించి ప్రాజెక్ట్ కడతామని చెప్పామని, బీజేపీ సభ్యులు కూడా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంతో మాట్లాడి అనుమతులు తెస్తామని అంటారని ఆశించామని భట్టి చెప్పారు.

## ట్రాన్స్‌కో ఉద్యోగి కుటుంబానికి కోటి బీమా చెక్కు అందజేత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన టీజీ ట్రాన్స్‌కో ఉద్యోగి మహమ్మద్ ముజాహిద్ కుటుంబానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ. 1 కోటి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. అసెంబ్లీలోని తన చాంబర్‌లో మృతుడి తల్లి (నామిని)కి ఈ పరిహారాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అందజేశారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మన్ గా పనిచేస్తున్న మహమ్మద్ ముజాహిద్ (26) 2025 నవంబర్ 5న నైట్ షిఫ్ట్ ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జరిగినరోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీ ట్రాన్స్‌కో ఉద్యోగులకు ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ కింద కల్పిస్తున్న ప్రమాద బీమా పథకంలో భాగంగా బాధితుడి కుటుంబ సభ్యులు 2026 ఫిబ్రవరిలో క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. శాఖాపరమైన ప్రక్రియ వేగవంతం చేసి, ఆగస్టు 20న రూ. 1 కోటి పరిహారాన్ని మృతుడి తల్లి ఖాతాకు సకాలంలో జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.



# ముంపు మండలాల్లో కోర్టులు ఏర్పాటు చేయాలి

- హైకోర్టు న్యాయమూర్తులకు భద్రాచలం బార్ అసోసియేషన్ వినతి

**భద్రాచలం సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** పోలవరం ముంపు మండలాల ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడంతోపాటు, దూరప్రాంత కోర్టులకు వెళ్లే గిరిజన, గ్రామీణ ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధి బృందం శుక్రవారం అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులను కలిసి వినతిపత్రాలు సమర్పించింది. పోలవరం జిల్లాలోని ఎటపాక లేదా చింతూరు కేంద్రంగా శాశ్వత జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరింది. కోర్టు ఏర్పాటు జరిగే వరకు వారానికి రెండుసార్లు క్యాంపు కోర్టు నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. రంపచోడవరం కోర్టు పరిధిలోని చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, ఎటపాక మండలాల ప్రజలు 160 కిలోమీటర్లకు పైగా దట్టమైన అటవీ ప్రాంతాలు, ఘాట్ రోడ్ల మీదుగా ప్రయాణించి కోర్టులకు వెళ్లాల్సి వస్తోందని ప్రతినిధులు న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమయం, డబ్బు వృథా కావడంతోపాటు వృద్ధులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అదేవిధంగా ఏలూరు జిల్లా పరిధిలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు జంగారెడ్డిగూడెం కోర్టుకు 90 నుంచి 130 కిలోమీటర్ల వరకు ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. సివిల్, ఎక్సైజ్, ఫారెస్ట్, మెయింటెనెన్స్, డీవీసీ, ఎన్ఐ యాక్ట్ తదితర కేసులు కలిపి 900కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నందున, కుక్కునూరు కేంద్రంగా క్యాంపు కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ జయసూర్య, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్‌లను బార్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వివరించారు.

### బార్ అధ్యక్షుడికి సన్మానం

ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్‌ను జస్టిస్ ఎన్.హరినాథ్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సున్నం రమేష్, జనరల్ సెక్రటరీ పూసాల శ్రీనివాసాచారి, జాయింట్ సెక్రటరీ తాత లలిత, లైబ్రరీ సెక్రటరీ పడాల కవిత, లేడీ రిప్రజెంటేటివ్ ఎం.తరుణితో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# తుమ్మిడి హెట్టి పై కేంద్రాన్ని ఒప్పించండి

- రాష్ట్ర బీజేపీ నాయకులకు మంత్రి ఉత్తమ్ పిలుపు
- అవగాహనలేని రీ-ఇంజినీరింగ్‌తో కాళేశ్వరం గుండెకాయను కూల్చేశారు
- రాజకీయ కక్ష లేదు.. మూడు బ్యారేజీలను శాస్త్రీయంగా పునరుద్ధరిస్తాం



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** ఉత్తర తెలంగాణ రైతాంగ భవిష్యత్తుతో ముడిపడిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకునేలా రాష్ట్ర బీజేపీ నాయకులు ఒత్తిడి తేవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మహారాష్ట్రతో అవసరమైన అంతర్రాష్ట్ర అంగీకారం సాధించే బాధ్యతను కేంద్రం స్వీకరించేలా తెలంగాణ బీజేపీ నాయకులు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించాలని సూచించారు. రాష్ట్రంలో విమర్శలు చేయడానికే పరిమితం కాకుండా, తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం ఢిల్లీని ఒప్పించడం ద్వారా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావం, రాష్ట్రంలో సాగునీటి పరిస్థితులపై శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి నుంచి కాళేశ్వరం వరకు, శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ వరకు, పాలమూరు-రంగారెడ్డి నుంచి రాజీవ్ భీమా, జవహర్ నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ వరకు రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి పథకాల స్థితిగతులను సభ ముందుంచారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పిదాలను ప్రస్తావించిన సమయంలో ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తెలంగాణ రైతుల ఆశలకు ఆధారంగా నిలవాల్సిన నీటిపారుదల రంగాన్ని అప్పులు, అసంపూర్తి పనులు, సాంకేతిక వైఫల్యాల ఊబిలోకి నెట్టారని గద్గద స్వరంతో విమర్శించారు.

తుమ్మిడిహెట్టి కేంద్రంగా రూపొందించిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల పథకాన్ని వదిలిపెట్టడం దేశ సాగునీటి చరిత్రలోనే అతిపెద్ద వ్యూహాత్మక తప్పిదాల్లో ఒకటని ఉత్తమ్ పేర్కొన్నారు. అప్పటికే సుమారు రూ.2 వేల కోట్ల విలువైన పనులు చేపట్టిన పథకాన్ని సమగ్ర పరిశీలన లేకుండా పక్కనపెట్టి, ప్రాజెక్టు కేంద్రాన్ని మేడిగడ్డకు మార్చారని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద అందుబాటులో ఉన్న ప్రాణహిత జలాలను గ్రావిటీ ఆధారంగా శ్రీపాద ఎల్లంపల్లికి తరలించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉంటే, ఉత్తర తెలంగాణలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందేదని చెప్పారు. సుమారు రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే అవకాశమున్న ప్రణాళికను అహంకారపూరితమైన రీ-ఇంజినీరింగ్‌తో లక్ష కోట్లకు మించిన ఆర్థిక భారంగా మార్చారని మంత్రి ఆరోపించారు. వ్యయాన్ని పెంచడం తప్ప ఆయకట్టుకు నమ్మకమైన నీరందించే వ్యవస్థను నిర్మించలేకపోయారని విమర్శించారు. భారీగా ప్రజాధనం వెచ్చించినప్పటికీ కాళేశ్వరం వ్యవస్థకు ఆరంభ ద్వారమైన మేడిగడ్డే కుంగిపోవడం గత పాలకుల అవగాహన లోపానికి, ప్రణాళికా వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమన్నారు.

వేల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం గుండెకాయ కళ్లముందే కుప్పకూలిపోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయిన తరువాత కూడా గత పాలకులు తమ తప్పును అంగీకరించకుండా ప్రస్తుత ప్రభుత్వంపై ఎదురుదాడి చేయడం హాస్యాస్పదమన్నారు. డీపీఆర్‌లో పొందుపరిచిన సాంకేతిక ప్రమాణాలు, నిర్మాణ సమయంలో అనుసరించిన పునాది విధానం, నాణ్యత నియంత్రణ, నిర్వహణ నిర్ణయాలపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భద్రతా కారణాలతో బ్యారేజీల గేట్లు మూసి నీటిని నిల్వ చేయలేని పరిస్థితిలో పంపులను ఆన్ చేయాలన్న డిమాండ్ సాంకేతిక వాస్తవాలను విస్మరించడమేనని స్పష్టం చేశారు. మూడు బ్యారేజీల భద్రతపై రాజకీయ నిర్ణయాలు తీసుకునే ప్రసక్తే లేదని మంత్రి తేల్చిచెప్పారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ డ్యాం భద్రతా సంస్థ, కేంద్ర జల సంఘం సూచించిన ప్రతి పరీక్షను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో అవసరమైన క్షేత్రస్థాయి పరీక్షలు చేపట్టగా, పునరుద్ధరణ డిజైన్ల బాధ్యతను ఏఎఫ్ఆర్‌పై ఇండియా-ఐఐటీ బాంబే నిపుణులకు అప్పగించినట్లు తెలిపారు. పునాదుల స్థితి, సీపేజ్, అప్‌లిఫ్ట్ ప్రెజర్, కాంక్రీట్ నాణ్యత, స్టిల్లింగ్ బేసిన్, ఎనర్జీ డిసిపేషన్ వ్యవస్థలను శాస్త్రీయంగా పరిశీలించిన తరువాతే తుది పునరుద్ధరణ పనులు చేపడతామని చెప్పారు.

"మాకు రాజకీయ కక్ష లేదు. కాళేశ్వరం ప్రజల సొత్తు; అందులో ఖర్చయింది తెలంగాణ ప్రజల ధనం. అవసరమైన వ్యయం ఎంతైనా సరే, నిపుణుల సిఫారసులకు అనుగుణంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నదే మా సంకల్పం. ప్రజల ప్రాణాలు, ప్రాజెక్టు భద్రత విషయంలో మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోం" అని ఉత్తమ్ ప్రకటించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 90 శాతం పూర్తయిందన్న గత పాలకుల వాదనను మంత్రి తోసిపుచ్చారు. కొన్ని పంప్‌హౌస్‌లు లేదా రిజర్వాయర్ల నిర్మాణాన్నే మొత్తం ప్రాజెక్టు పురోగతిగా చూపడం సాంకేతికంగా సరికాదన్నారు. ఇంటేక్ వెల్, పంప్‌హౌస్‌లు, విద్యుత్-యాంత్రిక వ్యవస్థలు, ప్రెజర్ మెయిన్లు, రిజర్వాయర్లు, కాలువల నెట్‌వర్క్, భూసేకరణ, పునరావాసం, పర్యావరణ అనుమతులు పూర్తయినప్పుడే ఒక ఎత్తిపోతల పథకం రైతుకు ప్రయోజనం అందిస్తుందని వివరించారు. పెండింగ్ అంశాలను పరిష్కరించి ప్రజాధనం వృథా కాకుండా ఈ పథకాన్ని పూర్తి చేసే బాధ్యతను ప్రజా ప్రభుత్వం స్వీకరించిందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వినియోగించిన నీటి వివరాలను మంత్రి సభ ముందుంచారు.

తెలంగాణ తనకు లభ్యమైన నీటిని ఉపయోగించకుండా పొరుగు రాష్ట్రానికి వదిలేస్తోందన్న ప్రచారాన్ని గణాంకాలతో ఖండించారు. కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన ప్రతి చుక్క కోసం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, ట్రిబ్యునల్, కేంద్ర ప్రభుత్వం సహా అన్ని చట్టబద్ధ వేదికలపై బలమైన వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. 'తుమ్మిడిహెట్టి తెలంగాణకు ఒక ప్రాజెక్టు మాత్రమే కాదు; ఉత్తర తెలంగాణ రైతాంగం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జలస్వప్నం. రాష్ట్ర బీజేపీ నాయకులు కేంద్రాన్ని కదిలించి, మహారాష్ట్రతో అంగీకారం సాధించేలా సహకరించాలి. మేము రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాల్లో ఒక్క చుక్కను కూడా వదులుకోము. గత పాలకుల తప్పిదాలను సరిదిద్దుతూ, ప్రతి ప్రాజెక్టును రైతుకు ఫలితమిచ్చే జీవనధారగా తీర్చిదిద్దుతాం" అని మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

### మిల్లర్ల సమస్యలకు సానుకూల పరిష్కారం దిశగా ప్రభుత్వం

రైస్ మిల్లర్లు సమ్మెకు దిగిన నేపథ్యంలో నెలకొన్న పరిస్థితికి సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రివర్గ ఉపసంఘం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల మధ్య శుక్రవారం జరిగిన సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. పరస్పర విశ్వాసం, సహృద్భావ వాతావరణంలో జరిగిన ఈ చర్చల్లో మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సావధానంగా విని, నిబంధనల పరిధిలో సానుకూల పరిష్కారం చూపేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమలు-ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్, అదనపు డైరెక్టర్ రోహిత్ పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ నగర్‌లో భారీ భవనం కుంగుబాటు

- కుంగిన భవనానికి ఓవైపు కూల్చివేతలు..
- మరోవైపు పవర్ బోర్ తవ్వకాలే కారణం అంటున్న స్థానికులు
- శుక్రవారం రాత్రికి కూలుస్తున్న హైడ్రా అధికారులు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధి ఎన్టీఆర్ నగర్ లో శుక్రవారం ఓ నాలుగు అంతస్తుల భవనం కుంగుబాటు స్థానికంగా తీవ్ర భయాందోళనలను రేకెత్తించింది. దాదాపు 30 మంది వ్యక్తులు నివాసముండే పేయింగ్ గెస్ట్ హాస్టల్ గా కొనసాగుతున్న సదరు భవనం ను ఆనుకొని ఓవైపు ఓ కట్టడాన్ని కూల్చివేయగా మరోవైపు అదే సమయంలో పవర్ బోర్ తవ్వకాలను జరపడంతో రెండు వైపుల నుండి కలిగిన ఒత్తిడికి తోడు భూమిలో ఏర్పడిన ప్రకంపనల వల్ల సరియైన పునాదిలేని సదరు భవనం ఒక్కసారిగా కుదుపుకులోనై పక్కకు ఒరిగి పక్కనే ఉన్న మరో అయిదు అంతస్తుల భవనం అండతో తాత్కాలికంగా నిలబడటం గమనార్హం.

### అసలే 50 గజాలు ఆపై నాలుగు అంతస్థులా... స్థానికుల మండిపాటు

ఈ మధ్యనే చోటు చేసుకున్న మాదాపూర్ సర్కిల్ అంజయ్య నగర్ ఏడంతస్తుల మేడ కుప్ప కూలిపోయిన ఘటనతో మాదాపూర్ సర్కిల్లో ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందో అంతుబట్టని భయాందోళనకర పరిస్థితులు నెలకొన్న అన్నది నగ్న సత్యం. ఈ నేపథ్యంలో అంజయ్య నగర్, సిద్ధిక్ నగర్ ప్రాంతంలో 50 గజాల రూపంలో ఉన్న అక్రమ కట్టడాలను కొన్నింటిని సిఎంసి, హైదరాబాద్ విభాగం అధికారులు కూల్చివేసినప్పటికీ ఎన్టీఆర్ నగర్ వైపు కన్నెత్తి చూడకపోవడంపట్ల స్థానికులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. భవనం కుంగుబాటుకు గురైతే తప్ప అటువైపు సీఎంసీ అధికారులు కన్నెత్తి చూడకపోవడం, హైడ్రా అధికారులు తనిఖీలు చేపట్టకపోవడం ఎంతవరకు సమంజసం అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 50 గజాల స్థలంలో ఐదు నుండి ఎనిమిది అంతస్తుల వరకు భవనాలను నిర్మించడం ఎంతవరకు సమంజసం అని, ఎంతమంది జీవితాలతో నిర్మాణదారులు చెలగాటమాడాలని చూస్తున్నారో అంతు పట్టడం లేదని స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు.

### రాత్రికి హైడ్రా కూల్చివేతలు...

ఎన్టీఆర్ నగర్ లో కుంగుబాటుకు గురైన నాలుగు అంతస్తుల భవనం ప్రమాదకరంగా మారి ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో అందులోని దాదాపు 30 మంది వ్యక్తులను ఖాళీ చేయించి శుక్రవారం రాత్రికి దానిని పూర్తిగా నేలమట్టం చేయడానికి హైడ్రా విభాగం అధికారులు కసరత్తును ప్రారంభించారు. కుంగుబాటుకు గురైన భవనం ను కూల్చివేసే క్రమంలో దానికి అండగా నిలిచిన భవనం ఏమైనా శిథిలమైతే దానిని కూడా పూర్తిగా కూల్చివేయడానికి హైడ్రా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో సదరు రెండు భవనాల పరిసర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించి కూల్చివేత చర్యలకు పూనుకోనున్నట్లు హైడ్రాధికారులు స్పష్టం చేస్తున్నారు.



## చర్లలో ఏసీబీకి చిక్కిన హాస్టల్ వార్డెన్!

**చర్ల, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామంలో గల ఎస్టి బాలుర హాస్టల్ వార్డెన్ శుక్రవారం అనూహ్యంగా ఏసీబీ అధికారులకు చిక్కారు. అదే హాస్టల్లో పని చేస్తున్న వంట మనిషికి జీతం బిల్లులు ఇవ్వడానికి 14 వేల రూపాయలు లంచం అడిగి తీసుకుంటుండగా ఏసీబీ డిఎస్పి రమేష్ ఆధ్వర్యంలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. లంచం ఇస్తే తప్ప బిల్లులు చేయనని వార్డెన్ మొండిగా చెప్పడంతో విసిగిపోయిన ఆ పేద వంట మనిషి గత్యంతరం లేని స్థితిలో ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్లాన్ చేసి అధికారులు వార్డెన్ ను పట్టుకున్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# నేడు కోదాడలో మెగా జాబ్‌మేళా

- 300కు పైగా కంపెనీలు.. 3,500కు మించిన ఉద్యోగావకాశాలు
- ఐదు జిల్లాల యువతీ యువకులకు ఒకే వేదికపై ఇంటర్వ్యూలు
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి చొరవతో మెగా జాబ్ మేళా



**కోదాడ, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో శనివారం కోదాడలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేళాలో 300కు పైగా కంపెనీలు పాల్గొని, 3,500కు మించిన ఉద్యోగాలను కల్పించేందుకు నియామక ప్రక్రియ చేపట్టనున్నాయి. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి సమన్వయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ ఈ మేళా నిర్వహణకు సహకరిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆహ్వానించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి--భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి--కొత్తగూడెం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ మేళాలో పాల్గొననున్నారు. కంపెనీల ప్రతినిధులతో నేరుగా మాట్లాడడంతోపాటు ఒకే చోట ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం వారికి లభించనుంది. ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ పట్టభద్రులతోపాటు డిప్లొమా, ఇతర విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు తమకు సరిపడే ఉద్యోగాలను గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ ఇంటర్వ్యూల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లడం, కంపెనీలను నేరుగా సంప్రదించలేకపోవడం, సరైన సమాచారం అందకపోవడం వంటి సమస్యలు గ్రామీణ యువతకు అడ్డంకిగా మారుతున్నాయి. ఈ ఇబ్బందులను తగ్గించి, కంపెనీలనే యువతకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో కోదాడలో ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేశారు.

2025 అక్టోబర్‌లో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 200కు పైగా కంపెనీలు పాల్గొనగా, సుమారు 900 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ మేళా విజయాన్ని కొనసాగిస్తూ ఈసారి మరింత భారీ స్థాయిలో కోదాడలో నియామక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఐదు జిల్లాల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగాన్ని పొందేందుకు శనివారం కోదాడలో జరిగే మెగా జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370